
Deccan Land




March 2026

Deccan Land March

మార్చి - 2026

DECCAN LAND, HYDERABAD

163

MARCH - 2026

PRGI Regn. No. TELTEL/2012/46784

₹30

సంపుటి : 14

సంచిక : 7

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక




VOL 14వ వసంతంలో

163 ISSUES నూట అరవై మూడవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్

- భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్
- ఒలందులైన హాలండీయులు - డచ్‌వారు
- జోడు నామాల దుబ్బాక
- పక్షి వైవిధ్యం - వ్యవసాయ మార్గనిర్దేశం




'భూపతి చంద్ర' మెమోరియల్ ట్రస్ట్ కథానికల బహుమతి ప్రదానోత్సవ సభ ఫిబ్రవరి 19న హైదరాబాద్ నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు ఎమ్.ఎల్. కాంతారావు, ప్రొఫెసర్ సి. మృణాళిని, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె. శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ ఖదీర్‌బాబు, సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతినిధి బి.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.


















**UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2025**

Serial Nomination for

Chettinad, Village Clusters of the Tamil Merchants

in Sivagangai & Pudukottai Districts, Tamil Nadu State,

Province or Region India. Category: Natural

## తమిళ వ్యాపారుల గ్రామ సమూహాలు చెట్టినాడ్

తమిళనాడులోని శివగంగ మరియు పుదుక్కోట్టై జిల్లాల్లో విస్తరించి ఉన్న చెట్టినాడ్ ఒక అద్భుత చారిత్రక, సాంస్కృతిక ప్రాంతం. "నాట్టుకోట్టై చెట్టియార్ల" అనే శక్తివంతమైన వ్యాపార సామాజిక వర్గానికి ఇది నిలయం. చెట్టినాడ్ అంటే కేవలం ఒక గ్రామం కాదు, ఇది 73 నుండి 75 గ్రామాల కలయిక (గతంలో 96 గ్రామాలు ఉండేవి). కారైకుడి ఈ ప్రాంతానికి ప్రధాన కేంద్రం. వీరు తాము సంపాదించిన సంపదతో నిర్మించిన భవంతులు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. బర్మా టేకు, ఇటాలియన్ మార్బుల్, బెల్జియం గ్లాస్ వంటి విదేశీ వస్తువులతో కోటల్లాంటి ఇళ్లను నిర్మించారు. ప్రతి ఇంట్లోనూ లోపలి భాగం చల్లగా ఉండేలా నిర్మించిన విశాలమైన ప్రాంగణాలు (కంట్రీ యార్డ్స్) ప్రత్యేక ఆకర్షణ.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## మూన్‌స్టోన్ ముచ్చట్లు

రచయిత చకిలం వేణుగోపాలరావు ఫిబ్రవరి మాసంలో రాసిన 'చంద్రకాంతశిల' ఆర్టికల్ చదివి స్టోన్స్ గురించి తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. మూన్ స్టోన్లకు ఉన్న ఇతర పేర్ల గురించి, చంద్రునికి ప్రియమైన అనే అర్థంలో చంద్రకాంత చంద్రమణి అనే పేరు ఉందని అర్థమైంది. అద్యూలారియా అనే స్టోన్ స్విట్జెర్లాండ్‌లోని అద్యులా పర్వతాలలో లభించటం వల్ల గ్రీకు చంద్ర దేవత పేరుతో హెకటోలైట్ అనే పేరు వచ్చిందనే విషయం చాలా చక్కగా తెలిపారు. ఇలా భౌమ మరియు ఖనిజ సమాచారం, రెండు ఖనిజాల పొరల ఏర్పాటు, భౌమ పరిస్థితుల ప్రభావం, స్టోన్‌కు వచ్చే మెరుపు గురించి అద్భుతంగా వివరించారు. ప్రాచీన సంస్కృతులలో చంద్రకాంత శిల దాని చరిత్ర గురించి చక్కగా తెలియజేశారు. భారతీయులే కాకుండా రోమన్లు కూడా ఈ స్టోన్ల గురించి బలంగా నమ్మే వారని చాలా ఆసక్తిగా వివరించారు.

– అమర్నాథ్, ఆర్కియాలజీ విద్యార్థి, నల్లగొండ

❖ ❖ ❖

## సిద్ధాంతాలను వదలి కాంగ్రెస్‌లోకి

'పరకాల శేషావతారం' గురించి రచయిత ఎసికె. శ్రీహరి తెలియని ఎన్నో విషయాలు తెలియజేశారు. వారు అండర్‌గ్రౌండ్‌లో పనిచేసినప్పుడు ఎదుర్కొన్న సంఘటనలు, రాజకీయంలో ఎదుర్కొన్న ఒడిదుడుకుల గురించి చాలా వివరంగా వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నర్సాపురం శాసనసభ నియోజకవర్గం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, జలగం వెంగళరావు, టి. అంజయ్య, మర్రి చెన్నారెడ్డి గార్ల మంత్రి వర్గంలో మంత్రిగా పని చేసిన శేషావతారం 1981లో మరణించడం రాజకీయ వ్యవస్థకు చాలా లోటు. శేషావతారం, సతీమణి కాళికాంబ ఇద్దరూ కమ్యూనిస్టు కార్యకర్తలు కావడం విశేషం. అండర్ గ్రౌండ్‌లో ఉన్న సమయంలో కాళికాంబ అనుభవించిన కష్టాల గురించి కళ్ళకు కట్టినట్లు వివరించారు. శేషావతారం మరణాంతరం 1981లో నర్సాపురం పోటీ చేసిన కాళికాంబకు పార్టీ ఇచ్చే ఫండ్ ఆమెకు చేరకున్నా, వస్తువులు తాకట్టి పెట్టి వచ్చిన డబ్బుతో ప్రచారం నిర్వహించి 800 ఓట్ల మెజారిటీతో గెలవడం, అప్పుడు అంజయ్యగారు వచ్చి కాళికాంబ చేతులు పట్టుకుని నన్ను బ్రతికించావు కాళికాంబ అని అనడం, విసుగు విరామం లేకుండా కార్యక్రమాలు చేసిన కాళికాంబ మళ్లీ ఎన్నికల ప్రకటన రాగా కుటుంబ బాధ్యతల వల్ల పోటీ చేయకుండా రాజకీయాల నుండి విరమించుకున్న విషయాలను చాలా క్లుప్తంగా, సరళంగా తెలియజేశారు.

– బి. రమేష్, రాజమండ్రి

❖ ❖ ❖

## బాల్య జ్ఞాపకాలు..

'ఒక పాట వంద జ్ఞాపకాలు' శీర్షికతో రచయిత పరవస్తు లోకేశ్వర్ నన్ను మళ్ళీ బాల్యంలోకి తీసుకెళ్ళారు. ఆయన రచనా శైలి, పదాల సరళితో రాసే వ్యాసాలు చదువు తుంటే పక్కింట్లో, మనింట్లో జరిగినట్లుగా ఉంటుంది. కథలో లీనమై మైమరిచి చదవాలనిపిస్తుంది. బాల్యం జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి నాటి స్కూల్ రోజులు, కాలేజీ రోజులు, ఆనాటి దుకాణాలు, మనుషులు జ్ఞాపకం వస్తారు. వారు కథ రాసిన, పాట రాసిన చెప్పే తీరు చాలా గమ్మత్తుగా ఉంటుంది. హైదరాబాద్ పాతనగరంలో కుర్మగూడెం బస్తీ, అలియాబాద్ దర్వాజాకు వెళ్లే తోవల కుడివైపు ఒక చిన్న కమాన్, అందులోకి వెళ్లి తిరిగి ఎడమవైపు మళ్లంగనే కుర్మగూడెం బస్తీ, దానిని దాటి సీదా వెళ్లితే గాజీబండ బస్తీ. వారి బస్తీలోకి మనల్ని కూడా తీసుకెళ్లారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ప్రహ్లాద్, హైదరాబాద్

❖ ❖ ❖

## స్టాండర్డ్ పత్రిక దక్కన్‌ల్యాండ్

దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక చాలా అద్భుతంగా ఉంది. ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. సమకాలీన పత్రికా ప్రపంచంలో ఇంత అద్భుతమైన పత్రిక రావడం లేదు. మీ మేధో సంపదను, శక్తియుక్తులను రంగరించి చక్కటి రూపాన్ని కల్పిస్తున్నందుకు అభినందన చందనాలు, నమస్సుమాంజలు.

– విష్ణు వర్ధన్, హైదరాబాద్ ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింపజేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

– ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 7 పేజీలు : 60

మార్చి - 2026

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

వాణిజ్య ప్రకటనలు
**కె. సచిన్**
86866 64949

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**తమిళ వ్యాపారుల గ్రామ సమూహాలు చెట్టినాడ్**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020
Mobile: 90599 50055
deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.



కవర్ స్టోరీ
29వ పేజీలో

# లోపలి పేజీల్లో...

న్యాయ పాలన
తెలుగులో ఎప్పుడు!





ఒక పాట
వంద జ్ఞాపకాలు





రంగస్థల తొలి పద్మభూషణుడు ఏఆర్. కృష్ణ ..................... ఎసికె. శ్రీహరి ..................... 6
2026 అంతర్జాతీయ మహిళాదినోత్సవ లక్ష్యం... (ఎడిటోరియల్) వేదకుమార్. యం ..................... 7
సూర్యకాంత మణి ..................... చకిలం వేణుగోపాలరావు ..................... 9
మానవ స్వభావానికి సాధనం రంగస్థలం ..................... కొత్వాల్ సచిన్ ..................... 12
ఒకపాట వంద జ్ఞాపకాలు ..................... పరవస్తు లోకేశ్వర్ ..................... 13
ఉట్నూరు బూడిద దిబ్బ! ..................... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ..................... 16
భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ ..................... కట్టా ప్రభాకర్ ..................... 17
అడవుల రక్షణ అందరి బాధ్యత ..................... దక్కన్ న్యూస్ ..................... 22
ఒలందులైన హాలండీయులు-డచ్‌వారు ..................... మహ్మద్ సిలార్ ..................... 23
దాదాపూర్లో రాతియుగం ఆనవాళ్లు ..................... అవుటి శాంతు కుమార్ ..................... 26
నల్గొండ జిల్లా కాచరాజుపల్లి వద్ద రాగి నిక్షేపాలు ..................... కమతం మహేందర్‌రెడ్డి ..................... 27
తమిళ వ్యాపారుల గ్రామ సమూహాలు చెట్టినాడు ..................... ఎన్. వంశీమోహన్ ..................... 29
మానవాళి భవితకు జలభద్రత ..................... సుభాష్ ..................... 36
దాశరథి సైన్స్, సామాజిక గీతంలో వైవిధ్యం ..................... డా॥ నాగసూరి వేణుగోపాల్ ..................... 37
న్యాయ పాలన తెలుగులో ఎప్పుడు! ..................... మంగారి రాజేందర్ (జింబో) ..................... 39
జోడునామల దుబ్బాక చరిత్ర ..................... శ్రీరామోజు హరగోపాల్ ..................... 41
ఐనవోలు పునాదులపై కాకతీయ కీర్తి తోరణం ..................... బావండ్ల నారాయణ ..................... 45
భూగోళం - అంతర్గత, బాహ్యకారకాలు! ..................... డా॥ లచ్చయ్య గాండ్ల ..................... 47
పక్షి వైవిధ్యం - వ్యవసాయ మార్గనిర్దేశం ..................... డౌన్ టు ఎర్త్ ..................... 51
యం.యస్. ఆచార్య ..................... కె. సత్యప్రసన్న ..................... 53
ట్రూ అడ్వెంచర్స్ ఆఫ్ జియాలజిస్ట్స్ ..................... కమతం మహేందర్‌రెడ్డి ..................... 55
పరీక్షల సమయం ..................... దామోదర నర్సయ్య ..................... 56
పూటకూళ్ళవ్వ (కథ) ..................... మాదారపు వాణిశ్రీ ..................... 57

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# రంగస్థల తొలి పద్మభూషణుడు ఏఆర్. కృష్ణ

నటుడు, దర్శకుడు, ప్రయోక్త ఏఆర్. కృష్ణ ఆధునిక తెలుగు సామాజిక నాటకానికి ఆద్యులు. ఆయన పూర్తిపేరు అడుసుమిల్లి రాధాకృష్ణశాస్త్రి. వేమూరు మండలం పెరవలిలో 1926 నవంబరు 13న జన్మించారు. చిన్ననాటి నుంచే కళల పట్ల ఆసక్తి చూపిన ఆయన, గ్రామీణ జాతరలు, హరిదాసుల కథలు, యక్షగాన ప్రదర్శనలు, పాఠశాల నాటకాల ద్వారా రంగస్థల ప్రపంచానికి ఆకర్షితులయ్యారు. ఆ కాలంలో నాటకం కేవలం వినోద సాధనమే కాకుండా, సామాజిక మార్పు కోసం ఒక శక్తివంతమైన మాధ్యమంగా ఎదుగుతోంది. స్వాతంత్ర్యోద్యమ ప్రభావం, సాహిత్య పునరుజ్జీవనం, సామాజిక సంస్కరణల వాతావరణం ఆయన ఆలోచనలకు దారితీసింది. ఈ నేపథ్యం ఆయనను ఒక బాధ్యతాయుత కళాకారుడిగా తీర్చిదిద్దింది.



నాటకోద్యమమే ఊపిరిగా జీవించారు. ప్రపంచ నాటకంలో మార్పుల కనుగుణంగా ఎన్నో ప్రయోగాలు చేశారు. జానపద కళలకు ఊపిరి పోశారు. నాట్య విద్యాలయంతో ఎందరినో తీర్చిదిద్దారు. రాష్ట్ర ప్రభుత్వ నాటక విద్యాసంస్థ, నటమండలి (రిపర్టరీ)కి అధ్యక్షుడిగా, దర్శకుడిగా రంగస్థల అభివృద్ధికి జీవితకాలం కృషి చేశారు. హైదరాబాద్‌లో ఎల్ఎంఈ చదివి, రాష్ట్ర విద్యుత్ బోర్డులో సూపర్‌వైజరుగా చేరారు. 1945 ప్రాంతంలో నాటకరంగాన్ని కార్యక్షేత్రంగా చేసుకున్నారు. 'ఇండియన్ నేషనల్ థియేటర్'తో నాటక ప్రదర్శనల వెల్లువను సృష్టించారు. ఢిల్లీలోని భారతీయ నాట్యసంఘం సంయుక్త కార్యదర్శిగా ఎంపికయ్యారు. లండన్ డ్రామా లీగ్ నుంచి అధ్యాపక పట్టా పొందారు. ఫోర్డ్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌తో అమెరికాలో నాటకరంగ అధ్యయనం చేశారు.

### నాటక రంగంలో ప్రస్థానం

ఎ.ఆర్.కృష్ణ గారి రంగస్థల ప్రస్థానం నటుడిగా ప్రారంభమైంది. ఆయన సహజమైన భావవ్యక్తీకరణ, గంభీరమైన స్వరనాదం, పాత్రలో లీనమయ్యే నైపుణ్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవి. పురాణ, సామాజిక, చారిత్రక నాటకాలలో విభిన్న పాత్రలు పోషించి విశేష ఖ్యాతి పొందారు. ప్రత్యేకంగా కుటుంబ సంఘర్షణలు, నైతిక విలువలు, సమాజంలోని అన్యాయాలపై ఆధారిత పాత్రలను ఎంతో సహజంగా ఆవిష్కరించారు.

తరువాత రచయితగా, దర్శకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. కథా నిర్మాణంలో గాఢత, సంభాషణలలో సరళత, భావప్రధానత ఆయన రచనలకు ప్రత్యేకతను తెచ్చాయి. పాటలకే ప్రాధాన్యం ఉన్న పాత శైలిని తగ్గించి, కథానిర్మాణం, పాత్రాభివృద్ధి, భావవ్యక్తీకరణకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. రంగస్థల విన్యాసాలు, కాంతి వినియోగం, వేదిక నిర్మాణం వంటి అంశాలలో కూడా నూతనతను ప్రవేశపెట్టారు.

### వృత్తిపరమైన నాటక పద్ధతులు

ఎ.ఆర్.కృష్ణగారు నాటక రంగంలో క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. రిహార్సల్స్‌ను కచ్చితంగా నిర్వహించడం, ప్రతి పాత్రకు సముచితమైన శిక్షణ ఇవ్వడం, వేదికపై సమయపాలన పాటించడం వంటి అంశాలను కచ్చితంగా అమలు చేశారు. నటుడు పాత్రలో పూర్తిగా లీనమవ్వాలని, సంభాషణను అర్థంతో పలకాలని ఆయన ఉపదేశించేవారు. ఈ విధానాల వల్ల తెలుగు నాటక రంగం మరింత ప్రొఫెషనల్‌గా మారింది.

### ప్రభావం మరియు మార్గదర్శకత్వం

ఎ.ఆర్.కృష్ణ గారు కేవలం నటుడు మాత్రమే కాకుండా, గొప్ప గురువుగా కూడా నిలిచారు. అనేక యువ కళాకారులకు శిక్షణ ఇచ్చి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. ఆయన వద్ద శిక్షణ పొందిన పలువురు తరువాత సినీ, టెలివిజన్ రంగాల్లో కూడా విశేష స్థానం సంపాదించారు. భాషా శుద్ధి, భావాల స్పష్టత, సంభాషణలలో సహజత్వం వంటి అంశాలపై ఆయన ఇచ్చిన మార్గదర్శకత్వం తరతరాలకు ఆదర్శంగా నిలిచింది.

### సాంస్కృతిక పునరుజ్జీవనంలో పాత్ర

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఎ.ఆర్. కృష్ణ గారి పాత్ర విశేషమైనది. నాటకాన్ని ఒక సామాజిక సాధనంగా ఉపయోగించి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నించారు. సమాజంలో ఉన్న కుల వివక్ష, మహిళల స్థితి, కుటుంబ విలువల క్షీణత వంటి అంశాలను తన నాటకాల ద్వారా ప్రస్తావించారు. కళ ద్వారా సమాజానికి మార్గనిర్దేశం చేయాలనే ఆయన ధ్యేయం స్పష్టంగా కనిపిస్తుంది.

(మిగతా 8వ పేజీలో)

# మహిళా రైతులకు భరోసానిస్తున్న 2026 అంతర్జాతీయ మహిళాదినోత్సవ లక్ష్యం..




ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ జరుపుకోవడం మనకు తెలుసు. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారు. 1908లో న్యూయార్క్ నగరంలో 15వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా 1909లో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించారు. వివిధ దేశాలలో వివిధ రూపాలలో మహిళా దినోత్సవాలు ప్రారంభమయ్యాయి. 1914లో పూణేలో తొలి మహిళాదినోత్సవం జరిగింది. 1910లో జరిగిన ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఉమెన్ సదస్సు ఈ ఉత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని ప్రతిపాదించింది...

1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచదేశాలన్నిటా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రతి దినోత్సవానికీ ఒక థీమ్‌ని ప్రకటిస్తుంది. 2026ని అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవంగా ప్రకటించింది. మహిళా రైతులకు భూమి, ఆర్థిక సహాయం, టెక్నాలజీలో శిక్షణ, వారి హక్కుల్ని కాపాడేలా, వ్యవసాయ రంగంలో స్త్రీ, పురుషుల మధ్య వేతనాల తేడాలను తొలగించేలా ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది. ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ దీన్ని అధికారికంగా లాంచ్ చేసి ఇతర సంస్థలతో కలిసి దీన్ని ప్రోత్సహిస్తుంది.

మన గ్రామీణ భారతీయ వ్యవసాయరంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. మహిళలు లేని వ్యవసాయాన్ని అస్సలు ఊహించలేం. కానీ వాళ్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. భూమి యజమాన్య హక్కులు పరిమితంగా ఉండటం, ఆర్థిక సహాయం లేకపోవడం, రుణ సౌకర్యాలు అందకపోవడం, పనిలో, వేతనాల్లో స్త్రీ పురుష వివక్ష, పొలం పనులతో పాటు ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం, వృద్ధుల సంరక్షణ వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏ ప్రకృతి విపత్తు జరిగినా ఆహార అభద్రతకు గురయ్యేది ఎక్కువ మహిళలే. ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల ఆస్తమా, క్యాన్సర్లకు గురయ్యేది కూడా ఎక్కువ మహిళలే. ఐక్యరాజ్యసమితి థీమ్ సక్రమంగా అమలు జరిగితే 45 మిలియన్ల మందికి ఆహార భద్రత, 58 మిలియన్ల మహిళలకు ఆదాయం పెరుగుదల సాధ్యమవుతుంది. ఆదాయ పెరుగుదల మహిళల ఆత్మస్థైర్యానికి, గౌరవానికి, స్వావలంబనకు దోహదం చేస్తుంది.

అంతర్జాతీయ దినోత్సవం సభలకు, సంబరాలకు, ఆడంబర ప్రకటనలకు పరిమితం కాకుండా ఐక్యరాజ్య సమితి ఉద్దేశించిన లక్ష్య సాధనకు కృషి చేయాలి.

మహిళా సాధికారతా స్వప్నాలు అప్పుడే నిజమవుతాయి.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

### ప్రతి జిల్లాకు నాట్య సంఘం విస్తరణ

1954లో ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘాన్ని ఏఆర్. కృష్ణ స్థాపించి, దాని శాఖల్ని ప్రతి జిల్లాకు వ్యాపింపజేశారు. కన్యాశుల్కం, వీలునామా, రామదాసు, మాలపల్లి వంటి నాటకాలను, మరాఠీ, బెంగాలీ, కన్నడ, తమిళ, మలయాళం భాషల్లోని ఉత్తమ నాటకాలను అనువదింపజేసి, ప్రదర్శింపజేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శనను ఢిల్లీ నాటకోత్సవాలకు పంపుతూ వచ్చారు. తోలుబొమ్మలాటను పునరుద్ధరించి, ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్‌లో ప్రదర్శింపజేశారు. తెలుగు జానపద కళలకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చారు. యక్షగానానికి రంగస్థలంపై ప్రాణప్రతిష్ట చేశారు. తన సంపాదకత్వంలో వచ్చిన 'రంగస్థల శాస్త్రం' తెలుగులో నాటక విద్యాబోధనకు పెద్ద బాలశిక్ష.



### నటీనటులకు శిక్షణ

నటీనటులకు శిక్షణ ఆవశ్యకతను గుర్తించి, అందుకు బలమైన పునాది వేశారు. సంస్కృత ప్రకరణం 'మృచ్ఛకటికం'ను తెలుగు వ్యావహారిక భాషలో ప్రదర్శించారు. చారిత్రాత్మక 'ప్రతాపరుద్రీయం'లో తాను పేరిగాడిగా నటించి, దర్శకత్వం వహించారు. కుందుర్తి వారి 'ఆశ'తో కవితా నాటక ప్రయోగం చేశారు. శ్రీశ్రీ 'విదూషకుడి ఆత్మహత్య'తో అధివాస్తవికవాద రూపకాన్ని ప్రయోగించారు. 'మాలపిల్ల' నాటకాన్ని హైదరాబాద్‌లో వరుసగా 40 రోజులు ప్రదర్శించటమే కాదు...ఒకేచోట 12 రంగస్థలాలపై ప్రదర్శింపజేయడం మరో విశేషం. 'ఆత్మవంచన' వంటి నాటకం ప్రదర్శనలతో భావితరానికి మార్గనిర్దేశనం చేశారు. శ్యామ్‌బెనగల్ 'అనుగ్రహం', మృణాల్‌సేన్ 'ఒక ఊరికథ' సినిమాల్లో నటించారు.

### నాటకాభివృద్ధికి విశేష కృషి

రాష్ట్ర సంగీత నాటక అకాడెమీ సభ్యుడిగా, యునెస్కో అంతర్జాతీయ నాటక సంస్థ సభ్యుడిగా, మూడో ప్రపంచ నాటక సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్రంలో నాటకాలకు వినోదం పన్ను రద్దు చేయించారు. నాటక బృందాలు ఒక చార్జీతోనే దేశంలో ఏ మూలకైనా రైలులో వెళ్లి రావడానికి కృషి చేసి, సాధించారు. రంగస్థల అభివృద్ధికి 'నాట్యమిత్ర పథకం' ప్రవేశపెట్టారు. వృత్తి కళాకారుల కోసం 1971లో ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల సంఘాన్ని ఏర్పాటుచేయించారు. తనకున్న కొద్దిపాటి ఆస్తిలోనే రూ.75 వేలను నాటకరంగ అభివృద్ధికి కార్పస్ ఫండ్‌గా ఇచ్చారు. ఏఆర్. కృష్ణకి కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 'పద్మభూషణ్'తో సత్కరించింది. ఆయన 1992లో మృతిచెందారు. నాటక రంగంలో ఒకే వ్యక్తి ఇంతటి విజయాలను సాధించడం అపూర్వం.

- ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన



పెద్దలు రాసిన పిల్లల కథలు
(ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300
ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

# సూర్యకాంత మణి-Sunstone

సూర్యకాంత మణి పేరుకు తగ్గట్టే అస్తమించే సూర్యుడు నీటిపై తేలియాడే వివిధ ఛాయలతో, అక్కడక్కడా మెరిసే మచ్చలు కలిగి సూర్యకాంతి ఘనీభవించినట్లు కనిపిస్తుంది. ఈ లక్షణాల వల్ల దీనికి సన్ స్టోన్ అనే పేరు వచ్చింది. అన్ని సంస్కృతులలో దీనిని సూర్యునికి అనుసంధానం చేయబడిన రత్నంగా భావించబడింది.



సన్‌స్టోన్‌కు అవెంచురైన్ ఫెల్డ్‌స్పార్, హెలియోలైట్, ఒలిగోక్లేస్ సన్‌స్టోన్ వంటి అనేక పేర్లు ఉన్నాయి. హెలియోలైట్: వాణిజ్య పరంగా గోల్డ్‌స్టోన్ లేదా గిరాసోల్ అని కూడా అంటారు. సంస్కృతంలో సూర్యకాంత (సూర్యకాన్త) అని పిలుస్తారు, దీని అర్థం "సూర్యుని ప్రేమించేది", ఇది సూర్యకాంతిలో వేడెక్కుతుందనే పురాణ కథ కూడా ఉంది. హిందీలో సూర్యకాంత్ (సూర్యకాంత) లేదా సూర్య మణి; తెలుగులో సన్‌స్టోన్ లేదా సూర్యకాంతము అంటారు. ఈ రాయి దాని లాక్షణికమైన సూర్యుని లాంటి మెరుపు (అవెంచరెసెన్స్) కాపర్ లేదా హెమటైట్ ఇన్‌క్లూజన్లు కాంతిని ప్రతిబింబించడం వల్ల ఏర్పడుతుంది.

గ్రీకు "హెలియోస్" (సూర్యుడు) పేరు మీద "హెలియోలైట్" అనేవారు; 1801లో ఫ్రెంచ్ మినరాలజిస్ట్ జీన్-క్లాడ్ డెలమెథేరీ దాని మెరిసే సౌర రూపం వల్ల "సన్‌స్టోన్" అని పేరు పెట్టారు.



ఆకర్షించే మెరుపు, దాని వెచ్చని ఆరెంజ్-రెడ్ రంగులు మరియు ఇరిడెసెంట్ ఫ్లాష్‌ల వల్ల (షిల్లర్) ఈ ఉపరత్నం లోని రంగులు నీటిపై సూర్యకాంతులు వెదజల్లే అస్తమించే సూర్యుని పోలి ఉంటాయి.

**చరిత్రలో సన్ స్టోన్:**

"సన్ స్టోన్" (Sunstone) చారిత్రక నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇది కేవలం ఒక రాయి మాత్రమే కాకుండా, ప్రాచీన కాలం లో నావికులకు దిక్సూచిలా పనిచేసింది.

సన్ స్టోన్ ప్రధానంగా వైకింగ్స్ (Vikings) కాలం నాటి చరిత్రతో ముడిపడి ఉంది. క్రీ.శ. 800-1066 మధ్య కాలంలో ఉత్తర ఐరోపాకు చెందిన వైకింగ్స్ సముద్ర ప్రయాణాల్లో దీనిని ఉపయోగించేవారని చరిత్రకారులు చెబుతుంటారు. కానీ ఈ రాయి ఫెల్డస్పార్ రకం సన్ స్టోన్ అయి ఉండదని, ఇది ఐస్లాండ్ స్పార్ కావచ్చని చరిత్ర కారుల అభిప్రాయం. ఈ రెండు కూడా అప్పటిలో "సన్ స్టోన్"లుగా వ్యవహరించబడటంవల్ల కొంత అస్పష్టత నెలకొంది. పురాతన కాలం నాటి ఒక మునిగి పోయిన ఓడలో ఐస్లాండ్ స్పార్ అనే రకం కాల్సైట్ దొరికింది.

ఆ కాలంలో దిక్సూచి (Compass) అందుబాటులో లేదు. వైకింగ్స్ సముద్రంపై ప్రయాణించేటప్పుడు సూర్యుని స్థానాన్ని బట్టి దిశలను గుర్తించేవారు. అయితే, ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో తరచుగా మంచు కురవడం లేదా ఆకాశం మేఘావృతమై ఉండటం వల్ల సూర్యుడు కనిపించేవాడు కాదు. అటువంటి సమయాల్లో సన్ స్టోన్ (ఐస్లాండ్ స్పార్) వారికి పనికివచ్చేది.

**1. కాంతి ధ్రువణం (Polarization)**

సూర్యకాంత మణి ఒక సహజ సిద్ధమైన పోలరైజింగ్ ఫిల్టర్ లాగా పనిచేస్తుంది. సూర్యుడు మేఘాల వెనుక ఉన్నా లేదా దిగువ క్షితిజ సమాంతర రేఖ (Horizon) కింద ఉన్నా, ఆకాశంలోని కాంతి ఒక ప్రత్యేక పద్ధతిలో వ్యాపిస్తుంది. వైకింగ్ నావికులు ఈ రాయిని ఆకాశం వైపు ఎత్తి పట్టుకుని తిప్పినప్పుడు, ఒక నిర్దిష్ట కోణంలో ఆ రాయి రంగు మారుతుంది లేదా దాని ప్రకాశం (Brightness) పెరుగుతుంది. దీని ద్వారా సూర్యుడు ఎక్కడున్నాడో వారు గుర్తుపట్టేవారు.

**2. హైడింగర్స్ బ్రష్ (Haidingerμs Brush) గుర్తించడం**

సూర్యకాంత మణి గుండా చూసినప్పుడు, కాంతి తీవ్రతలో వచ్చే మార్పులను నావికులు గమనించేవారు.

**ఖచ్చితమైన స్థానం:** రాయిని తిప్పుతున్నప్పుడు కాంతి అత్యంత ప్రకాశవంతంగా మెరిసే బిందువును వారు గుర్తించేవారు.

**ట్రయాంగులేషన్ (Triangulation):**

ఆకాశంలోని రెండు వేర్వేరు ప్రాంతాలలో ఈ రాయి సహాయంతో పాయింట్లు గుర్తించి, ఆ రెండు రేఖలు కలిసే చోట సూర్యుడు ఉన్నాడని లెక్కించేవారు.

**రాయిలోని మెరుపులు (Inclusions)**

ఫెల్డస్పార్ సూర్యకాంత మణిలో ఉండే హెమటైట్ లేదా రాగి రేకుల వల్ల కలిగే మెరుపులు (Aventurescence) నావికులకు బహుశా సహాయపడేవి కావచ్చు. ఈ మెరుపుల వల్ల కాంతిలో వచ్చే చిన్న మార్పులను స్పష్టంగా గమనించే అవకాశం ఉంది.

సూర్యుడి కిరణాలు రాయిపై పడగానే, ఆ లోపల ఉండే రేకులు వెలుగును ప్రతిబింబించి బహుశా సూర్యుడి దిశను సూచించేవి. ఈ లక్షణాలు నావికులకు కొంత ఉపయోగపడ్డా "ఐస్లాండ్ స్పార్" వలె ఖచ్చితమైన నావిగేట్ ఉపయోగాలు ఈ రత్నానికి ఉండదు.

**కాల్సైట్ (Iceland spar)**

దాని పోలరైజేషన్ మరియు డబుల్ రిఫ్రాక్షన్ స్వభావం ఆధారంగా మబ్బుల్లో ఉన్న సూర్యుడు ఏ దిక్కున ఉన్నది తెలుసుకునే వారు.

ఐస్లాండ్ స్పార్ (కాల్సైట్) తో పోలిస్తే ఫెల్డస్పార్ సూర్యకాంత మణికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.

**మన్నిక:** కాల్సైట్ చాలా మెత్తగా ఉండి త్వరగా పగిలి పోతుంది. కానీ సూర్యకాంత మణి (ఫెల్డ్స్పార్) గట్టిగా ఉండి సముద్ర ప్రయాణాలకు అనుకూలంగా ఉంటుంది.

ఈ కారణాల వల్ల చరిత్రలో వైకింగ్స్ వాడిన సన్ స్టోన్ "కాల్సైట్" కావచ్చు. సూర్యకాంత మణి కూడా నౌకాయానానికి పనికి వస్తుందనే నమ్మకం ఆ రోజుల్లో ప్రబలి ఉండవచ్చు.



**భారతీయ సాహిత్యంలో ప్రస్తావనలు:**

భారతీయ సాహిత్యంలో సూర్యకాంత మణిని కేవలం ఒక రత్నంగానే కాకుండా, సూర్య శక్తికి ప్రతీకగా వర్ణించారు.

**కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం':**

మహాకవి కాళిదాసు తన ప్రసిద్ధ నాటకంలో సూర్యకాంత మణిని ఒక ఉపమానంగా వాడారు. శాంతంగా కనిపించే మునులలో కూడా దాగి ఉన్న క్రోధాన్ని సూర్యకాంత మణితో పోల్చారు. ఈ మణిపై సూర్యకిరణాలు పడగానే అగ్నిని ఎలా వెదజల్లుతుందో, మునులను అవమానిస్తే వారు కూడా అలాగే అగ్ని వలె దహిస్తారని వర్ణించారు.

**పురాణాలు:**

'దేవీ భాగవతం'లో మణిద్వీపాన్ని వర్ణించే క్రమంలో సూర్యకాంత మణితో నిర్మించిన ప్రహరీ గోడలు లేదా గదుల ప్రస్తావన ఉంది.

**సంస్కృత సాహిత్యం:**

జైన గ్రంథాలలో ధనికులు, రాజుల పల్లకీలు మరియు భవనాలు సూర్యకాంత వంటి విలువైన మణులతో పొదగబడేవని పేర్కొన్నారు. దీనిని 'సూర్యకాంతమణి', 'సూర్యోపల', 'జ్వలనాశ్మ' వంటి పేర్లతో పిలుస్తారు.

ఆయుర్వేద గ్రంథాలలో సూర్యకాంత మణి లక్షణాలను వివరించే ముఖ్యమైన శ్లోకాలు ఉన్నాయి.

**లక్షణ శ్లోకం (ఆయుర్వేద ప్రకాశం 5/141):**

**శుద్ధ:** స్నిగ్ధో నిర్వ్రణో నిస్తుషోన్తర్యో నిఘష్టోత్యన్తనైర్మల్యమేతి।
**యః:** సూర్యాస్పర్శనిష్ఠ్యూతవహ్నిర్జాత్య: సోయం కథ్యతే సూర్యకాన్త:॥

**తాత్పర్యం:** ఏ మణి అయితే శుద్ధంగా, నునుపుగా, రంధ్రాలు లేకుండా ఉంటుందో మరియు సూర్యకిరణాలు తగలగానే అగ్నిని పుట్టిస్తుందో దానిని 'సూర్యకాంత మణి' అంటారు.

**గుణ శ్లోకం (రస తరంగిణి 23/185):**

సూర్యకాన్తో మతో మేధ్య ఉష్ణశ్చైవ రసాయన:।
బలాసవాతశమనో విశేషేణ చ కీర్తిత:॥

**తాత్పర్యం:**

సూర్యకాంత మణి బుద్ధిని పెంపొందిస్తుంది (మేధ్యం). ఉష్ణ వీర్యాన్ని కలిగి ఉంటుంది. రసాయనంగా (వృద్ధాప్యాన్ని అరికట్టేది) పనిచేస్తుంది. ఇది వాత మరియు కఫ దోషాలను హరిస్తుంది.

**ఖనిజ లక్షణాలు;**

సన్ స్టోన్ (Sunstone) అనేది ఫెల్డ్స్పార్ గ్రూప్‌కు చెందిన ఒక ఖనిజం. ఇది ప్రధానంగా ఒలిగోక్లేస్ (oligoclase) లేదా ఆర్థోక్లేస్ (orthoclase) రకాల ఫెల్డ్స్పార్ రకాల్లో కనిపిస్తుంది.

**భౌతిక లక్షణాలు**

సన్ స్టోన్‌కు మోస్ హార్డ్‌నెస్ 6.0–6.5 మధ్య ఉంటుంది. ఇది పారదర్శకం నుండి అర్ధపారదర్శకం వరకు ఉంటుంది. విశిష్ట గురుత్వం 2.64–2.66. రసాయన కూర్పు (Ca,Na) (Al,Si) 2Si2O8.

**ట్రైక్లినిక్ క్రిస్టల్ సిస్టమ్ కలిగి ఉంటుంది. ఆప్టికల్ ఎఫెక్ట్:**

ఇందులో రాగి, హెమటైట్ లేదా గోథైట్ వంటి చిన్న షీట్ల ఇన్‌క్లూషన్లు (ప్లేట్‌లెట్స్) ఉండటం వల్ల అద్భుతమైన మెరుపు (aventurescence లేదా schiller) కనిపిస్తుంది. ఈ ఎఫెక్ట్ కాంతి ప్రతిఫలనం వల్ల వివిధ రంగులు మరియు ఆకారాలు కనిపిస్తాయి. రంగులు: ఎరుపు, ఆరెంజ్, గోల్డెన్, గ్రీన్, బ్లూ వంటివి; కేంద్రంలో గాఢంగా అంచుల్లో పలుచగా ఉంటుంది. స్ఫటికాలు కణస్వభావం (Granular) లేదా పెద్ద ఆకారంలో ఉంటాయి.

**సన్ స్టోన్ ఏర్పడే భౌమ ప్రక్రియలు;**

సన్ స్టోన్ ఏర్పడే ప్రక్రియ మాగ్మాటిక్ మరియు మెటామార్ఫిక్ ప్రక్రియలతో ముడిపడి ఉంటుంది.

**మాగ్మాటిక్ ఏర్పాటు:**

రాతి ద్రవంలో (మాగ్మా) ఫెల్డ్‌స్పార్ (ఒలిగోక్లేస్ లేదా లాబ్రడొరైట్) క్రిస్టల్స్ మెల్లగా చల్లార్చినప్పుడు ఏర్పడుతుంది. ఈ సమయంలో రాగి, హెమటైట్ లేదా గోథైట్ వంటి లోహ షీట్లు (ప్లేట్‌లెట్స్) క్రిస్టల్‌లలోకి చేరి, aventurescence మెరుపును సృష్టిస్తాయి. గ్రానిట్, సైనైట్, పెగ్మటైట్ వెయిన్స్‌లో ఈ ప్రక్రియ ఎక్కువగా జరుగుతుంది. నీస్ (Gneiss) లేదా ఇతర మెటామార్ఫిక్ రాళ్లలో ఒత్తిడి, వేడి ప్రభావంతో ఫెల్డ్‌స్పార్‌లో ఇన్‌క్లూషన్లు ఏర్పడి సన్ స్టోన్‌గా మారుతుంది. డెక్కన్ ట్రాప్స్ వంటి బేసాల్ట్ లావా ఫ్లోస్‌లో కూడా చిన్న స్థాయిలో ఈ ప్రక్రియ జరుగవచ్చు. ఈ భౌమ ప్రక్రియలు జరగటానికి లక్షలాది సంవత్సరాలు పడుతాయి, ఫలితంగా పారదర్శకంగా మెరిసే రత్నం ఏర్పడుతుంది. భారతదేశంలో రాజస్థాన్ పెగ్మటైట్లు, తెలుగు రాష్ట్రాల్లో ఈస్టర్న్ ఘాట్స్ గ్రానిట్లలో ఉన్న సన్ స్టోన్ లు ఇలా ఏర్పడినవే.



**సహజ లభ్యత (Natural Occurrence)**

సన్‌స్టోన్ ప్రపంచవ్యాప్తంగా కొన్ని నిర్దిష్ట ప్రాంతాలలో మాత్రమే లభిస్తుంది:

**ఒరెగాన్, అమెరికా:**

ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యత గల 'రాగి' (Copper) కలిగిన సన్‌స్టోన్లు ఇక్కడ దొరుకుతాయి.

**ఇతర దేశాలు:** నార్వే, కెనడా, రష్యా మరియు టాంజానియా దేశాలలో కూడా ఇది లభిస్తుంది.

**భారతదేశం:** ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, రాజస్తాన్ మరియు ఒడిశా రాష్ట్రాలలో సహజ సిద్ధమైన సన్‌స్టోన్ గనులు ఉన్నాయి.

భారతదేశంలో ఫెల్డ్‌స్పార్ ఉత్పత్తిలో రాజస్థాన్ అగ్రస్థానంలో ఉంది.

**అజ్మీర్ జిల్లా:** రాజస్థాన్‌లో ఫెల్డ్‌స్పార్ ఉత్పత్తికి ఇది అత్యంత ముఖ్యమైన ప్రాంతం. బేవార్ మరియు అజ్మీర్ నగర పరిసర ప్రాంతాల్లో వివిధ రంగుల ఫెల్డ్‌స్పార్‌లు లభిస్తాయి. ఇందులో సన్‌స్టోన్‌కు ప్రత్యేకతనిచ్చే ''షిల్లర్'' (Schiller) లేదా "అవెంచురెసెన్స్" (Aventurescence) మెరుపు ప్రభావం కలిగిన రాళ్లు కూడా ఉన్న... తెలుగు రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)లో సన్ స్టోన్‌లు అరుదుగా లభిస్తాయి. ఇవి ప్రధానంగా ఫెల్డ్‌స్పార్ డిపాజిట్లలో కనిపిస్తుంది.

**తెలంగాణలో:**

తెలంగాణలో రంగారెడ్డి (కందుకూరు ప్రాంతం), మహబూబ్‌నగర్, హైదరాబాద్ సమీప గ్రానిటిక్ రాళ్ళల్లో పెగ్మటైట్, క్వార్ట్జ్-ఫెల్డ్‌స్పార్ వెయిన్స్‌లో ఫెల్డ్‌స్పార్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఫెల్డ్‌స్పార్ ఒకరకమైన aventurescent ఎఫెక్ట్‌తో లభ్యమవుతుంది.

**ఆంధ్రప్రదేశ్‌లో:**

ఆంధ్రప్రదేశ్‌లో ఈస్టర్న్ ఘాట్స్ ప్రాంతం (విశాఖపట్నం జిల్లా: పడేరు, చింతపల్లి, నర్సీపట్నం)లో రత్నం గ్రేడ్ ఫెల్డ్‌స్పార్ సంబంధిత డిపాజిట్లు ఉన్నాయని సమాచారం.

**ఒరెగాన్ సన్ స్టోన్ (USA):**

అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం లాబ్‌రాడర్ ఫెల్డ్‌స్పార్ డిపాజిట్ల నుండి వచ్చే గోల్డెన్-గ్రీన్ అవెంచురెసెంట్ సన్ స్టోన్ ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధమైనది. దీనిని రాజస్థాన్ (భారతదేశం) నుండి వచ్చే రెడ్-గోల్డ్ సన్ స్టోన్‌తో పోల్చవచ్చు.

గ్రీన్ సన్ స్టోన్ చాలా అరుదుగా, ఒరెగాన్‌లో మాత్రమే ప్రధానంగా లభిస్తుంది. రెడ్ సన్ స్టోన్ భారతదేశం, మడగాస్కర్‌లో ఎక్కువగా లభిస్తుంది.

**ఉపయోగాలు (Uses)**

**నగలు:**

ఉంగరాలు, హారాలు మరియు చెవి కమ్మల తయారీలో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు.

**ఆయుర్వేద ఉపయోగాలు:**

ప్రత్యామ్నాయ వైద్యంలో ఇది ఒత్తిడిని తగ్గించడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి మరియు రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగపడుతుందని నమ్ముతారు.

**అలంకరణ:**

విలాసవంతమైన గృహాల అలంకరణలో ఈ రాళ్లను షో-పీస్‌లుగా ఉపయోగిస్తారు.

వీటితోపాటు ఇతర మెటాఫిజికల్ ఉపయోగాలు కూడా ఉన్నాయి.


-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# మానవ స్వభావానికి ప్రతిరూపం రంగస్థలం

**ప్రాముఖ్యత:** ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ (ITI) 1961లో ప్రపంచ థియేటర్ దినోత్సవాన్ని ప్రారంభించింది. మార్చి 27న పారిస్‌లో 1962లో "థియేటర్ ఆఫ్ నేషన్స్ సీజన్" నిర్వహించబడటంతో ఇది ప్రారంభం అయింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఇదే తేదీన ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

రాజుల కాలం నుంచి ఇప్పటికీ.. విరాజిల్లుతూ నేటికీ తనప్రాభవాన్ని నిలబెట్టుకుంటున్న రంగం నాటకరంగం. మరింత మందికి ఈ రంగాన్ని చేరువ చేయడానికి కృషి చేస్తున్నవారు ఎందరో. చదువుకు సాధనంగా, సామాజిక మార్పు కోసం ప్రభావంతంగా పనిచేసే నాటకం ప్రాముఖ్యత, మన సంస్కృతిలో ఎంతగానో మమేకం అయ్యింది.




రంగస్థలం అనేది మానవ స్వభావాన్ని వ్యక్తీకరించే సాధనంగా పనిచేస్తుంది. మానవ అనుభవాలు, భావోద్వేగాలలో ఉండే వైవిధ్యాలు, భావోద్వేగాలలో దాగిన విషాదం, సంతోషం, ఈర్ష్య, అసూయ, జాలి, దయ.. ఇలాంటివన్నీ లోతుగా పరిశీలించి, ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం రంగస్థలం కల్పిస్తుంది. ఇది కేవలం వినోదం మాత్రమే కాదు.. విద్య, సామాజిక మార్పుకు కూడా శక్తివంతమైన ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది.

రంగస్థల ప్రదర్శన గొప్ప కళారూపం. ఈ కళారూపాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వాలు, వ్యక్తులు, సంస్థలు నాటక సమాజానికి మద్దతు ఇవ్వడానికి, ప్రోత్సహించడానికి కృషి చేయడం. ఈ రోజున ప్రజలు అనేక కార్యక్రమాలు, ప్రదర్శనలు, ప్రసంగాలు, నాటక సమాజాలు కార్యక్రమాలు, అవార్డు వేడుకలు, ప్రత్యక్ష ప్రదర్శనలను నిర్వహించడం ద్వారా రంగస్థల దినోత్సవాన్ని గుర్తు చేసుకుంటారు.

రోజువారీ హడావిడి జీవితాలలో థియేటర్ అనేది ప్రజలకు కొద్దిసేపు అన్ని గోలలు మరచిపోయి కాస్త వినోదాన్ని, మరికొంత ప్రశాంతతను పంచే వేదిక. సాధారణ పౌరుడి నుండి విలాసవంతమైన జీవితం గడిపే వారి వరకు ప్రతి ఒక్కరి జీవితం ఏదో ఒక దశలో, సందర్భంలో ఈ థియేటర్‌తో ముడిపడి ఉంటుంది.

**ప్రత్యేక థియేటర్ ప్రదర్శనలు:** చాలా థియేటర్లు ప్రత్యేక నాటకాలు రంగస్థల ప్రదర్శనలను నిర్వహిస్తాయి. కొన్ని ప్రొడక్షన్స్ ప్రేక్షకులను థియేటర్‌తో నిమగ్నం అయ్యేలా ప్రోత్సహించడానికి ఉచిత లేదా తగ్గింపు టిక్కెట్లను అందిస్తాయి.

**అంతర్జాతీయ సందేశం:** ప్రతి సంవత్సరం, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాటక రంగం ప్రముఖుడు ప్రపంచ నాటక దినోత్సవ సందేశాన్ని వ్రాసి అందజేస్తాడు. ఇది ప్రపంచవ్యాప్తంగా పంచుకో బడుతుంది. ఈ సందేశం ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో నాటక రంగానికి ఉన్న శక్తిని తెలియజేస్తుంది. కళకు తమను తాము అంకితం చేసుకున్న వారు ఈ సందర్భంగా గుర్తించబడతారు. తగిన గౌరవం పొందుతారు. ఇది వ్యక్తి కళను ప్రపంచానికి మరింత విస్తృతం చేయడానికి సరైన మార్గం అవుతుంది.

**థియేటర్ వర్క్‌షాప్‌లు, ప్యానెల్ చర్చలు:** థియేటర్ గ్రూపులు, సాంస్కృతిక సంస్థలు నటన, నాటక రచన, రంగస్థల కళపై వర్క్‌షాప్‌లు, చర్చలు, మాస్టర్‌క్లాస్‌లను నిర్వహిస్తాయి. నిపుణులు థియేటర్ పరిణామం చెందిన విధానం, ప్రాముఖ్యతపై తమ తమ అభిప్రాయాలు, నాటి కాలపు సంఘటనలు పంచుకుంటారు.

**వీధి నాటకాలు, బహిరంగ ప్రదర్శనలు:** సామాజిక, సాంస్కృతిక సమస్యల గురించి అవగాహన పెంచడానికి వీధి నాటక బృందాలు బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శనలు ఇస్తాయి. విశ్వవిద్యాలయాలు, నాటక పాఠశాలలు తరచుగా బహిరంగ ప్రదర్శనలను నిర్వహిస్తాయి.

**నాటక కళాకారుల గుర్తింపు:** అత్యుత్తమ నాటక కళాకారులు, నాటక రచయితలు, ప్రదర్శకులకు కళారూపానికి చేసిన కృషికి అవార్డులు, గౌరవాలు ఇవ్వబడతాయి.

**సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రచారాలు:** థియేటర్‌ను ఇష్టపడేవారు, సంస్థలు, కథలు, కోట్స్, మరచిపోలేని ప్రదర్శనలను పంచుకోవడానికి వరల్డ్ థియేటర్ డే వంటి హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగిస్తాయి. వర్చువల్ ప్రదర్శనలు, ప్రత్యక్ష ప్రసారం చేయబడిన థియేటర్ ఈవెంట్‌లు ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను పాల్గొనడానికి అనుమతిస్తాయి.

**థీమ్:** "థియేటర్ మరియు శాంతి సంస్కృతి". ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ (ITI) స్థాపించిన ఈ శాశ్వతమైన థీమ్, అంతర్జాతీయ సామరస్యం, అవగాహన, సామాజిక మార్పును పెంపొందించడానికి ప్రత్యక్ష ప్రదర్శన యొక్క శక్తిని ప్రముఖంగా చెబుతుంది.

**ప్రధాన సందేశం:** శాంతి, సంభాషణ, పరస్పర అవగాహన కోసం థియేటర్‌ను సాధనంగా ఉపయోగించడంపై వార్షిక థీమ్ దృష్టి సారించింది.

*మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా...*

– కొత్వాల్ సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com

# ఒక పాట వంద జ్ఞాపకాలు

(గత సంచిక తరువాయి)

"మేరే మన్ కీ గంగా, తేరే మన్‌కీ జమునాకా" పాట దేశాన్ని, పిచ్చిగా ఊపేస్తున్నప్పుడు (1964 సంగం సీన్మా). నేను పదమూడు టీన్ ఏజ్ లోకి ప్రవేశించాను. ఆ పంచరంగుల సీన్మా సుల్తాన్ బజార్ దిల్షాద్ టాకీసులో చూసిన (అదిప్పుడు లేదు) తర్వాత రంగుల లోకాలలోకి ఎగిరి పోవటం మొదలయ్యింది. పెద్దపెద్ద విమానాల అందం, లండన్, రోమ్, ప్యారిస్, స్విట్జర్లాండ్ నగరాల, ఆల్ప్స్ పర్వతాల సౌందర్యం, నయాగారా జలపాత ఉధృతం నన్ను మంత్రించి మాయచేసాయి. నేలమీద కాలు నిలవకుండా పగటి కలలు కనటం మొదలయ్యాయి. తర్వాత్తర్వాత కాలాలలో ఆ విశ్వనగరాలన్నింటినీ దర్శించి 'కల నిజమాయెగా' అని పాడుకున్నాను. రాజ్‌కపూర్‌ను యాది చేసుకున్నాను.




నాకు సిగ్గూ షరమూ అన్నలు లేవని మాపెద్దక్క ద్వారా నాకు మొదటిసారి తెలిసివచ్చింది. అదేల అనగా షమ్మీకపూర్ నటించిన "ఎన్ ఇవినింగ్ ఎన్ ప్యారిస్" (1967) విడుదలైన రోజు నా హెచ్‌ఎస్‌సి ఫలితాలు వచ్చి నేను అన్ని సబ్జెక్టులలోనూ విజయవంతంగా విఫలమయ్యాను. నేను ఫెయిల్ కావటం ఖాయం అని పరీక్షలు రాయకముందే నాకు తెలుసు కావున చింత ఏల అని శుభ్రంగా ఆ రోజే విడుదలైన 'ఎన్ ఇవీనింగ్ ఇన్ ప్యారిస్"కు క్రిష్ణా టాకీసులో మార్నింగ్ షోకు వెళ్లినాను. ఇంటికి వచ్చాక "నీకు సిగ్గూ శరమూ లేవారా" అన్న మాటల ద్వారా మా పెద్దక్క నాకు జ్ఞానోదయం కలిగించింది. "నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు" టైపు మనిషిని నేను.

"దునియా కీ సైర్ కర్‌లో,  
దునియా కీ సైర్ కర్‌లో  
దునియా కీ సైర్ కర్ కే  
ఇన్సాన్ సే ప్యార్ కర్‌లో"  
(1967 అరౌండ్ ది వరల్డ్, సీన్మా పాట).

ఈ పాట పుణ్యమా అని చెడిపోయిన్నో, బాగు పడిన్నో నాకైతె తెలియదు కాని కెనడా, పశ్చిమ యూరపు దేశాలు, లండన్, మధ్య ఆసియా నాలుగు దేశాలు (ఒకప్పుడు సోవియట్ యూనియన్‌లో భాగం) చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండు, బూటాన్ దేశాలను తర్వాత కాలంలో 'చల్ ఉడ్ జారే పంచీలా' పర్యటించాను. అందులో నా "సిల్కురూట్ యాత్ర" శీర్షమాణిక్యంలా నిలిచిపోయింది.

"అయ్యయ్యో చేతిల డబ్బులు పోయేనే  
అయ్యయ్యో జేబులు ఖాళీ అయెనే"  
(కులగోత్రాలు, 1952)

ఈ పాట ఇప్పుడు, ఈ ఏడుపదులు దాటిన వయస్సులో విన్నా నా పెదవులపై చిర్నవ్వులు చిందుతాయి. మళ్లీ పన్నెండేళ్ల కౌమారదశకు వెళ్లిపోతాను. నవ్వు ఏడుపు కలగలిసి ఏక కాలంలో వస్తాయి. కులగోత్రాలు సీన్మా చూడడటం కోసం నేను పడిన తపన, వేదన కార్చిన కన్నీళ్లు ఒకచిన్న ముచ్చట కాదు. అదేలయనగా....

నా కప్పుడు పదకొండు ఏండ్లు. ఒకరోజు ప్రొద్దున్నే నిద్ర లేచిన కాని పక్క మీద నుండి లేవలేదు. చేదబావి దగ్గర చేసుకుంట అమ్మా బాపు సంతోషంగా మాట్లాడుకుంటున్నారు. కండ్లు మూసుకుని రెండు చెవులూ అటు వైపు అప్పగించాను. చివరాఖరికి తెలిసిందేమనగా క్రితం రాత్రి మేమందరం పిల్లలం నిద్రపోయిన తర్వాత వారిద్దరూ ఆబిడ్స్ దగ్గరున్న సాగర్ టాకీసుకు వెళ్లి (అదిప్పుడు లేదు) ఎన్‌టిఆర్, సావిత్రి నటించిన 'ఆత్మబంధువు' సీన్మా చూసొచ్చారని! ఇక అంతే ఒక్కసారిగా నాలో కోపం, ఉక్రోషం, అవమానం, ఆత్మాభిమానం పొంగుకొచ్చాయి. దిగ్గున పక్కమించి లేచి తపతపా అడుగులు నేల మీద కొట్టుకుంటూ వెళ్లి బావి గచ్చుమీద కథాకళి, భరతనాట్యం, శివతాండవం ప్రారంభించాను. "ఇంత మోసమా" మీరిద్దరే టింగురంగా అని దొంగల్లాగ, రహస్యంగ సీన్మాకు పోతరా" అని అరుపులు, కేకలు. హఠాత్తుగా వచ్చిన ఈ తిరుగుబాటుకు వాళ్లిద్దరూ భీరిపోయారు. తుఫానులా విరుచుకుపడేసరికి వారి ఆనందమంతా ఆవిరయ్యిపోయింది. తప్పు చేసినట్లు అపరాధభావంతో ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. జన్మకో శివరాత్రి అన్నట్లు వారిద్దరూ కలిసి సీన్మాలకు పోవటమే చాలా అరుదు. పోకపోక పోయినందుకు, దొంగల్లాగ దొరికిపోయి, బావి దగ్గర "బోనులో ముద్దాయిల్లాగ" నిలబడాల్సి వచ్చింది.

"సరే లేరా నిన్ను కూడ తీసుకపోతంలే అని బాపు లైట్‌గ తీసుకుని మత్పరించబోయిండు"

నేను మొండి ఘటం కదా "ఎప్పుడు?" అని కోర్టు మార్షల్ విచారణ శురూ చేసిన.

"ఎప్పుడంటే ఇప్పుడే ఎట్ల చెప్పను? పైసలు లేవు. జీతాలు రావాలి కదా" అని నీళ్లు నములుకుంట సంజాయిషీ ఇచ్చిండు.


ఒకటో తారీఖు ఎప్పుడని మనస్సులనే లెక్కలేసుకున్న, ఇంకా ఇరవైదినాలని తేలింది.

"అమ్మో ఇంకా ఇరవై దినాలే అంత వరకూ ఎట్లా ఆగాలి." అని నా ఓపలేనితనాన్ని తెలియచేసి "ఎక్కడైనా అప్పు తేరాదా" అని పెద్ద మనిషి తరహాలో సలహా ఇచ్చాను.

"అరేయ్ ఈపు పగుల్తది" అని అమ్మ కలకత్తా కాళిక అవతారంలో రంగంలోకి దిగింది.







ఇక ఆ సుప్రభాత సమయాన దేహశుద్ధి తప్పదని (పూర్వానుభవాలు చాలా వున్నాయి లెండి) ఒకడుగు వెనకకు వేసి రాజీ మార్గం ఆచరించాను.

బొటాబొటా కన్నీళ్లు కారుతుంటే "తొందగర తీస్కపోవాలె" అని ఏడుపు కంఠంతో కీచుగా, దీనంగా అడిగాను.

సర్లే. ముందు పోయి ఆ పాచిపండ్లు తెల్లగ తోముకో అని అమ్మ నిర్దయగ ఒక బోడి సలహా ఇచ్చే సరికి నాకు ఒళ్లు మండి "జీవితాంతం పండ్లే తోముకోను" అని మనసులోపలే శపథం తీసుకున్న. దుఃఖభారంతో తలవంచుకున్న.

ఇదే సందని ఇద్దరూ సడి చప్పుడు చేయకుండా, చల్లగా మనసాలలోకి జారుకున్నారు. దుఃఖంతో వున్న నన్ను ఒంటరిగా వదిలేసి!

"సీన్మా, సీన్మా" అని ఆ దినం నుండి మనాది మొదలయ్యింది. బాకీ కోసం సత్యహరిశ్చంద్రుడిని వెంటాడి వేధించిన నక్షత్రకుడి వలె దొరికినపుడల్లా బాపును పట్టుకుని సీన్మా? సీన్మా? ఎప్పుడు? ఎప్పుడు? అని గుర్తు చేస్తున్న. ఇక ఆయనేమొ పురుసత్‌గ దౌడకు పాన్ పెట్టుకుని నములుకుంట నోరు విప్పితే రసం కారి క్రిందకు జారిపడుతుందన్న భయంతో తలపైకెత్తి "చూద్దాం, చూద్దాం" అని ఒకసారి "పోదాం పోదాం" అని మరోసారి, జేబుల ఒక్క చిల్లిపైస కూడ లేదు అని ఇంకోసారి ఆకుకు అందని, పోకకు పొందని మాటలు మాట్లాడసాగాడు. ఇక నా ఓపిక "బర్దాష్ కే బాహర్" వచ్చేసింది. అమ్మ ఏం పని చెప్పినా సహాయ నిరాకరణం, రాత్రి పూట "బూఖ్ హర్తాల్" (నిరాహార దీక్ష) సాగించిన. మా వాళ్ల కఠినమైన రాతి గుండెల ముందు నా గాంధీగారి అహింసాయుధాలన్నీ ఘోరంగా విఫలమైనాయి. ప్రతిరాత్రి నిండా ముసుగు కప్పుకుని ఎవరికీ కనబడకుండా, వినబడకుండా లోలోపలే ఏడ్చి కన్నీళ్లు కార్చి పక్క దిండు తడిపి ఎప్పుడో నిద్రలోకి జారుకునే వాడిని.

నెల గడిచింది. జీతం వచ్చింది. ఆ నెలల దసుర పండుగ. అందరికీ కొత్త బట్టలు కొనాలె. పై నుండి పండుగ ఖర్చులు. ఎట్లరా దేవుడా అని అమ్మాబాపు తసబిస అవుతున్నరు. అన్నింటినీ గమనిస్తున్న అయినా ధైర్యం చేసి ఒక రోజు "సీన్మా" అన్న అంతే అమ్మ ఖఁయ్యిమని అరిచి పొయ్యిల ఊదుతున్న గొట్టం చేతిల బట్టుకుని నా మీదికి లేసింది. ఒక్క అంగల నేను వంటింట్ల నుండి గంతువేసి మనసాలలకు వచ్చిన ఆమె కూడా నా వెనకే వచ్చింది. అప్పుడు నేను చర్మ సంరక్షణా నిమిత్తమై అర్రలకు చొర్రబడ్డ. ఆమెకు కోపం ఇంకా ఎక్కువయ్యింది. అండ్లకు కూడా రాంగనే నేను మెరుపు వీరుడిలా బావి గచ్చుమీదికి దూకి అక్కడ కూడా ఆగకుండా మల్లెపందిరి కింద నుండి ఉరికి పెద్ద దర్వాజా దాటి వాకిట్లకు ప్రవేశించిన. అయినా ఏం లాభం? అప్పటికే ఊదుడు గొట్టం గాలిలో రామబాణంలా రయ్యిఁమని తేలి వచ్చి నా వీపును సాపు చేసింది. సీన్మాసీన్మా అని జిద్దు చేసినందుకు వీపు మీద పెద్ద దద్దు వచ్చింది.

అపుడు నాకు జీవితం మీద విరక్తి ముంచుకొచ్చింది. రెండు రోజుల తర్వాత నేనూ, మా మూడో అక్క అంటే సుశక్క బజారుకు పోతున్నం. మేమిద్దరం జిగ్రీ దోస్తులం. మా మధ్య ఏ రహస్యాలు ఉండకపోయేది. "అక్కా కొంచెం ఆగు" అన్న ఎందిరా లోకి అని ఆగి నా ముఖంల ముఖం పెట్టి చూసింది. "నేను చచ్చిపోతనే" అని భళ్లున ఏడ్చేసిన. అప్పటికే సుశక్కకు నా బాధ నా మనాది తెలుసు.

"వొద్దురా. నవ్వు చచ్చిపోతే నెనెట్ల బ్రతుకుతరా" అని ఆమె కూడా నాకంటె ఎక్కువగా ఎక్కెక్కి ఏడిచింది. ఇద్దరమూ ఒకర్నొకరం పట్టుకుని ఏడ్చేసరికి చేతిల ఉన్న పాలగ్లాసు నేలమీదికి ఒలికి పోయింది.

మరో నాలుగు రోజుల తర్వాత బ్రతుకమ్మ పండుగ వచ్చింది. కొత్త బట్టలు కట్టుకున్నం. గారెలు, పులిహోర, పూరీలు, కోడిమాంసం కడుపునిండా ఆరగించినం. సాయింత్రం "జమ్మి"కి పోయి వచ్చినంక బాపు చిర్నవ్వులు చిందించుకుంట మా పిల్లలందర్నీ దగ్గరికి పిలిసిండు.

ఒసే వెంకటమ్మా (మా రెండవ అక్క) రేపు ఈ పిల్లలందర్నీ మ్యాట్నీ ఆట సీన్మాకు తీసుకపోవే అని అన్నడు.

అందరం "అహా అహా ఒహెూ ఒహెూ" అని అర్సుకుంట గంతులేసినం చిందులు తొక్కినం. చిరకాల కోరిక నెరవేరుతుందన్న సంతోషంతో నాకు ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. తెల్లారి మధ్యాహ్నం భోజనాలయినంక మా రెండో అక్క నాయకత్వాన (అప్పటికే ఆమె టీచర్ ట్రేయినింగ్ చేస్తుంది) నేను, సుశక్క, పెద్ద తమ్ముడు జ్ఞాని కొత్త బట్టలు కట్టుకుని సీన్మాకు బయలు దేరినం. రూప్‌లాల్ బజార్ గల్లీలల్ల నడుసుకుంట శాలిబండ చెట్టు క్రింది రోడ్డుకు వచ్చినం. దీపక్ టాకీస్, నారాయణ గూడాకు ఒక రిక్షా మాట్లాడుకున్నం. సీన్మా కంటె ముందు రిక్షా ప్రయాణమే ఒక అందమైన అనుభవం. రిక్షాలో పురుసత్‌గ చక్లంముక్లం కూచుని రిక్షా వాడి కాళ్ల క్రింద భూమి (సడక్) జర్రుజర్రున జారి వెనుకకు పోతుంటే కళ్లప్పగించి చూస్తూ పట్నాన్ని, దుకాణాలను, వాటి సైన్ బోర్డులను చదువుకుంట, పెద్ద పెద్ద భవంతులను చూడటం చిన్న అనుభవమా? మోఘల్‌పురా దాటంగనే దూరంగ చార్మినార్ నాలుగు చేతులు చాచి మమ్మల్ని, ఆహ్వానించేది. గుల్జార్ హౌజ్, మదీనా హొటల్ దాటి కొత్త పూల్ ఎక్కేవాళ్లం. వంతెన మీద తెల్లటి గుండ్రటి బల్దియా లైటు బుగ్గలు, క్రింద ముచికుందమ్మ నది, గౌలిగూడల శంకర్‌షేర్ హొటల్, కోఠీల అప్పుడే కట్టిన కొత్త ఆంధ్రాబ్యాంక్ భవనం, సుల్తాన్ బజార్, బడీ చావిడీల చీరల దుకాణాలు తిలకిస్తూ కాచీగూడ చౌరస్త దాటంగనే కుడివైపు బసంత్ టాకీసు కనబడింది. (అదిప్పుడు లేదు). అక్కడ "సిరి సంపదలు" సీన్మాబోర్డు కనడింది. అది కూడా అక్కలిద్దరికీ ఇష్టమైన అక్కినేని నాగేశ్వరరావు సీన్మానే. ఒక్క నిముషం రిక్షా ఆపి

అక్కలిద్దరు చర్చించుకుని దీపక్‌ల "కులగోత్రాలు" సీన్మానే సెలక్టు చేసుకుని రిక్షాను ముందుకు పొమ్మని చెప్పింద్రు. నారాయన్‌గూడ చౌరస్తాల మాడపాటి హన్మంతరావు బాలికల ఉన్నత పాఠశాల దాటి సుదీర్ఘ ప్రయాణం తర్వాత దీపక్ టాకీసు దగ్గర రిక్షా దిగినం.

సీన్మాహాలు ప్రవేశద్వారం వద్దే పెద్ద పెద్ద హోర్డింగులు నాగేశ్వరరావు, కృష్ణకుమారిల నిలువెత్తు రంగుల బొమ్మలు. ఎంత చూసినా తనివి తీరని పోస్టర్లు. టిక్కట్లు తీసుకుని లోపలికి వెళ్లాం. పేకాట సీన్‌లో రమణారెడ్డి డబ్బులన్నీ పోగొట్టుకుని తలమీద తడిగుడ్డ వేసుకుని పశ్చాత్తాప భారంతో పాట ప్రారంభించాడు. అతడిని ఓదారుస్తూ రేలంగి. మిగతా బృందం వంత పాడారు.

*"అయ్యయ్యో చేతిల డబ్బులు పోయెనే*
*అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే"*

పాట రాగానే హాలు మొత్తం నవ్వుల పువ్వుల తోటగా మారింది. నేను నా తమ్ముడు జ్ఞాని నవ్వినవ్వి నొప్పితో కడుపులు చేత బట్టుకున్నాం. నాయికా, నాయకులు చేసిన భాంగ్రా నృత్యం మమ్మల్ని ఉర్రూతలూగించింది. సీన్మాలో హీరో అమ్మ చనిపోయే సీన్ రాగానే మా రెండో అక్క వెంకటమ్మ నేను, జ్ఞాని భయపడతామని తన చేరో చేత్తో మా కండ్లు మూసింది.

ఇంటికి వచ్చాక ఒక వారం పాటు ప్రతి ఒక్కరం సీన్మా ముచ్చట్లు, సీన్మా పాటలే. కాలం గిర్రున తిరిగింది.

మా చిన్నప్పుడు మాకు పుస్తకాలు, పాటలు, సీన్మాలను, లోకాన్ని పరిచయం చేసి ప్రభావితం చేసిన మా వెంకటమ్మ అక్క ఎనభై సం.ల వయసులో కాలం చేసింది. అప్పుడామె హిమాయత్ నగర్‌లో ఉండేది. స్వర్గపురి వాహనంలో మేమందరం ఆమెను అంబర్‌పేటలోని రుద్రభూమికి తీసుకు పోతున్నాం. సరిగ్గా దీపక్ టాకీసు ముందు నుండే! తలెత్తి చూసాను. అది మూతపడి ఉంది. కాని హాలుమాత్రం శిథిలావస్థలో అట్లనే ఉంది. ఆనాటి మా తీపిజ్ఞాపకాలకు గుర్తుగ! గతించిన కాలానికి జ్ఞాపకంగ!!

మృత్యువును చూసి భయపడతం అని ఆ రోజు మా రెండు కండ్లుమూసిన మా అక్క ఇప్పుడు నిర్జీవంగా ఉన్న తనను చూసి మేం బాధ పడతం అని లేచి మా కండ్లు మూయలేదు కదా!

ఆమె దశదిన కర్మనాడు మా సుశక్క మా అందరికీ రెండు రహస్యాలను విప్పి చెప్పింది. ఒకటి : నేను చచ్చిపోతా అని ఏడ్చిన సంగతి ఆమె ఆ రాత్రే మా వెంకటమ్మ అక్కకు చెప్పితే ఆమె దసుర నాడు ఆ సంగతి అమ్మా బాపుకు చెప్పిందట. రెండు : బొగ్గుల బస్తా (వంట కోసం) కోసం దాచిన డబ్బులను బాపు మాకు "కులగోత్రాలు సీన్మా" చూడటానికి ఇచ్చాడట.

ఆ పాత రహస్యాలను విని అందరం కన్నీళ్లు పెట్టుకున్నాం. మేమందరం ఆ రోజు సంతోషంగా సీన్మాహాల్లో "చేతిల డబ్బులు పోయెనే" పాట విని నవ్వుకుంటున్న సమయంలో సరిగ్గా అదే సమయాన ఇంట్లో మా బాపు "అయ్యయ్యో బొగ్గుల డబ్బులు పోయెనే" అని బాధ పడ్డాడా అని నాకు ఇప్పటికీ తీరని సందేహమే!

ఏం చేస్తాం? వెనక్కి తిరిగి చూస్తే వెయ్యి తప్పులు కనబడతాయి.

–పరవస్తు లోకేశ్వర్, m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

**FORM IV** (See Rule 8)

Statement about ownership and other particulars of periodical Deccan Land as required to be published in the first issue every year after the last day of February.

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of its publication | : | Monthly |
| 3. Printer's Name | : | M.Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 4. Publisher's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 5. Editor's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.12, Himayatnagar, Hyderabad-500029. |
| 6. Names and addresses of individuals who own the periodical and partners or shareholders holding More than one per cent of the total capital. | : | M. Veda Kumar |

I, M. Veda Kumar, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(M. Veda Kumar)

Date : 1st March, 2026 Signature of Publisher



ఎఫ్ఆర్ ఆల్చిన్



బూడిద దిబ్బవద్ద సుబ్బారావు, సుశీల



బెండపూడి సుబ్బారావు

## పురావస్తు పరిశోధకులకు అబ్బా అనిపించిన

# ఉట్నూరు బూడిద దిబ్బ!

శాస్త్రవేత్తలు, ప్రయోగశాలలో ఏదేని కొత్త విషయాన్ని ఆవిష్కరించినపుడు ఎంత ఆనందపడతారో, అలాగే పురావస్తు పరిశోధకులు కూడా మానవ జీవన వికాసక్రమాన్ని ఖచ్చితంగా అంచనా వేయగలిగే ఆధారం లభించినపుడు అంతకంటే ఆనందపడతారు. తెలంగాణాలో జోగులాంబ-గద్వాల జిల్లా, ఐజ మండలంలోని ఉట్నూరు వద్ద ఎఫ్ఆర్ ఆల్చిన్, బెండపూడి సుబ్బారావు అనే పురావస్తు పరిశోధకులకు కూడా అలాంటి అనుభూతి కలిగింది. 1960-61లో ఉట్నూరులోని కొత్తరాతియుగపు స్థావరం వద్ద తవ్వకాలు జరుపుతున్న వారికి సమీపంలోని కుటుకునూరు, మాచనపల్లి, ఐజ, ఇంకా ఉట్నూరు వద్ద ఎత్తైన బూడిదదిబ్బలు కనిపించాయి. గమ్మత్తేమిటంటే ఈ బూడిదదిబ్బల్లో కొత్తరాతియుగపు (సా.శ.పూ.2100) నునుపైన, పదునైన మొనలు గల నల్లశానపు రాతిగొడ్డళ్లు, సూక్ష్మరాతి పనిముట్లు, గచ్చుకాయ, ఊదారంగు మట్టిపాత్రల ముక్కలు, ఇంకా ఎముకలు కూడా కనిపించి, కొత్తరాతియుగపు జీవన విధానాన్ని తెలుసుకోవటానికి ఉపయోగపడినాయి.

ఉట్నూరు తవ్వకాల్లో ఎఫ్ఆర్ ఆల్చిన్, ఆయన భార్య బి.ఆర్. ఆల్చిన్‌లతో పాటు బెండిపూడి సుబ్బారావు పాల్గొన్నారు. గుడారాల్లో కుటుంబ సమేతంగా ఉన్న ఆల్చిన్‌తో పాటు వాళ్ల ముద్దుల కూతురు సుశీల కూడా, వాళ్ళతోపాటే కొత్తరాతియుగపు స్థావరాల్లో, బూడిద దిబ్బల వద్ద బులి బులి నడకలతో కలియదిరిగుతున్న దృశ్యం పరిశోధకుల దృష్టినాకర్షించింది. స్థిరనివాసం, నాణ్యమైన రాతిపనిముట్ల తయారీ, పశువులను మచ్చిక చేసుకోవటం, ముమ్మరవ్యవసాయం లాంటి కొత్త జీవన విధానాన్ని ఆవిష్కరించిన కొత్తరాతియుగాన్ని గార్డెన్‌ఛైల్డ్, విప్లవమన్నాడు. గుడిసెల్లో ఉంటూ సమీపంలో పశువుల కొట్టాలనేసుకొని జీవించేవారు. పొలాల్లో కొంత కాలం పశువులను మేపుతూ, అక్కడే బసచేసేవాళ్లు. ఆ సందర్భంగా పశువుల పేడను, ఒకచోట దిబ్బగా పోగేసేవారు. అలా పోగేసేటప్పుడు, వారు వినియోగించిన పాత్రలు, రాతిగొడ్డళ్లు, మాంసాహార అవశేషాలను కూడా అందులో విసిరేసేవారు. అలా కొత్తరాతియుగపు వ్యవసాయక జీవులు ఏర్పరచిన పేడ దిబ్బల్ని, కాల్చి, వేడుక చేసుకొనేవారు. ఆ వేడుకలో సంక్రాంతి సందర్భంగా ఇప్పటికీ కొనసాగుతున్న భోగిమంటలు. మన సంక్రాంతి సంబరాలు కొత్తరాతియుగంలోనే ప్రారంభమైనాయనీ, అవి దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఇప్పటికి నాలుగువేల ఏళ్ల నాడే తెలంగాణాలోని ఉట్నూరు వద్ద ఆనవాళ్లు లభించటం, తెలంగాణా ఒక చరిత్రలో మైలురాయి.

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in



# భూపతి చంద్ర స్మారక కథానికల బహుమతి ప్రదానోత్సవం

## తేది: 19.02.2026

## భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్

భూపతి చంద్ర స్మారక కథానికల బహుమతి ప్రదానోత్సవ సభను హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎమ్.లక్ష్మీ కాంతారావు, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ మృణాళిని, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీ మహమ్మద్ ఖదీర్ బాబు, విశిష్ట అతిథిగా ఆంధ్రజ్యోతి దినపత్రిక పూర్వ సంపాదకులు శ్రీ కె. శ్రీనివాస్, ఆత్మీయ అతిథిగా సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతినిధి శ్రీ బి. నరసింగరావు పాల్గొన్నారు. సభా సమన్వయాన్ని శ్రీ సి.ఎస్. రాంబాబు నిర్వహించారు.




సభ ప్రారంభానికి ముందు సారస్వత పరిషత్ తరపున చెన్నయ్య గారు అతిథులకు మహాకవి పంపన రచించిన **"విక్రమార్జున విజయం"** (పంప భారతం) (తెలుగు అనువాదం: జోష్యుల సదానందశాస్త్రి) పుస్తకాలను బహుకరించారు. ఈ పుస్తకం కాంతారావు గారికి చాలా ఇష్టమైన పుస్తకం. కాంతారావుగారు చెన్నయ్య గారిని సన్మానించారు. అతిథులు భూపతి చంద్ర చిత్ర పటానికి జ్యోతి ప్రకాశన చేశారు. భాస్కర్ రెడ్డి గారు ప్రార్థన శ్లోకం పాడినారు. భాస్కర్ రెడ్డిగారిని నర్సింగరావు గారు శాలువాతో సత్కరించారు.

గత సంవత్సరం భూపతి చంద్ర స్మారక కథానికల పోటీలు నిర్వహించినప్పుడు 150కి పైగా కథలు వచ్చాయి. ఈ సారి 300 పైగా కథలు వచ్చాయి. అందులో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా చాలా మంది కథానికలు పంపడం జరిగింది. వీటిని పదిమంది న్యాయనిర్ణేతలచే స్క్రూటిని చేయడం జరిగింది. వీరు ఎంపిక చేసిన కథలను మరోసారి ఇద్దరు న్యాయనిర్ణేతలతో ఎంపిక చేయించి బహుమతులు ప్రకటించినారు.

ప్రథమ బహుమతి 'అంతర్ధానం' శ్రీ సుంకోజి దేవేంద్రాచారి (కడప), ద్వితీయ బహుమతి 'పులి నెత్తుటి ముగ్గు' శ్రీ పొత్తూరి సీతారామ రాజు (కాకినాడ), తృతీయ బహుమతి 'కన్నీటి వసంతం' శ్రీ పుప్పాల కృష్ణమూర్తి (కోదాడ) లు ఎంపికైనారు. వీటితో పాటు మరో ఐదుగురికి ప్రోత్సాహక పురస్కారాలు లభించాయి. 'ఒక కొడుకు తీర్పు' డాక్టర్ ఎం. సుగుణ రావు (విశాఖ), 'ఇచ్చేటనే కద' శ్రీ చొక్కర తాతారావు (వైజాగ్), 'అంబటి తట్ట' శ్రీ మొయిద శ్రీనివాసరావు (విజయనగరం), 'రెండో కోణం' శ్రీమతి ఉయ్యూరు అనసూయ (ఎన్టీఆర్ జిల్లా), 'కర్టెన్' శ్రీ మధుసూదనరావు (నెల్లూరు జిల్లా) రాసిన కథలకు ప్రోత్సహక పురస్కారాలు అందించారు.



**క్రీ.శే. శ్రీ మణికొండ భూపతిరావు గారు** శ్రీ రామానంద తీర్థులు వంటి ఉన్నత వ్యక్తుల ఉపన్యాసాలు విని, వాటికి ప్రభావితులై, **భారత స్వాతంత్ర్య ఉద్యమంలో** చురుగ్గా పాల్గొన్నారు. **కో-ఆపరేటివ్ ఉద్యమంలో** తనదైన పాత్ర వహించారు. **గ్రంథాలయ ఉద్యమంలో** పాల్గొని అనేక మంది యువకులను అక్షరాస్యత వైపు ప్రోత్సహించారు. శ్రీ మాడపాటి హనుమంతరావు సారథ్యంలో బాలికల విద్యను ప్రోత్సహించేవారు. మహిళలు, పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం శక్తివంతంగా ఉంటుందని నమ్మేవారు. అందుకే **మహిళల సాధికారత** కోసం ఎంతో కృషి చేశారు. వారు సామాజిక సేవలు చేయడంలో ఎప్పుడు కూడా ముందు ఉండేవారు. వారికి తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషల్లో మంచి ప్రావీణ్యం వుంది. సాహిత్యాభిలాషి. శ్రీ మహాత్మ నారాయణ స్వామిగారు సంస్కృత భాషలో రచించిన కర్తవ్యదర్పణ గ్రంథాన్ని తన 73వ ఏట తెలుగు భాషలోకి అనువదించారు. 1954లో ప్రజ్ఞాపురము గ్రామంలో విజ్ఞాన వర్ధని అనే గ్రంథాలయాన్ని స్థాపించి విద్యార్థులకు, యువజనులకు విద్యపట్ల ఆసక్తిని కలిగించి ప్రోత్సహించారు. దక్షిణ భారత హిందీ మహాసభ సభ్యులుగా కొన్ని సంవత్సరాలపాటు గజ్వేల్ పట్టణంలో పరీక్షా కేంద్రాలు నిర్వహించారు. భూపతిరావుగారికి వ్యవసాయమన్నా, పశువులన్నా మక్కువ ఎక్కువ. వాటిని తన రెండు కళ్ళుగా భావించేవారు.



భూపతిరావుగారు 1993లో స్వర్గీయులయ్యారు. వారి ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా వారి ఏకైక కుమార్తె స్వర్గీయ శకుంతలా దేవిగారు, వారి కుమారులు లక్ష్మీ కాంతరావుగారు, నర్సింగరావు గారు, విజయ్ కుమార్‌గారు, వేదకుమార్‌గారు, అశోక్ కుమార్‌గారు తమ తండ్రిగారి పట్ల అపారమైన ప్రేమతో, గౌరవంతో మణికొండ భూపతి మెమోరియల్ ట్రస్ట్ స్థాపించారు. వారి పెద్ద కుమారుడు శ్రీ మణికొండ లక్ష్మీ కాంతారావుగారు ఛైర్మన్‌గా ట్రస్ట్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు చేయూతనిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, గ్రంథాలయాలకి పుస్తకాలు అందించి ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీరి మాతృమూర్తి శ్రీమతి చంద్రమ్మగారు 2015లో స్వర్గస్థ లయ్యారు. అప్పటి నుండి మణికొండ భూపతిరావు మెమోరియల్ ట్రస్ట్‌ను 'భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్'గా మార్చి తల్లిగారిపై వారికున్న ప్రేమను, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా గతంలో వలె సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

ప్రఖ్యాత రచయిత 'అంపశయ్య' నవీన్‌గారు అంపశయ్య నవల రాసి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 2019 సంవత్సరంలో హైద్రాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో భూపతిచంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నవీన్ గారికి లక్ష రూపాయలు బహూకరించి 'కీర్తి శిఖర' పురస్కారాన్ని అందించారు. లక్ష్మీకాంతరావుగారికి సాహిత్యం, సంగీతం అంటే చాలాయిష్టం. వారి అభీష్టం మేరకు 2025 నుంచి భూపతి చంద్ర స్మారక కథానికల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం భూపతిచంద్ర స్మారక కథానికల పోటీ 2026 నిర్వహించి విజేతలకు 19 ఫిబ్రవరి 2026న హైద్రాబాద్‌లోని సారస్వత పరిషత్ ఆడిటోరియంలో బహుమతి ప్రదానోత్సవ సభను ఆత్మీయంగా, ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఇక నుంచి ప్రతి సంవత్సరం శ్రీ లక్ష్మీకాంతారావు గారి పుట్టినరోజు ఫిబ్రవరి 19న ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని భూపతిచంద్ర మెమోరియల్ ట్రస్ట్ నిర్ణయించింది.







గౌరవ అతిథి **శ్రీ మహమ్మద్ ఖదీర్ బాబు** మాట్లాడుతూ... ఇలాంటి గొప్ప సందర్భంలో నన్ను పిలిచి వేదిక నుంచి మీ అందరిని కలిసే అవకాశం ఇచ్చిన పెద్దలు శ్రీ లక్ష్మీ కాంతారావు గారికి కృతజ్ఞతలు. ఈ మధ్య గాయకుడు రఫీ శతజయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తూ లక్ష్మీ కాంతారావు గారికి ఫోన్ చేశాను. వారికి రఫీ అన్నా, వారి పాటలన్నా విశేషమైన ప్రీతి అన్నారు. అలా లక్ష్మీకాంత్‌గారితో నేను మొదటిసారి మాట్లాడడం జరిగింది. ఈ సభకు ముందు వేసిన పాటలు విన్న తర్వాత ఒక రకమైన దుఃఖం వచ్చింది. ఆ పాటల్లో మనుషులు ఎంత ప్రేమగా ఉన్నారు, ఎంత సున్నితమైన భావాలు. హృదయాలని పంజరంలో పెట్టి.. ముత్యాలను దానిమ్మ గింజలుగా పెట్టానని పాడిన పాటలు.. మనుషుల సున్నితత్వాన్ని తెలియజేస్తాయి. గురు దత్తుకు బాల్యం నుంచి కంటి చూపు కనపడదు. గజం తర్వాత అసలు ఏమీ కనపడదు. కానీ, ఆయన సినిమాలు అన్నీ అద్దాలు లేకుండా నటించారు. హీరోయిన్‌ను చౌద్‌నీక చాంద్ హో.. యా ఆబ్ తాబ్ హో.. అని ఆమెను చూస్తూ పాడుతున్నాడు కానీ... ఆయనకు ఏమీ కనిపించదు. తన కంటికి ఏమీ కనిపించకపోయినా ప్రపంచానికి అందమైనవి.. లాలితమైనవి చూపించారు. నేటి రచయితలు అడంబారాన్ని వీడి సమాజానికి లలితమైనవి, సున్నితమైనవి, ప్రేమ పూరకమైనవి చూపించి మళ్లీ మామూలు మనుషులుగా మారాలని, భూపతి చంద్ర స్మారక కథానికల పోటీల్లో బహుమతులు ఇవ్వబోయే కథలు గాని, మనుషులని మనుషులుగా ఉంచే కథలకు ప్రాధ్యానత ఇస్తారని ఆశిస్తున్నాను.

విశిష్ట అతిథి ఆంధ్రజ్యోతి దిన పత్రిక పూర్వ సంపాదకులు **శ్రీ కె. శ్రీనివాస్** మాట్లాడుతూ... భూపతి చంద్ర గారి జ్ఞాపకంలో వాళ్ల కుటుంబ సభ్యులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కథల పోటీలు నిర్వహించడం, దాంతో విజేతలకు బహుమతులు అందజేయడం, గత ఏడాది మొదలు పెట్టిన ఈ అనవాయితీ... సాహిత్య క్యాలెండర్‌లో ఒక ఈవెంట్‌గా చేరింది. మామూలుగా కథల ఎంపిక విషయంలో కథల పోటీలు పెట్టేవారు. తెలుగు సాహిత్యంకు సంబంధించి ఒక కర్తవ్యంతో పోటీలు నిర్వహించడం అనేది మంచి పద్ధతి. ప్రస్తుతం తెలుగు సమాజంలో ఎట్లా ఉందో, ఏ కష్టాల్లో ఉందో, ఏ సుఖాల్లో ఉందో, ఏం ఆలోచిస్తుందో చెప్పే కథలే... ఎంపికకు పోటీలు నిర్వహించడం జరిగిందని నా అభిప్రాయం. అయితే ఏ కథలు రావాలి అనే చెప్పే సందర్భం వచ్చినప్పుడు కవిత సందర్భంలో శ్రీశ్రీ కవితగా చెప్పారు. ఇతిహాసపు, అడుగున పడి కనిపించని చీకటి కోణం కథలు అన్నీ ఇప్పుడు కావాలన్నారు. అంటే ఏ కథలైతే చెప్ప బడలేదో, ఏ కథలైతే వినబడటం లేదో, ఏ కథలు బయటకు రాలేదో, ఏ కథలు చూడలేకపోయామో అలాంటి కథలు పైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో తెలంగాణ సమాజానికి రావాల్సిన కథలు చాలా తక్కువ వచ్చాయి. అనేక కారణాల వల్ల చాలా తక్కువ వచ్చాయి, భిన్నంగా ఉన్న అంశాలను పూర్తి చేయాల్సిన అవసరం కూడా ఉంది. ముఖ్యంగా చారిత్రక కథలు మన దగ్గర తక్కువ వస్తున్నాయి. చరిత్ర అంటే ఇవాళ సాధారణ వ్యక్తుల్లో కూడా చాలా ఆసక్తి పెరిగింది. కాబట్టి తెలంగాణ ప్రాంత చరిత్రలు సృష్టించిన మనుషులు ఉన్నారు. వాళ్ల చరిత్ర మన దగ్గర లేదనిపిస్తుంది. భూపతి చంద్ర కథల పోటీల నిర్వహకులు, తెలుగువారి జీవితాలను, ప్రాంతాలను, విద్యాస్థాయిలను, నివాస ప్రాంతాలను బట్టి వివిధ అంశాలను తెరపైకి తేవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. ఇలాంటి అనేక అంశాలు తెరపైకి వస్తే తప్ప మన సమాజానికి అర్థం కాదు. అన్ని ప్రాంతాల కష్టాలు, ప్రేమలు బయటికి రావాలన్నారు. అందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడుతాయని ఆశిస్తున్నానన్నారు.

ముఖ్య అతిథి **ప్రొఫెసర్ సి.మృణాళిని గారు** మాట్లాడుతూ... మణికొండ కుటుంబ సభ్యులు 'భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్' ద్వారా ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లక్ష్మీకాంతారావు, నరసింగరావుగారు, వేదకుమార్‌గారు ముగ్గురు నాకు ఆత్మీయులు. కాంతారావు గారితో నాకు చాలా కాలా నుండి పరిచయం. ఖదీర్ బాబు అన్నట్టు ఆ స్వర ప్రపంచంలో నుంచి అక్షర ప్రపంచంలోకి రావడం నాకు ఆనందంగా అనిపించలేదు. నాకు స్వర ప్రపంచమే ఎక్కువ ఇష్టం. సంగీతం చాలా ఇష్టం. కాబట్టి అందులో నుంచి ఒక్కసారి ఈ అక్షర ప్రపంచంలోకి లాక్కొచ్చారు ఏంటీ అని అనుకున్నా. ఆ రకమైన సంగీత స్నేహం నాది, కాంతారావు గారిది. కాంతారావు గారితో ఆయన ఇంట్లో హిందీ, తెలుగు పాటలు లాంటి కార్యక్రమాలకు నన్ను పిలిచేవారు. గత పదేళ్లుగా సికింద్రాబాద్‌లో ఉండే రఫీ ఫౌండేషన్‌లో మేమిద్దరం సభ్యులం. ఆ ఫౌండేషన్ పలు కార్యక్రమాల్లో మేమిద్దరం పాల్గొన్నాం. అలా పాటల స్నేహం కాంతారావు గారితో. నరసింగరావు గారితో సినిమాలే స్నేహం. వారు తన హరివిల్లు సినిమా తీస్తున్నప్పుడు ఆ సినిమా ముగింపు గురించి చిన్న చర్చ జరిగింది. ఇందులో ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే... సినిమా జాబితాల్లో ముందు వేసే పేర్లల్లో నా పేరు కూడా వేశారు. ఇది నేను ఆయనకు చేసింది ఏమి లేదు. ఆయనకు ధన్యవాదములు. వేదకుమార్ గారు దక్కన్ ల్యాండ్, బాల చెలిమి మాసపత్రికల ద్వారా ఆయన చేస్తున్న సేవలు అందరికి తెలిసినవే. ముఖ్యంగా దక్కన్ ల్యాండ్‌లో ఉండే వ్యాసాలు అన్నీ చరిత్రకు సంబంధించిన వ్యాసాలు ఉంటాయి. కథ వస్తువులు కావాలని అనుకుంటే దక్కన్ ల్యాండ్ పత్రికను కొనుక్కుంటే చాలు. అటు వంటి పత్రికను నడపడం అంటే చాలా కష్టం. బాలసాహిత్యం తెలుగులో ఏ స్థాయిలో ఉందో మన అందరికీ తెలుసు. మిగిలిన భారతీయ భాషలతో పోలిస్తే.. తెలుగు భాష వెనుకబడే ఉంది. దీనికి ఆయన బాలచెలిమి ద్వారా పిల్లల కోసం కథలు, పిల్లల్లో ఆలోచన, వారికి జ్ఞానం పెంపొందే వంటి కథలు, విశేషమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేదకుమార్ గారు అంటే చాలా గౌరవం. ఈ ముగ్గురు ఈ కార్యక్రమానికి పిలవడం నేను గౌరవంగా భావిస్తున్నాను. నేటి సమాజంలో కళలు, సాహిత్యం, సినిమాలు, రాజకీయాలు ఇలా అనేకం లోపించాయి. కళలు, సంస్కారం



ఈ రెండింటిని ఈ ముగ్గురు పోషిస్తున్నారు. వాళ్లకు వీటి అవసరం లేదు. ఎందుకంటే ఇప్పుడు నా కథలు సోషల్ మీడియాలో లేకపోతే ట్విట్టర్‌లో రాసుకుంటాను. నా కథను ఎక్కడైనా రాసుకోవచ్చు. పది మందికి పంపవచ్చు. దాంట్లో ఎంపిక ఉండదు. నా మిత్రులందరూ చాలా బాగుంది అంటారు. మిత్రులు కాని వారు బాగాలేదని అంటారు. అలా నడుస్తుంది ఇప్పుడు సాహిత్యం వ్యవహారం. అలాంటి సమయంలో నాణ్యత కలిగినటువంటి పోటీలు చాలా అవసరమని నేను అనుకుంటాన్నాను. ఎందుకంటే కథల పోటీలు పెట్టినప్పుడు కథ అంటే ఏమిటి అని చర్చించడం జరుగుతుంది. దానికి వడపోత ఉంటుంది. ఈ వడపోతలో పది మంది న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు. ఇద్దరేమో తుది న్యాయనిర్ణేతలుగా ఉన్నారు. ఇంతగా వడ పోత జరిగితే, సహజంగానే న్యాయమైన రచన మన ముందుకు వస్తుంది. ఇటువంటి కథ పోటీల వల్ల మనకు జరిగేదిమిటంటే.. నాకు నేను రాసుకోని, లైకులు కొట్టుకోడమే కాకుండా, నిజంగా ఒక స్థాయి కలిగిన రచనలు సాహిత్యంలో వచ్చే అవకాశం ఉంటుంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నా అభినందనలు. ఇప్పుడు సాహిత్యం రాస్తున్న వాళ్ళలో కొంచెం నైపుణ్యం తగ్గింది. రాయడంలో ఉండాల్సిన నైపుణ్యం లేదు. తెలుగులో కథ మొదలైనప్పటి నుంచి ఈనాటి వరకు గల ప్రమాణాలు అలాగే నిలుపుకుంటున్నాయి. మన మొత్తం భారతీయ సాహిత్యంతో పోటీ పడగలమో లేదో తెలియదు కానీ.. కథలో ఎవరితోనైనా పోటీ పడే సత్తా తెలుగు సాహిత్యానికి ఉంది. అటువంటి వారసత్వం ఉన్న తెలుగు వాళ్ళు ఇప్పుడు కథని ఎంత ముందుకు తీసుకెళ్తున్నారు. ఎంత మంది న్యాయం చేస్తున్నారు. కథ రచనలు ప్రయోగాన్ని, కొత్త దనం గతంలో వచ్చిన ప్రాధాన్యత ఇప్పుడు రావటం లేదు. అందుకని అప్పటి కథలు ఈ నాటి రచయితలు చదవాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. మంచి కథలే వస్తున్నాయి. కానీ కొత్త దనం తీసుకోవాలంటే రచయితలో ఉండాల్సింది పరిశీలన, పరిశోధన. ఈ రెండూ లేకపోతే సాహిత్యం మిగలదు. బుచ్చి సుబ్రమణ్యం గారు గొప్ప రచయితగా తెలుగు సాహిత్యంలో ఎప్పుడూ లేరు. ఆయన 'జేబురు వల్లు' అనే ఒక కథ రాశాడు. ఆ జేబురు వల్లు కథలో రచయిత ఉన్నాడు. పూర్తిగా సంభాషణ. ఇక ఏమీ ఉండదు. ఈయన చేసిన ఈ కథల్లో మొత్తం సంభాషణలు రాస్తూ... కొంత హీరోయిన్ వైపు నుంచే నడుస్తుంది. నలుగురు అబ్బాయిలు, ఒక్క అమ్మాయి మాత్రమే ఉంటారు. అంటే కథను ఎలా చెప్పవచ్చు, ఎంత గొప్పగా చెప్పవచ్చు, ఎక్కడా రచయిత లేదు. కేవలం అమ్మాయికి అబ్బాయికి నాలుగు డైలాగులు. మళ్లీ రెండు చుక్కలు... మళ్లీ మరో అబ్బాయితో నాలుగు డైలాగులు.. మళ్లీ రెండు చుక్కలు ఇలా ముగుస్తుంది. అలా కథను చెప్పడంలో స్త్రీ, పురుష సంభాషణల మధ్య ఎంత లోతైన అవగాహన ఉంది. వివాహం అనే వ్యవస్థ మీద ఎటువంటి వ్యాఖ్యానం ఉంది. ఆ రెండు పేజీల కథల్లో ఎన్ని పనులు సాధించారు ఆయన. ఇటువంటి కథలు మన తెలుగు సాహిత్యంలో కూడా ఉన్నాయి. ఇలాంటి కథలు బయటకు రావాలని కోరుకుంటాను. కథల్లో ప్రయోగాలు చేయటం, కథల్లో కావాల్సిన పరిశోధన, పరిశీలన అనేవి కథకులు పెంచుకుంటే బాగుంటదని నా చిన్న సూచన.

ఆత్మీయ అతిథి, సినీ దర్శకుడు, సాంస్కృతి ప్రతినిధి **నర్సింగరావు గారు** మాట్లాడుతూ... ఇలాంటి సందర్భాల్లో మాట్లాడడం చాలా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే హాలీవుడ్ పర్సన్ గల కృష్ణమోహన్ ఒక్క పాట రాశాడు.. ఆ పాటలో మనం కరిగిపోతాం. జీవిత లోతులోంచి ఒక సముద్ర కెరటంలాగా వస్తుంది. మళ్లీ నదిలోకి వెళ్లిపోతుంది. సాహిత్యంలో కూడా అలాంటి గొప్ప విధానం ఉంటుంది. మిత్రులు చెప్పినట్లు ముందు మా అన్నయ్య సంగీతంతో ప్రారంభించారు. సంగీతంలో ఉన్న సాహిత్యం. ఆ పాటల్లో ప్రేమ ఉంటుంది. ఇప్పటి పాటలు, ఇప్పటి సినిమాలు దాదాపు చూడలేదు. తెలుగులో చాలా మంది గొప్ప కథకులు ఉన్నారు. నేను, మా అన్నయ్య కాంతారావు గారు 1960వ సంవత్సరంలో పోటాపోటీగా చదివే వాళ్లం. రోజూ రెండు, మూడు పుస్తకాలు చదివేవాళ్లం. కథకులు, గొప్ప గేయకులు, గేయాలు రాసేవారు, పాటలు రాసేవారు, కవితలు రాసే వారు ఉన్నారు. జీవిత అనుభవం అన్నదే ఒక నిధి. పరిశోధన, పరిశీలనలకు మించి ఊహా శక్తి ఈ అన్ని వస్తువులతో ఊహా శక్తితో ముందుకు వెళ్లినప్పుడు సాహిత్యం సృష్టించబడుతుంది. ఊహా శక్తి అంటే కేవలం గాలిలోంచి కాదు. అంటే, ఇప్పుడు జీవిత అనుభవంతో రాయాలంటే కొంత వరకే పరిమితి. ఊహ శక్తి లేదు. ఉదాహరణ మనకు ఉన్న రకరకాల కళలు, సాహిత్యంతో కలిపి మనం చూస్తే చిత్ర కళ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత దశకు వెళ్లిపోయింది. ప్రతి ఆర్టిస్టుకు, ప్రతి రచయితకు తనదైన శైలి ఉంటుంది. వీటి ప్రభావం ప్రేక్షకుల మీద ఉంటుంది. అద్భుతంగా ఈ కార్యక్రమం జరగడం సంతోషమన్నారు.

భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ **ఎమ్.ఎల్.కాంతారావు గారు** మాట్లాడుతూ.. నాకు పూర్వ కవులల్లో భాసుడు రాసిన చారుదత్తషోము తర్వాత శూద్రకుడు వ్రాసిన మృచ్ఛకటికం, తర్వాత తరాల్లో శ్రీపాద వారు. శ్రీపాద గారు గొప్ప అద్భుతమై కథను రాశాడు. తర్వాత రచయితల్లో కొడవటిగంటి కుటుంబరావు గారు అంటే చాలా ఇష్టం. ఇక కన్యాశుల్కం నిత్యం పఠించే గ్రంథం. తర్వాత మధురాంతకం రాజారాం గారి వింత ప్రపంచం. దీన్ని 40 ఏళ్ల క్రితం రాశాడు. అది గొప్ప కథానిక. తర్వాత దిద్దుబాటు కథనికలో మూడు పాత్రలు గోపాల్ రావు, కమ్మలిని, రాము, బండారు అచ్చమాంబ గారు రాసిన ధన త్రయోదశి గొప్పది. ఈ రెండింటిలో కూడా స్త్రీ విద్య ముఖ్యమనేది చెప్పబడ్డాయి. నేను చాలా పుస్తకాలు చదువుతాను, కానీ ఇప్పటివరకు ఒక్క పేజీ కూడా రాయలేదు. చాలా మంది చేత పాటలు పాడించాను, కానీ నేను పాడను. 40ఏళ్ల తర్వాత నేను మైక్ ముందు వచ్చాను. 1986లో సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో, గతేడాది నిర్వహించిన సభలో మాట్లాడాను.. ఇప్పుడు




మాట్లాడుతున్నాను. నాకు కథానికలు బాగా ఇష్టం. కథల్లో నవరత్నాలు అల్లిన కథలు ఉంటాయన్నారు.

**శ్రీ కె.పి. అశోక్ కుమార్** గారు మాట్లాడుతూ.. వ్యక్తులు, సంస్థలు ప్రతికలు నిర్వహించే కథల పోటీలకు గత 25 సంవత్సరాలుగా నేను న్యాయ నిర్ణేతగా ఉంటూ వస్తున్నాను. బహుమతులు ఇవ్వడంలో చాలా ఖచ్చితంగా వ్యవహరించడం జరిగింది. నిజానికి ఫలితాలు వచ్చిన తర్వాతే బహుమతులు ఎవరికి వచ్చాయో మాకు తెలిసిందన్నారు

**శ్రీ పొత్తూరి సీతారామరాజు** మాట్లాడుతూ... కథలు కొత్తగా రాస్తున్నారు. కథలు కొత్తగా రాయడం వల్లే 350 కథల్లో నాకు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాను. ఎక్కడో ఆంధ్ర నుంచి వచ్చి తెలంగాణలో అవార్డు తీసుకోవడం, ఇలాంటి గొప్ప మహనుభావుల చేతుల మీద నుంచే నేను అవార్డు తీసుకోవడం అంటే గొప్ప చరిత్రన్నారు.

**శ్రీ పుప్పాల కృష్ణమూర్తి** మాట్లాడుతూ.. గొప్ప వ్యక్తులు, సాహిత్య రచయితలు ఉన్న ఈ సభలో మాట్లాడడం అంటే.. నాకు కొద్దిగా భయం, ఇబ్బంది కూడా ఉంది. నెల రోజుల క్రితమే బాల చెలిమి వారు నిర్వహించిన వనదేవత కథకు కూడా శ్రీ వేదకుమార్ చేతుల మీదగా బహుమతిని అందుకోవడం జరిగింది. వేదకుమార్ గారికి నమస్కారాలు తెలిపారు.

**శ్రీ చొక్కార తాతారావు** మాట్లాడుతూ.. ముందుగా నా కథకు బహుమతిని ప్రకటించిన భూపతి చంద్ర నిర్వాహకులకు.. న్యాయ నిర్ణేతలకు ధన్యవాదములు తెలిపారు.

దక్కన్‌ల్యాండ్, బాల చెలిమి ఎడిటర్ **శ్రీ వేదకుమార్** మాట్లాడుతూ.. అతిథులు, అన్నయ్యలు, బహుమతి విజేతలు, న్యాయ నిర్ణేయితలు కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. భూపతి చంద్ర ట్రస్ట్ గురించి కూడా రాంబాబు గారు తెలియజేశారు. కథానిక పోటీలు ఎందుకు నిర్వహించాలని పెద్ద అన్నయ్య చాలా ఆలోచించి కథలకు ప్రాముఖ్యత ఇవ్వాలని నిర్ణయానికి రావటం జరిగింది. మాతో సహకరించిన అందరికి కూడ కృతజ్ఞతలు. రచయితలందరికి కృతజ్ఞతలు తెలిపారు. సారస్వత పరిషత్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

చివరిగా శ్రీ కాంతారావు గారిని పలువురు రచయితలు, కవులు, తదితరులను ఘనంగా సన్మించారు.

కథల ఎంపిక న్యాయనిర్ణేతలుగా శ్రీ డబ్బీర్‌కార్ రూప్‌కుమార్, శ్రీమతి నెల్లుట్ల రమాదేవి, శ్రీ వెల్దండి శ్రీధర్, శ్రీ జగాష్ విలి, శ్రీ బి.వి.ఎన్. స్వామి, శ్రీ గోపగాని రవీందర్, శ్రీ చింతపట్ల సుదర్శన్, శ్రీ సలీం, శ్రీ లక్ష్మణస్వామి, శ్రీ రాంచందర్‌జీ, శ్రీ ఎమ్.ఆర్.కృష్ణ సహకరించగా... తుది న్యాయనిర్ణేతలుగా శ్రీ కె.పి.అశోక్ కుమార్, ప్రొఫెసర్ ఎస్. రఘు వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో అశ్విన్ కుమార్- సంపాదకులు మిసిమి పత్రిక, బి.ఎస్.రాములు-మాజీ ఛైర్మన్ బీజీ కమీషన్, జూలూరు గౌరీశంకర్ -మాజీ చైర్మన్ సాహిత్య అకాడమీ, డాక్టర్ డి. రాజిరెడ్డి, కిషోర్-చైర్మన్ రామనంద తీర్థ ట్రస్ట్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, వనపట్ల సుబ్బయ్య, భీంపల్లి శ్రీకాంత్, గరిపెల్లి అశోక్, అమరవాణి నీరజ, బండారి విజయ, లక్ష్మి, పాడి రవి-ఐఆర్ఎస్ హైదరాబాద్, డాక్టర్ కెవి. రమణ-రిటైర్డ్ హెచ్ఓడీ ఉస్మానియా హాస్పిటల్, ఏ.జి.కృష్ణ, తులసీరామ్, నరసింహారావు, రమణ-గాయకుడు, కళాగా కృష్ణమోహన్- రిటైర్డ్ ఆల్ ఇండియా రేడియో, ఎం. రామ్మోహన్‌రావు, జి. గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రావు-రిటైర్డ్ అడిషనల్ ఏసీపీ, దేవేందర్‌రావు-రిటైర్డ్ ఏసీపీ, ఉండ్రాళ్ళ రాజేశం, బైతి దుర్గయ్య, జనార్ధన్‌రావు, రాజలింగం, జాయాయుద్దీన్ - మాజీ వైస్ ఛైర్మన్ గజ్వేల్ మున్సిపాలిటీ, పి. మల్లేశం - గజ్వేల్ జెడ్పీటీసీ, మర్కంటి భాగ్యలక్ష్మి - కనకసేన గజ్వేల్ కౌన్సిలర్, వసీం ఖాన్-మాజీ కౌన్సిలర్ గజ్వేల్, రాజేష్, సమన్వయకర్తలు సయ్యద్ ఖైజర్, కొత్వాల్ సచిన్, ఇంకా తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ రచయితలు, కవులు, గాయని, గాయకులు తదితరులు పాల్గొన్నారు.

- కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com





# అడవుల రక్షణ అందరి బాధ్యత..



**చారిత్రక నేపథ్యం:**

భవిష్యత్తు తరాల వారికి అడవుల ప్రాముఖ్యాన్ని తెలపాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) మార్చి 21న 'వరల్డ్ ఫారెస్ట్ డే'గా నిర్వహించాలని భావించింది. 1971లో జరిగిన ఎఫ్ఏఓ 16వ సర్వసభ్య సమావేశంలో అన్ని దేశాలూ దీన్ని ఆమోదించాయి. తర్వాత 2012, నవంబరు 28న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవంగా జరుపుకోవాలని అధికారికంగా తీర్మానించింది.

దట్టమైన వృక్షాలు, పొదలతో కూడిన విశాల భూభాగాలను అడవులుగా పేర్కొంటారు. ఇవి అనేక జీవజాతులకు ఆవాసాలుగా ఉంటాయి. జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఇవి ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. అడవుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడం, వాటి నిర్వహణ, పరిరక్షణ, అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

అడవులు కార్బన్ సింక్‌లుగా పని చేస్తాయి. ఇవి కార్బన్‌డై ఆక్సైడ్‌ను స్వీకరించి ఆక్సిజన్‌ను విడదల చేయడం ద్వారా వాతావరణ ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి. వృక్ష జంతు జాతులకు ఇవి ఆవాసాలుగా ఉన్నాయి. మానవులకు ఆహారం, ఔషధాలు, ఇతర ఉత్పత్తులను అందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి జీవనోపాధిని కల్పిస్తున్నాయి.

అయితే అడవులను నరికి వేయడం, వ్యవసాయం, పట్టణీకరణ వంటి మానవ కార్యకలాపాలకు తోడు కార్చిచ్చు, ప్రకృతి విపత్తుల వల్ల అడవులు అంతరించి పోతున్నాయి. ఆ చర్యల వల్ల జీవ వైవిధ్యం, నేల కోతకు గురికావడం, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు పెరుగుతున్నాయి.

దీని వల్ల భూమి, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇలాగే ఉష్ణోగ్రతలు పెరిగితే ధ్రువ ప్రాంతంలో ఉన్న మంచు కరిగిపోయి ప్రపంచ వ్యాప్తంగా సముద్ర తీరంలో ఉన్న నగరాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. కావున అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అడవులు అన్ని చేస్తున్నా జాలిలేని మానవుడు తన స్వార్థం కోసం అడవులను నరికేస్తున్నాడు. వాటి వల్ల కలిగే అనర్థాలు ఎక్కువగా ఉన్నా ప్రభుత్వాలు చేయాల్సినంత చెయ్యకపోవడం వల్ల అడవుల పరిరక్షణ అనేది సాధ్యం కావట్లేదు.

అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉన్న జిల్లాగా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అడవుల జిల్లా అని పేరుంది. 1965లో దట్టమైన అటవీ ప్రాంతంగా ప్రకటించారు. 1972లో ఈ ప్రాంతం మొత్తాన్ని వన్య ప్రాణి సంరక్షణ చట్టం క్రింద 1999లో రక్షిత ప్రదేశంగా ప్రవేశపెట్టారు. ఇక్కడ అటవీ విస్తీర్ణం 2015.44 స్క్వేర్ కిలోమీటర్లు వ్యాపించి ఉంది.

**థీమ్:** "అడవులు మరియు ఆర్థిక వ్యవస్థలు". ఈ థీమ్ ఆర్థిక శ్రేయస్సు, స్థిరమైన అభివృద్ధి, స్థిరమైన అటవీ నిర్వహణ ద్వారా కలపకు మించి ఆదాయం, ఉద్యోగాలను అందించడంలో అడవుల ముఖ్యమైన పాత్రను ప్రముఖంగా చెప్తుంది.

**ఆర్థిక దృష్టి:** అడవులు గ్రామీణ జీవనోపాధికి ఎలా మద్దతు ఇస్తాయో, వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతాయో, పరీవాహక ప్రాంతాలను ఎలా రక్షిస్తాయో ముఖ్యంగా తెలియజేస్తుంది.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# ఒలందులైన హాలండీయులు-డచ్‌వారు (1602-1697)

క్రీ.శ. 15వ శతాబ్దం చివరిభాగంలోనూ, 16వ శతాబ్దం మధ్యభాగం వరకు భారతదేశంలో పోర్చుగీసులు తుదకంటా లాగి వదిలిన బాణంలా వ్యాపారరంగంలో ముందుకు సాగుతుండేవారు. వ్యాపార పరుగుపందెంలో పోర్చుగల్, స్పెయిన్ దేశాలు పరుగెత్తి, పరుగెత్తి చివరకు చతికిలపడ్డారు. **1588లో స్పెయిన్ నౌకా బలంమీద డచ్ – నెదర్లాండు దేశం ఆధిక్యత సంపాదించింది. అప్పటివరకు పోర్చుగల్ మరియు స్పెయిన్ దేశాలకు మాత్రమే దారిచ్చిన గుడ్‌హోప్ అగ్రం. భారతదేశం చేరటానికి డచ్ నౌకలకు కూడా దారిచ్చింది.**

హాలెండుకు చెందిన డచ్ కంపెనీ సుగంధ ద్రవ్యాలతో సంపన్నమైన తూర్పుతీర దీవులు జావా, సుమత్రాలతో వ్యాపారం ప్రయాణపు దారిలో ఒక మజిలీస్థావరం (Halting Centre) అవసర మొచ్చింది. అదే భారతదేశం. ఇంగ్లీషు వర్తకులకు భారతదేశపు తూర్పుకోస్తా చేనేతబట్టల వ్యాపారం మీద కన్నుబడితే, డచ్ వారికి జావా సుమత్రాల సుగంధ ద్రవ్యాల గుబాళింపు మీద కన్నుపడింది.



పోర్చుగల్ స్పెయిన్ దేశంలో విలీనమయ్యే సరికి, తమక్కావలసిన సుగంధద్రవ్యాలు వెతుక్కుంటూ డచ్‌వారు 1595లో నాల్గు డచ్ ఓడల్లో గుడ్‌హోప్ మీదుగా, భారతదేశం బయల్దేరాయి. **1602 సం॥లో 'డచ్ ఈస్ట్ ఇండియా' కంపెనీగా ఏర్పడిన డచ్ గుత్తవ్యాపారులు, డచ్ పార్లమెంటు ద్వారా తమ దేశానికి సరిక్రొత్త విదేశీ వ్యాపార భూభాగాలు సంపాదించటానికి, ఆయా భూభాగాల్లో కోటలులాంటి గోదాములు (ఫ్యాక్టరీలు) నిర్మించుకోవటానికి, అవసరమయితే వ్యాపార ప్రత్యర్థులతో సాయుధపోరాటం (యుద్ధం) చేయటానికి, యుద్ధసంధులు గావించుకోవటానికి అనుమతులు పొందారు.** 1602 సం॥లో డచ్ అడ్మిరల్ **'వాండర్ హాగన్'**ను కంపెనీ డైరెక్టర్లు కంపెనీ నిమిత్తం, **భారతదేశ తూర్పుతీరంలో ప్రత్యేకించి చేనేత బట్టల తయారీలో ప్రసిద్ధిచెందిన మసులీపట్నంలో వర్తకస్థావరం సంపాదించమని కోరింది. 1605లో డచ్‌దేశపు ప్రత్యేక బృందం గోల్కొండ దర్బారును సందర్శించి, మసులీబందరులో డచ్ ఫ్యాక్టరీ స్థాపనకు ఫర్మానా ద్వారా అనుమతి సంపాదించింది.** ఫర్మానా ఉత్తర్వు ననుసరించి డచ్ కంపెనీ వారికి రాయితీగా 4శాతం ఎగుమతి / దిగుమతి సుంకం నిర్ణయించబడగా బందరులో డచ్ వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయల్లా సాగింది.

**1605లో గోల్కొండ దర్బారు అధికార్లకు, బందరు ఓడరేవు అధికారి 'షాబందరు'కు, బందరు కొత్వాల్ – పోలీసు అధికారికి భారీఎత్తు లంచములుయిచ్చి మసులీపట్నం, నిజాంపట్నం రేవులలో వర్తకస్థావరాలు నిర్మించుకోవటానికి డచ్ వారు అనుమతులు పొందారు. గోల్కొండ సుల్తానుల హయాంలో మచిలీబందరు గొప్ప అంతర్జాతీయ పారిశ్రామిక కేంద్రమేకాక, ఓడరేవు కూడా. పోర్చుగీసులు మచిలీపట్నం వ్యాపారరంగంలో డచ్‌వారికన్నా 50 సం॥రాల ముందుకాలంలో కాలెట్టినా, తూర్పుతీరంలో వారి గుత్తాధిపత్యం విస్తరించనందున – ప్రత్యర్థులులేని డచ్‌వారు ఆరంగంలో అతి వేగంగా ముందుకుసాగారు. తమ సాయుధ బలగాలకు అవసరమైన తుపాకీ మందు తయారీ పరిశ్రమ నొకదానిని డచ్‌కంపెనీ పులికాట్‌లో ఏర్పాటు చేసుకున్నది. ఈ పరిశ్రమ కవసరమైన ముడిసరుకు గంధకం,** సూరేకారం మచిలీపట్నం, నిజాంపట్నం పరిసరాల నుండి కొనుగోలు చేసేవారు. స్థానిక ప్రభువులు విదేశీ వ్యాపారం ప్రోత్సహించాలనే పద్ధతిలో **మచిలీపట్నం, నిజాంపట్నం, మద్రాసు తేనాంపేటలోని తమ చేనేత సరుకులపై నాల్గుశాతం, పులికాట్ సరుకులపై రెండుశాతం రాయితీపన్నులు విధించగా, స్థానిక వ్యాపారస్తులు అధికమొత్తం సొమ్ము పన్నులుగా చెల్లించి నష్టపడేవారు.** డచ్ కంపెనీవారు స్థానిక చేనేత పనివారికి బట్టలనేత సరఫరా నిమిత్తం ముందస్తు చెల్లింపులు చేసి ఆకర్షించేవారు. ఒకొకప్పుడు తమకు కావాల్సిన బట్టలనేతకు నేత, కలంకారీ కార్మికులకు బందరులో కొంతసొమ్ము బయానాగా యిచ్చి పనిచేయించేవారు. **మసులీపట్నం, పులికాట్‌లలో రోజువారీ ఒకొక్కచోట 2 నుండి 3 వందలమంది కార్మికులను కలంకారీ అద్దకం నిమిత్తం నియమించి పనిచేయించేవారు. చేనేత కార్ఖానాల (షెడ్ల)పద్ధతి కూడా ప్రప్రథమంగా డచ్‌వారు బందరు పట్టణంలో ప్రవేశపెట్టారు.**

డచ్ కంపెనీ వ్యాపారులు తమకు కావల్సిన జలరవాణా సాధనాలయిన ఓడలు, నౌకలు బందరుపట్టణ శివారు నేటి

వాడపాలెం (ఓడపాలెం), వాడగొయ్యి (ఓడగొయ్యి)లలో నిర్మింప జేసుకొనేవారు. ఓడలు, నావలకు కావల్సిన కలప ఆరోజుల్లో దివిసీమ అడవుల్లో దొరికేది.

**చుట్టూ సముద్రపు ఉప్పునీటితో నిండియుండి, ఆటుపోటులు కల్గియున్న చిత్తడినేలల మధ్య ఖాళీగాయున్న సముద్రం విడిచిన లంకదిబ్బగాయున్న బందరుకోటను ముందుగా గుర్తించి, సముద్ర మార్గాన వచ్చే తమ సరుకులను నిల్వ ఉంచుకోవటానికి గోదాములు నిర్మించి వాటిని వాడింది గోల్కొండ కుతుబ్‌షాహి సుల్తానులు. అంతకుముందు కాలంలో బహుమనీలు బందరుకోటను రిజర్వు సైనికుల కేంద్రంగా వాడుకొని, ముసల్మాను సైనికుల నిమిత్తం మసీదు – శ్మశానం ఏర్పాటుచేశారు. ఈ మసీదు బందరులో కల్లా ప్రథమ మసీదు క్రింద నమోదై యున్నది. గోదాములు కలిగియున్న ఈ దిబ్బను డచ్‌వారు తమ ఎగుమతిదిగుమతి సరుకులను నిల్వ ఉంచటానికి, తమ వ్యాపార సహజ శత్రువులైన ఇంగ్లీషు, ముసల్మాను తదితర శత్రుమూకల దాటికి రక్షణగా, ఊరిచుట్టూ ఎత్తైన మట్టిగోడలు కట్టి, 11 బురుజులతో పటిష్ఠపరచి సాయుధ కాపలా పెట్టారు. మట్టి బురుజులు, బలమైన ఎత్తైన గోడలమధ్య వ్యాపార భవన సముదాయములతో కోటలా కనబడుతున్న ఈ దీవి దిబ్బ గ్రామాన్ని 'బందరుకోట' అని పిల్చారు. బందరు పట్టణంలో కొంతమంది డచ్‌వారికి 'వలందపాలెం'లో గోదాములు, నివాసగృహములు, చేనేత మరియు కలంకారీ ఖార్ఖానా షెడ్డులుండేవి.** వారి నివాసగృహములకు దగ్గర్లో డచ్‌వారి మృతదేహములు ఖననం చేసిన ప్రస్తుతం **'ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI)'** వారి పర్యవేక్షణలో ఆనాటి డచ్ శ్మశానవాటిక (సెమిట్రీ) నేటికి కూడా కలదు. **డచ్ వారి రిక్రియేషన్ నిమిత్తం వలందపాలెంలో డచ్ గార్డెన్స్, బోట్‌క్లబ్బు కూడా ఉండేది.**




కిష్ణాజిల్లా మాన్యువల్ రచయిత 1881 నాటికి గమనించి, నమోదు చేసిన అతిపురాతన – ప్రప్రథమ డచ్ కౌన్సిలర్ **'జాకబ్ డీ డెల్' సమాధి (మరణం 1624, అగష్టు 29వ తేదీ)** బందరుకోట ఓల్డ్ పెరేడ్ గ్రౌండ్ దాటింతర్వాత, స్మాల్ మగజైన్ (చిన్న తుపాకి మందుకొట్టు) ప్రక్కన ఉండేది. స్థానికులు సమాధులు పడగొట్టి, చర్చి తదితర నివాసములు ఏర్పాటు చేసుకున్నారు. జాకబ్ డీడెల్ సమాధి ఫలకం మీద ఈ దిగువ శాసనం ఉండేది.

**(In an old Cemetry in the fort outside of which is of a solitary tomb, which bears the following inscription and crust)**

HERE LEVY BEGRA
VEN DEN E. JACOB
DE DEL
IN SYN LEVEN RAET VAN
INDIEN ENDE OPPER

డచ్ కంపెనీ వ్యాపారులు బందరు – బందరు చుట్టుప్రక్కల స్థానిక దేశీ వ్యాపారులకు పని అప్పగింత పెట్టేవారు. దేశీ వర్తకులు తమ పెట్టుబడితో చేనేత బట్టలు తయారుచేసి డచ్‌వారికి కావల్సినంత సరుకు, కావల్సినప్పుడల్లా అప్పగించి లాభాలమీద లాభాలు దండుకునేవారు. తమ దగ్గర చేసే కార్మికుల కష్టార్జితాన్ని జలగల్లా పీలుస్తూ అతి తక్కువ కూలీ ముట్ట చెప్పేవారు. దేశీ వర్తకులు 12 మంది చొప్పున సిండికేట్ కద్తారు కనుక, అనివార్యంగా, ఉన్న చేనేత కార్మికులంతా దేశీ వర్తక సిండికేట్ (మాష్టర్ వీవర్స్) వ్యాపారుల దగ్గర పొట్టకూటి కోసం పనిచేయక తప్పేదికాదు, కాని ఎంతచేసినా పొట్టకూడు జరిగేదికాదు.

**1630లో దక్షిణ భారత దేశంలో గొప్ప కర్వు సంభవించింది. కర్వు బారినపడిన సాలెకులం వారు, అద్దకం – కలంకారీ కార్మికులు, చేనేత కార్మికులు, బట్టలను ఉతికి తెలుపు చేసే చాకలివారు, తిండికోసం పని వెతుక్కుంటూ బందరు వదిలి పలు ప్రాంతాలకు వలస వెళ్ళారు.** చేనేత, కలంకారీ అద్దకం పరిశ్రమలు మూలనపడే సరికి, డచ్ వారి బందరు వ్యాపారం రికార్డు స్థాయిలో దెబ్బతింది.

డచ్ వారి తూర్పు ఇండియా దీవుల వ్యాపారం విస్తరిల్లింది కాని, డచ్ వ్యాపారులవద్ద కావల్సినంత పెట్టుబడులు లేవు. **డచ్ వారికి పెట్టుబడి పెట్టే బందరు పర్షియన్ సంపన్నవ్యాపారి కమాలుద్దీన్ డచ్‌వారి నొదిలేసి పర్షియా, బెంగాలతో స్వంత వ్యాపారం కొనసాగించగా, డచ్ వారికి సరుకుల టోకు సరఫరాదారు బందరు 'చిన్నన్న' డచ్‌కు సాయంచేయటం మానివేసి పెగూ, అరకాన్, సింహళంతో సొంత వ్యాపారం కొనసాగించాడు.**

1652లో డచ్ వారు పాలకొల్లులో మరో గోదాముల సమూహం నిర్మించుకొన్నారు. **ఈ కాలంనాటికి ఇంగ్లీషు, డచ్ తదితర విదేశీ వ్యాపార కంపెనీలలో పనిచేసి పదవీ విరమణ చేసిన యూరోపియన్ ఉద్యోగులు, ఫ్రెంచ్‌వారు,**

**పోర్చుగీసులు బందరు పట్టణంలో స్థిరనివాసులవటం ప్రారంభించారు. అందుకనే 1670లో బందరు దర్శించిన డొమినికన్ దేశపు సన్యాసి 'ఫెర్నాండజ్ నావరేట్' బందరు పట్టణంలో ఇంగ్లీషు, డచ్, డేనిష్, పోర్చుగల్, ముంగ్రేల్ మరియు**

**కొందరు నల్లజాతీయులు నివసిస్తున్నారని వ్రాశాడు.**

1650కల్లా డచ్ వారి వ్యాపారం తిరిగి పుంజుకొని 1685 వరకూ కొనసాగింది కాని వారు ఇంగ్లీషువారి గట్టిపోటీ ఎదుర్కొనాల్సి వచ్చింది. **డచ్ కంపెనీ బందరులోని ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఫ్యాక్టరీని పట్టుకోవాలని గట్టి ప్రయత్నం చేసింది. వ్యాపారం నిమిత్తం తొలుత మసులీపట్నంలో కాలుపెట్టిన వారు డచ్ కంపెనీ కనుక, తరువాత వచ్చిన ఇంగ్లీష్ తదితర కంపెనీ వ్యాపారులను డచ్‌వారు చొరబాటు దారులుగా, తమ వ్యాపార ఆక్రమణదారులుగానే చూశారు.** డచ్, ఇంగ్లీషు ఘర్షణలు సాగాయి. మరోవైపు మహారాష్ట్రుల, మొగలాయి దాడులు మొదలయ్యాయి. 1690 నాటికల్లా, మసులీపటాం మరియు పులికాట్‌లకు బదులు నాగపట్నం డచ్‌వారి ప్రధాన స్థావరమయింది. **గోల్కొండ ప్రధానమంత్రి 'అక్కన్న' డచ్ వారికి బందరులో నేతవస్త్రాలు అమ్మరాదని నిషేదం విధించి, డచ్‌వారి సరుకుతో నిండిన భారీ పడవలను బందరులో నిర్భంధించాడు. 1687లో గోల్కొండ మొగలాయి పాలనలో కొచ్చింది. ఈ కాలంలోనే ఫ్రెంచ్‌వర్తకులు బందరు పట్టణంలో ఒక వర్తకస్థావరం నెలకొల్పుకున్నారు.** ఫ్రెంచ్‌వారు జింజి పాలకుని వద్ద పుదుచ్ఛేరిని కొనుగోలు చేసి వ్యాపార ఫ్యాక్టరీ బలపర్చుకున్నారు. 1693లో పుదుచ్ఛేరిని డచ్‌వారు స్వాధీనం చేసుకున్నారు కాని, 1697లో ఫ్రెంచ్‌వారికి పుదుచ్ఛేరి (పాండిచ్ఛేరి) తిరిగి స్వాధీనమైంది.

డచ్‌వారికి రావలసిన అప్పుల వసూళ్ళకు, స్థానికులను కిడ్నాప్ చేసి సముద్రం మధ్యలో ఓడలో బంధించి - బెదిరించి, బ్లాక్ మెయిలింగ్ చేసి డచ్‌వారు అప్పుసొమ్ము తిరిగి పొందే సాయుధ దశకు చేరారు. **బందరు హవల్దారు, ఫౌజుదారు డచ్ మరియు ఇంగ్లీష్ కంపెనీల వ్యాపారులను అక్రమ సంపాదనకు వేధించేవారు. స్థానిక హిందూ వ్యాపారులు కూడా డచ్, ఇంగ్లీషు వారివద్ద టోకు - అప్పు వ్యాపారం నిర్వహించి, అప్పు తీర్చే విషయం వచ్చేసరికి ఎగ్గొట్టటానికే ప్రాముఖ్యత ఇచ్చేవారు. పెద్దబాకీల వసూళ్ళ నిమిత్తం ఇంగ్లీష్ డచ్ కంపెనీల అధికార్లు బందరు తీరంవెంట తమ సాయుధ ఓడలను మోహరించి, ఎఱ్ఱసముద్రం - పర్షియన్ గల్ఫ్ దేశాలనుండి మసులీపట్నం రేవుకు ఖరీదైన సరుకులతో, బంగారంతో బయలుదేరే భారీ నౌకలను దారిమళ్ళించి వారివారి కంట్రోలులో ఉన్న రేవులలో సరుకులు బలవంతంగా దించుకొనేవారు.**

**1679లోకల్లా కోరమండల్ కోస్తాలో మసులీపట్నం డచ్‌వారికి గొప్ప వ్యాపార కేంద్రమయింది. కోస్తాలోని ఇతర డచ్ ఫ్యాక్టరీలయిన పాలకొల్లు, నర్సాపురం వ్యాపార కేంద్రాలను కూడా మసులీపట్నం నుండే డచ్‌వారు పర్యవేక్షించేవారు** 1689 నాటికి ఢిల్లీ కేంద్ర మొగలాయి ప్రభుత్వం గోల్కొండ రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవటం జరిగింది. **చక్రవర్తి ఔరంగజేబు ఉత్తర్వుల మేరకు సైన్యం డచ్, ఇంగ్లీషు కంపెనీలమీద యుద్ధం ప్రకటించేసరికి ఇంగ్లీష్, డచ్, ఫ్రెంచ్ కంపెనీలు కొంతకాలం బందరుపట్టణం విడిచి పోయారు.**

**బందరుకోటను అభివృద్ధి పరచినవారు డచ్‌వారు మాత్రమే. వీరు తమసైన్యం తుపాకుల మందుగుండు నిమిత్తం బందరుకోటలో స్మాల్ గన్‌ఫౌడర్ మేగజైన్ నిర్మించుకున్నారు. నేడు డచ్‌కోటగా స్థానికులు - ASI వారు పిలిచే ఆయుధాగారం కూడా డచ్‌వారి నిర్మితమే. దీన్నానుకొని ఉన్న పెద్ద తుపాకి (ఫిరంగి) మందుకొట్టం కూడా డచ్ నిర్మితమే. బందరుకోట సెయింట్‌జాన్ శ్మశానవాటికలో**




**డచ్ జాతీయుల సమాధులు కలవు. సమాధి శిలాఫలకములు డచ్‌భాషలోనే కలవు.** మసులీపట్నంలోని వలందపాలెంలో డచ్‌వారి సెమిట్రీ (శ్మశానం) మంచి స్థితిలో ASI వారిచే నిర్వహించ బడుతున్నది.

1672లో బందరు దర్శించిన డచ్ మతాచార్యుడు ఫెర్నాండెజ్ నావరెట్ **'ఈ నగరం (మసులీపటాం) గొప్ప వ్యాపార కేంద్రం. ఇక్కడ డచ్ సరుకులే కాక మొలోగ్యూస్, చైనా మరియు ఇతరదేశాల నుండి దిగుమతి అయిన సరుకులు సరసమైన ధరలకు దొరుకుతాయి. ఇక్కడ కాంభోజ, సూరత్, మొగల్ చక్రవర్తుల అధీనంలోని ప్రదేశముల నుండి, మరియు ఒరిస్సా, బెంగాల్, గోవా, పెగూ దేశాలనుండి వచ్చిన వర్తకులు ఉన్నారు. ఇక్కడ వజ్ర, వైదూర్యముల వ్యాపారం బాగా కొనసాగుతుంద'**ని వ్రాశాడు.

***(తరువాయి వచ్చే సంచికలో)***

**-మహమ్మద్ సిలార్**
కన్వీనర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946



జొన్నబండపై ఆదిమానవులు తవ్విన నీటి గుంతలు

# దాదాపూర్లో రాతియుగం ఆనవాళ్లు

## జొన్నబండపై నవీన శిలాయుగపు రాతి పనిముట్లు లభ్యం



దాదాపూర్లో ఆదిమానవులు తయారు చేసిన రాతిచేతి సుతి




జొన్నబండపై ఆదిమానవుల వలసకు సంబంధించిన చారిత్రక ఆధారాలు

వికారాబాద్ జిల్లాలో ఆదిమానవుల వలసకు సంబంధించిన చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామ సమీపంలోని జొన్నబండపై ఆది మానవుల కాలం(నవీన శిలాయుగం) నాటి పనిముట్లు లభ్యమైనట్లు కొత్త తెలంగాణ చరిత్ర సభ్యుడు, స్థానిక జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఆవుటి శాంతుకుమార్ తెలిపారు. ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన.. ఆదిమానవులు రాతి పనిముట్లకు సంబంధించిన వలస గుర్తులను గుర్తించారు. నవీ నశిలాయుగంలో ఆదిమానవులు రాతి చేతి సుత్తితో తయారు చేసిన సూరుడు గుంతలు, సహజసిద్ధంగా ఏర్పడిన రెండు నీటి గుంతలు ఉన్నట్లు తెలిపారు. అప్పట్లో చుట్టూ గుట్టలు ఉండి, వాగులో నీరుపారిన ఆనవాళ్లు, వీటి కింద రెండు కుంటలు సైతం ఉన్నాయని తెలిపారు. జొన్నబండపై ఒకప్పుడు చిన్న మందిరం ఉండేదని, ప్రస్తుతం ఇందుకు సంబంధించిన శిథిలాల ఆనవాళ్లు కనిస్తున్నాయని స్థానికుల ద్వారా గుర్తించారు. ఆదిమానవుల పనిముట్లు దైవంగా కొలిచే సంప్రదాయం మనకు ఉందని, బహుశా వాటిని ఈ ప్రాంతంలోనే కొలిచి ఉండి ఉంటారని తెలిపారు.

### చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవాలి

జొన్నబండపై ఆది మానవుల కాలం నాటి పనిముట్లను, అక్కడ ఉన్న బండరాళ్లను తొలంగించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో కుల్కచర్ల మండలంలోని ఘణపురం సమీపంలో ఈ పురాతన పనిముట్లు ఉండేవని, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. చారిత్రక ప్రదేశాలను పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది.

–ఆవుటి శాంతుకుమార్




# నల్గొండ జిల్లాలోని కాచరాజుపల్లి వద్ద రాగి నిక్షేపాలు ఉన్నట్టు పరిశోధన ద్వారా నిర్ధారించచబడినది

నల్గొండ జిల్లాలోని కాచరాజుపల్లి ప్రాంతంలో కొన్ని రంగుల గుహలున్నట్టు ఆ ప్రాంత ప్రజల ద్వారా బిగ్ టి.వి. టీమ్‌కు తెలియచేయడంతో వారు వాటి ఫొటోలతో నన్ను కలవడం జరిగింది. అది చూసిన వెంటనే ఆ గుహలు న్యాచురల్‌గా ఏర్పడినవి కావని, అది ఒక పురాతన మైనింగ్ స్థలం మాదిరిగా కనబడుతున్నదని మరియు ఆ శిలలపైన ఆకుపచ్చ రంగు కోటింగ్ మాలకైటనే రాగి ఖనిజం అని చెప్పడం జరిగింది. సామాన్యంగా రాగి నిక్షేపాలు ఉన్న ప్రాంతంలో ఇలాంటి మాలకైట్, అజురైట్ కోటింగ్స్ ఉంటాయి.




*గుహల స్థానాన్ని చూపించే (ఎరుపు వృత్తంలో) టోపోషీట్.*



రాగి ఖనిజీకరణను కలిగి ఉన్న N-S ట్రెండింగ్ క్వార్ట్జ్ రీఫ్ మరియు రెండు వేర్వేరు స్థాయిలలో పాత వర్కింగ్ ఓపెనింగ్‌లను కలిగి ఉంది.


ఆ తరువాత నేను మా ఇద్దరు కొలీగ్స్ అందరం జి.ఎస్.ఐ రిటైర్డ్ డైరెక్టర్‌లు కలిసి ఈ గుహలున్న ప్రాంతానికి వెళ్లి పరిశోధన జరిపాము. అక్కడ స్టడీ చేసిన తరువాత అది ఒక పురాతన మైనింగ్ సైట్ అని తెల్సింది. ఇక్కడ మూడు లెవెల్స్‌లో అడిట్స్ వున్నవి, ఈ అడిట్స్ పది మీటర్ల ఎత్తు తేడాతో ఒకదానిపైన ఇంకోటి ఉన్నది. ఈ అడిట్స్ / గుహలు 500 మీటరు లోతు మరియు 15 మీటర్ల వెడల్పుగా వున్నవి.




ఇక్కడి శిలలపై విస్తృతంగా మాలకైట్ కోటింగ్, అక్కడక్కడా అజురైట్ ఉన్నది. ఈ రాగి ఖనిజాల కోటింగ్ N-S ట్రెండ్‌తో ఉన్న కార్ట్జ్ రీఫ్‌లో ఉన్నది. ఈ క్వార్ట్జ్ రీఫ్ రెండు కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇది N-S ఫ్రాక్చర్‌లో ఎంప్లేస్ అయ్యింది. ఇది గ్రానైట్ నైస్ మరియు క్వార్ట్జైట్‌ను కట్ చేస్తూ వెళ్తుంది.

ఇక్కడి నుండి శాంపిల్స్ సేకరించి కెమికల్ అనాలసిస్ చేసిన తరువాత తేలినది ఏమనగా ఇక్కడ కాపర్ 2 నుండి 4 శాతం, లెడ్ (Pb) 57 నుండి 2026 PPm, జింక్ (Zn) 37 నుండి 77PPm, యురేనియం (U) 38 నుండి 200PPm, గోల్డ్ (Au) 1.40 నుండి 5.50 PPm, సిల్వర్ (Ag) 1.56 నుండి 3.90PPm ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. ఈ డేటా ఆధారంగా ఒక రీసెర్చ్ పేపర్‌ని తయారు చేసి SGT (Society of Geoscientists and Allied Technologists) అనే జర్నల్‌లో ప్రచురించబడినది. ఈ ప్రాంతాన్ని డిటైల్డ్ జియోలాజికల్ ఎక్స్‌ప్లోరేషన్ జరపవలసిన అవసరం ఉన్నది. ఎందుకంటే ఇది ఒక పాలిమెటాలిక్ డిపాజిట్ కాగలదని సూచనలు కనిపిస్తున్నవి. దీనిని క్షుణ్ణంగా పరిశోధన జరపడానికి జి.ఎస్.ఐ.కి అప్పచెప్పాలని నిర్ణయించుకున్నాము.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



కాచరాజుపల్లి సమీపంలోని క్వార్ట్జ్ రీఫ్‌లో పాత పనులు. విస్తారమైన మలాకైట్ పూతతో ఓపెనింగ్ గోడలను గమనించవచ్చు.



### యునెస్కో వారసత్వ గుర్తింపు పొందిన

# తమిళ వ్యాపారుల గ్రామ సమూహాలు చెట్టినాడ్

**దే**శం: భారత్
**సమర్పణ తేదీ:** 15/04/2014
**ప్రమాణాలు:** (ii)(v)(vi)
**వర్గం:** సాంస్కృతికం
**సమర్పించినది:** యునెస్కోలోని భారతదేశ శాశ్వత ప్రతినిధి బృందం
**రాష్ట్రం లేదా ప్రాంతం:** శివగంగై & పుదుకోట్టై జిల్లాలు, తమిళనాడు రాష్ట్రం
**రిఫరెన్స్:** 5920

తమిళనాడులోని శివగంగ మరియు పుదుకొట్టై జిల్లాల్లో విస్తరించి ఉన్న చెట్టినాడ్ ఒక అద్భుత చారిత్రక, సాంస్కృతిక ప్రాంతం. "నాట్టుకొట్టై చెట్టియార్ల" అనే శక్తివంతమైన వ్యాపార సామాజిక వర్గానికి ఇది నిలయం.



**చెట్టినాడ్ మరియు వ్యాపారుల గ్రామ సమూహాలు**

చెట్టినాడ్ అంటే కేవలం ఒక గ్రామం కాదు, ఇది 73 నుండి 75 గ్రామాల కలయిక (గతంలో 96 గ్రామాలు ఉండేవి). కారైకుడి ఈ ప్రాంతానికి ప్రధాన కేంద్రం.

**చారిత్రక నేపథ్యం:** 13వ శతాబ్దంలో కావేరి పూంపట్టినంలో వచ్చిన భారీ వరదల కారణంగా చెట్టియార్లు ఈ ప్రాంతానికి వలస వచ్చారు.

**ఆర్థిక వైభవం:** 19వ శతాబ్దం, 20వ శతాబ్దం ప్రారంభంలో, వీరు బర్మా (మయన్మార్), సిలోన్ (శ్రీలంక), వియత్నాం, మలేషియా వంటి ఆగ్నేయాసియా దేశాలతో





సముద్ర మార్గంలో బియ్యం, ఉప్పు, రత్నాల వ్యాపారం చేశారు. వీటికి తోడుగా వడ్డీ వ్యాపారం చేసి అపారమైన సంపదను ఆర్జించారు.

**వాస్తుశిల్పం:** వీరు తాము సంపాదించిన సంపదతో నిర్మించిన భవంతులు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. బర్మా టేకు, ఇటాలియన్ మార్బుల్, బెల్జియం గ్లాస్ వంటి విదేశీ వస్తువులతో కోటల్లాంటి ఇళ్లను నిర్మించారు. ప్రతి ఇంట్లోనూ లోపలి భాగం చల్లగా ఉండేలా నిర్మించిన విశాలమైన ప్రాంగణాలు (కంట్రీ యార్డ్స్) ప్రత్యేక ఆకర్షణ.



**యునెస్కో గుర్తింపు – తాత్కాలిక జాబితా**

చెట్టినాడ్ ప్రాంత విశిష్టతను గుర్తించి, దీనికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది.

**తాత్కాలిక జాబితాలో చేరిక:** 15 ఏప్రిల్ 2014న, యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో "చెట్టినాడ్, విలేజ్ క్లస్టర్స్ ఆఫ్ ది తమిళ్ మర్చంట్స్" పేరుతో ఈ ప్రాంతాన్ని చేర్చారు.

**ఎంపికైన క్లస్టర్లు:** యునెస్కో నామినేషన్ కోసం ఈ 11 గ్రామాలను మూడు సమూహాలుగా విభజించారు:

1. కానాడుకథన్, పల్లత్తూరు, కొట్టైయూర్, కొత్తమంగళం.
2. కారైకుడి ప్రాంతం, కందనూర్, అత్తంగుడి, చొక్కలింగంపుదూర్.
3. పుదుక్కొట్టై జిల్లాలోని రాయవరం, కాడియాపట్టి, అరిమళం.

**అసాధారణ సార్వత్రిక విలువ:** ఈ గ్రామాల పట్టణ ప్రణాళిక, నీటి నిర్వహణ వ్యవస్థలు, తమిళ సంప్రదాయంతో విదేశీ వాస్తుశిల్పాన్ని మేళవించిన విధానం అసాధారణ సార్వత్రిక విలువను కలిగి ఉన్నాయని యునెస్కో గుర్తించింది.

**పరిరక్షణ ప్రయత్నాలు**

2006లో 'వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్' తన వాచ్ లిస్ట్‌లో చెట్టినాడ్‌ను చేర్చింది.

తమిళనాడు ప్రభుత్వం, యునెస్కో (న్యూఢిల్లీ) సంయుక్తంగా "రివైవ్ చెట్టినాడ్ హెరిటేజ్ క్యాంపెయిన్" ద్వారా ఈ ప్రాంతాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాయి.

నేడు చెట్టినాడ్ కేవలం పర్యాటక ప్రాంతమే కాదు, అద్భుతమైన చెట్టినాడ్ వంటకాలు, రంగురంగుల అత్తంగుడి టైల్స్, ప్రాచీన వంశాల వారీ దేవాలయాలకు కూడా పెట్టింది పేరు.

చెట్టినాడ్ అనేది తమిళనాడు రాష్ట్రంలోని శివగంగై, పుదుకోట్టై జిల్లాల్లో 1,550 చ.కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉన్న 73 గ్రామాలు, 2 పట్టణాల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది.

దక్షిణ భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగంగా ఉన్న నాటుకోట్టై చెట్టియార్లు దక్షిణ భారతదేశంలో వడ్డీ వ్యాపారంతో ముడిపడిన ప్రధాన హిందూ సమాజానికి ప్రాతినిధ్యం వహించారు. వారి విస్తృత ప్రభావం, సంపద 96 గ్రామాల పటిష్ఠ నెట్‌వర్క్‌ను నిర్మించడానికి వీలు కల్పించింది, వాటిలో 73 మిగిలి ఉన్నాయని మనియాడి శాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి.

అన్ని చెట్టియార్ స్థావరాలు పట్టణ, భూ వినియోగ ప్రణాళిక అత్యుత్తమ భౌతిక లక్షణాలను కలిగి ఉన్నాయి. వాటి దక్షిణ–ఉత్తర/తూర్పు–పశ్చిమ గ్రిడ్ నమూనా, నీటి వ్యవస్థ, ప్రపంచవ్యాప్త ప్రభావాలతో సంస్కృతుల ప్రత్యేకమైన సాంస్కృతిక పరస్పర మార్పిడిని, శక్తివంతమైన తమిళ సంప్రదాయాల కలయికను వర్ణించే రాజ భవన నిర్మాణ అభివృద్ధిని కలిగి ఉన్నాయి. 1850ల నుండి 1940ల వరకు నిర్మితమైన ఈ స్థావరాలు, వాస్తు శిల్పం చెట్టియార్ సమాజానికి ప్రత్యేకమైన గొప్ప జీవన వారసత్వంతో నేరుగా సంబంధం కలిగి ఉన్నాయి.

ప్రతిపాదిత నామినేషన్‌లో 3 గ్రామాల శ్రేణి సమూహాలు ఉన్నాయి. ఇవి మొత్తం అసాధారణ విశ్వజనీన విలువకి




దోహదపడతాయి, ఇవి ఒక ప్రత్యేకమైన నిర్మాణ సమిష్టిని ఏర్పరుస్తాయి. ఈ సమితి చెట్టినాడ్ భూభాగంలో గణనీయమైన భాగాన్ని ప్రతిబింబిస్తుంది. మొదటి సమూహంలో శివగంగై జిల్లాలోని కనాడుకథన్, పల్లత్తూర్, కొట్టైయూర్, కొత్త మంగళం అనే 4 గ్రామాలు ఉన్నాయి. ఈ స్థావరాలు రాజభవనం పక్కనే ఉన్నాయి. ఇది ఈ ప్రాంతంలో జ్ఞాన-ఆధారిత సాంస్కృతిక ప్రయాణానికి ప్రారంభ స్థానం. పొరుగునే ఉన్న, ఈ ప్రాంతపు ఆర్థిక కేంద్రం కరైకుడి నుండి పట్టణ అభివృద్ధికి గురవుతున్న కొట్టైయూర్ దీని సాంప్రదాయ స్థావరంగా ఎంపిక చేయబడింది.

మొదటి శ్రేణికి దక్షిణంగా ఉన్న రెండవ శ్రేణి క్లస్టర్, కరైకుడిలోని నాలుగు చెట్టియార్ ప్రాంతాలను, శివగంగై జిల్లాలోని కందనూర్, అథంగుడి, చొక్కలింగం పుదూర్ గ్రామీణ గ్రామాలను కవర్ చేస్తుంది.



మూడవ శ్రేణి క్లస్టర్ పుదుకోట్టై జిల్లాలో మొదటి శ్రేణికి ఉత్తరాన రాయవరం, కడియాపట్టి మరియు అరిమళం వంటి ముఖ్యమైన గ్రామాలతో ఉంది.

### అత్యుత్తమ సార్వత్రిక విలువకు సమర్థన

పట్టణ మరియు గ్రామీణ ప్రణాళిక యొక్క కొన్ని అద్భుతమైన భౌతిక లక్షణాలను చెట్టినాడ్ కలిగి ఉంది. ఇవి వేలాది రాజభవనాల వంటి ఇళ్లతో ఒక ప్రత్యేకమైన నిర్మాణ సమిష్టిని సృష్టిస్తాయి. చెట్టియార్ హిందూ తమిళ సమాజం నివసించిన విధానాన్ని ఈ సమిష్టి ప్రతిబింబిస్తుంది. వారి ప్రయాణాల ఫలితంగా, వారు తమిళ సంప్ర దాయాలలో బహుళ ప్రభావాలను సమగ్రపరిచారు. ఈ మిశ్రమం చెట్టినాడ్ ప్రత్యేకతను సూచిస్తుంది.

వీరికి భూ వినియోగ ప్రణాళిక దృష్టి ఉంది. ఇది వివిధ పట్టణాలను ప్రకృతి అంశాలకు, ముఖ్యంగా వర్షపు నీటి సేకరణ, నిల్వ వ్యవస్థకు అనుసంధానించింది. ప్రాంగణాల శ్రేణిని కలిగి ఉన్న ఇళ్ల నిర్మాణ లక్షణాలు అలాగే పదార్థాల వాడకం పాక్షిక-శుష్క, వేడి వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్నారు.

చెట్టినాడ్ వాస్తుశిల్పం చెట్టియార్ సమాజం జీవితచక్ర ఆచారాలకు కూడా దగ్గరి సంబంధం కలిగి ఉంది. పుట్టుక నుండి మరణం వరకు జీవిత కాలంలో వివిధ విధులు, ఆచారాలు, కుటుంబ వేడుకలను నిర్వహించడానికి వీలుగా ఈ భవనాలు రూపొందించబడ్డాయి. జీవితచక్ర ఆచారాలతో పాటు, ఆలయ, గ్రామ పండుగలు చెట్టియార్ సంస్కృతిలో భాగం. ఇవి తమిళ సంవత్సరం అంతటా పెద్ద పెద్ద ఆచారాలను ఏర్పరుస్తాయి.

**ప్రమాణం (ii):** ఈ ప్రాంతంలో స్థిరపడినప్పటి నుండి, చెట్టియార్లు తమ భూభాగం ప్రణాళిక, అభివృద్ధి దృక్పథాన్ని సమర్థించారు, ఇందులో అత్యుత్తమ భాగాలు ఉన్నాయి. ఇక్కడ సంప్రదాయ, విదేశీ ప్రభావాలు కలగలిసి పట్టణ, నిర్మాణ, అలంకార స్థాయిలలో వ్యక్తీకరించబడిన ఒక ప్రత్యేకమైన శైలిని సృష్టిస్తాయి. పట్టణ ప్రణాళిక లక్షణాలు దీర్ఘకాల గృహాల ద్వారా సృష్టించబడిన సమిష్టితో మారకుండానే, ప్రణాళిక, వాల్యూమెట్రిక్ కాన్ఫిగరేషన్, భవ నాల టైపోలాజీలు 1850 నుండి 1940 వరకు దశాబ్దాలుగా అభివృద్ధి చెందాయి.

వ్యాపార అవసరాల కోసం, అలాగే విందులు, వివాహ వేడుకల కోసం ప్రత్యేకమైన మంటపాలు, మందిరాలు, ప్రాంగణాలను నిర్మించారు. ఇవి సంప్రదాయ ఇళ్లకు ఒక రాజప్రసాద వైభవాన్ని జోడించాయి. భవనం భారీ విస్తీర్ణం మొదలుకొని గంభీరమైన ముఖద్వారం వరకు ప్రతి అంశం కూడా యజమాని సంపదను ప్రదర్శించేలా రూపొందించబడింది. బహుళ అంతస్తుల పిట్టగోడలు, రెండు వరుసల స్తంభాల వరుసలు, లోగిళ్ల వంటి నిర్మాణ శైలులను ఉపయోగించి ఆ భవనాల ఎత్తు, వైభవం రెట్టింపు అయ్యేలా తీర్చిదిద్దారు.

ఈ భవంతుల నిర్మాణానికి, అలంకరణకు అవసరమైన సామగ్రిని, నైపుణ్యాన్ని ప్రపంచం నలుమూలల నుండి తీసుకువచ్చారు. ఇది చెట్టినాడ్ సాంస్కృతిక వైభవాన్ని మరింత పెంచింది. ఉదాహరణకు: బర్మా నుండి టేకు కలప, సిలోన్





(శ్రీలంక) నుండి శాటిన్ ఉడ్ (సుగంధ ద్రవ్యాల చెక్క), ఇటలీ, బెల్జియం నుండి మార్బుల్ (రాతి పలకలు) దిగుమతి చేసుకున్నారు. బ్రిటన్, భారతదేశ ఇతర ప్రాంతాల నుండి పోత ఇనుము, ఉక్కును, గ్రేట్ బ్రిటన్ నుండి లోహపు రేకులతో చేసిన సీలింగ్‌లను తెప్పించారు. ముంబైతో పాటుగా జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ నుండి టైల్స్‌ను, అలాగే బెల్జియం, ఫ్రాన్స్, ఇటలీ నుండి షాండ్లియర్స్ (విలాసవంతమైన దీప సముదాయాలు) సేకరించారు. వారు అత్యుత్తమ వాటినే కోరుకోవడంతో, భారతదేశం లోని వివిధ ప్రాంతాల నుండి చెక్క చెక్కడాలు, ఫ్రెస్కోలు (కుడ్య చిత్రాలు), ఎగ్-ప్లాస్టరింగ్ (గుడ్డు తెల్లసొనతో చేసే ప్రత్యేక సున్నపు పూత) వంటి విశిష్ట నైపుణ్యాలను కూడా ఇక్కడికి తీసుకువచ్చారు.



ఈ రాజభవన తరహా ఇళ్ల లేఅవుట్‌తో పాటు భారీ స్థాయి, సంఖ్య (10,000 నుండి 15,000 వరకు ఉన్నట్లుగా అంచనా) భారతదేశంలో చాలా ప్రత్యేకమైనవిగా నిలిచాయి.

చెట్టినాడ్ ప్రాంతంలో 1930లు మరియు 1940లలో అద్భుతంగా నిర్మించబడిన అద్భుతమైన "ఆర్ట్ డెకో" శైలి ఇళ్లు చాలా ఉన్నాయి. అనేక గ్రామాలు ఈ అంతర్జాతీయ నిర్మాణ శైలికి ఉదాహరణలుగా ఉన్నాయి.

**ప్రమాణం (V):** చెట్టియార్లు వేడి, పాక్షిక శుష్క ప్రాంతంలో స్థిరపడినందున, గ్రామాలకు రూపకల్పన చేయడానికి, రాజభవనాల తరహా ఇళ్లను రూపొందించడానికి, ఉపయోగించడానికి పదార్థాలను ఎంచుకోడానికి వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. వారికి భూ వినియోగ ప్రణాళిక యొక్క దృష్టి ఉంది, ఇది ఒక ప్రత్యేకమైన ప్రకృతి దృశ్యాన్ని రూపొందించింది.


గ్రామాలు ఉత్తర-దక్షిణ అక్షాలను అనుసరించి నిర్వహించబడతాయి, వాటితో పాటు రేఖాంశ తూర్పు-పడమర ఆధారిత ప్లాట్లు సృష్టించబడతాయి. ఈ ఆకృతీకరణను అనుసరించి ఇళ్ళు తూర్పు/పడమర మధ్య ప్రాంగణం చుట్టూ నిర్మించబడ్డాయి. ఇది నీడ, కాంతి, చల్లదనం, గాలిని అందిస్తుంది.

నిర్మాణానికి ఉపయోగించే పదార్థాలు వాతావరణ అవసరాలకు కూడా అనుగుణంగా ఉంటాయి: ఇటుకలతో చేసిన మందపాటి గోడలు, సున్నపు ప్లాస్టర్లు, బహుళ పొరల టెర్రకోట టైల్స్ పైకప్పు, పాలరాయి, రాళ్ల అంత స్తులు ముఖ్యమైన భాగాలు.

పైకప్పుల వాలులు ముఖ్యమైనవి. ఇవి వర్షాకాలంలో వర్షపు నీటిని సేకరించడానికి వీలు కల్పిస్తాయి. సేక రించిన నీరు గృహ వినియోగానికి, బావులను నింపడానికి ఉపయోగపడుతుంది; అధికంగా ఉన్న నీరు సాధా రణ చెరువులు, కుంటలలో కలిసే గ్రామ డ్రైనేజీ వ్యవస్థలోకి ప్రవహిస్తుంది.

చెట్టియార్లు వర్షపు నీటి సంరక్షణ కోసం ముఖ్యమైన మట్టి పనులను చేపట్టారు. వారు సంప్రదాయ తమిళ నీటి నిర్వహణ పద్ధతులను ఆ ప్రాంతమంతటా పెద్ద ఎత్తున అభివృద్ధి చేసి మెరుగుపరిచారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో కలిసి పని చేసి చక్కటి విధానాలను రూపొందించారు; ఇది నేడు పచ్చని, ఆకర్షణీయమైన ప్రాంతంగా మారి, వర్షాకాలం తర్వాత కొంత కాలం పాటు మన్నార్ గల్ఫ్ సమీపంలో వలస పక్షులకు నిలయంగా ఉంటోంది. ఈ ప్రాంతం చెట్లతో కూడిన కట్టలున్న చెరువులు, వ్యవసాయ భూములు, అడవులు, పురాతన పవిత్ర వనాల కలయికతో ఏర్పడింది.





ఈ నీటి వ్యవస్థ రెండు రకాల అంతర్-అనుసంధానిత నెట్‌వర్క్‌లను కలిగి ఉంటుంది. ఒకటి గ్రామాల లోపల డ్రైనేజీలు, చెరువులు (లేదా ఊరానిలు) కాగా మరొకటి ఎరిస్ (లేదా కన్మోయిస్)తో తయారు చేయబడిన సంప్రదాయ ఉపరితల నీటి నిల్వ జలాశయాలు, ఇవి గ్రామీణ ప్రాంతాలలో గ్రామాల చుట్టూరా విస్తరించి ఉన్నాయి.

**ప్రమాణం (vi):** ప్రమాణాలు (ii) మరియు (v) లలో వివరించిన విధంగా చెట్టినాడ్ నిర్మాణ ప్రత్యేకత చెట్టియార్ సమాజం ఆచార వ్యవహారాలతో దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది. పుట్టుక నుండి మరణం వరకు జీవితంలో వివిధ విధులు, ఆచారాలు, కుటుంబ వేడుకలను నిర్వహించడానికి వీలుగా ఈ భవనాలు రూపొందించబడ్డాయి. దేవాలయాలను నిర్మించిన స్థపతులు, సంప్రదాయ మేస్త్రీలు వీటిని కట్టారు. చెట్టియార్లకు చెందిన కనిపించే (భౌతిక), కనిపించని (సాంస్కృతిక) వారసత్వం విడదీయరానిది.



ప్రధాన ప్రాంగణాన్ని ఇంటి కేంద్ర భాగంగా పరిగణిస్తారు. వివిధ రకాల ఆచారాలు, పూజలు లాంటివి ఇక్కడే నిర్వహిస్తారు. చెట్టియార్లు 9 వంశాలకు చెందిన వారు. ఈ వంశ దేవాలయాలకు చెందిన ప్రధాన పూజారులు వీరి ఇళ్లలో సందర్భాలను బట్టి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వాటికి తగ్గట్లుగా ఇంట్లోని వివిధ భాగాలను తీర్చిదిద్దుతారు.

చెట్టియార్ ఇంట్లో వంట చేసే ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. వేడుకల సందర్భంగా చాలా మంది వంట వారిని నియమిస్తుంటారు. ఈ విధంగా చెట్టియార్లు దక్షిణ భారతదేశంతో పాటుగా తమ వ్యాపారాన్ని విస్తరింప జేసిన దేశాల నుండి వంటకాలను తీసుకొని తమవైన అధునాతన వంటకాలను రూపొందించారు.



వారి కుటుంబాల్లో పాటించే సంప్రదాయాలతో పాటు, ఆలయ ఉత్సవాలు, గ్రామ పండుగలు కూడా చెట్టియార్ సంస్కృతిలో భాగంగా ఉన్నాయి, ఇవి ఏడాది పొడుగునా పెద్ద సంఖ్యలో వివిధ వేడుకలుగా మారుతాయి.

టైల్స్, చెక్క శిల్పాలు, కాంస్య విగ్రహాలు వంటి వస్తువులు అలాగే చీరలు, బుట్ట నేత, ఆభరణాలు, వివాహాలకు బహుమతులు వంటి చక్కటి నిర్మాణ, అలంకార వస్తువులను తయారు చేసే ముఖ్యమైన స్థానిక హస్తకళల పరిశ్రమలు ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందాయి.

**ప్రామాణికత లేదా సమగ్రత**

చెట్టియార్ ఇళ్లను కొన్నింటిని కోల్పోయినప్పటికీ, సంప్రదాయ పట్టణ నిర్మాణ ముఖ్యమైన అవశేషాలు, అలాగే ప్రామాణికత, సమగ్రత రెండింటినీ పరిగణనలోకి తీసుకోవడానికి, చాటి చెప్పడానికి వీలు కల్పించే కొన్ని భవనాలు నేటికీ ఉన్నాయి. తమిళనాడులోని చెట్టినాడ్ ట్రైల్ ఈ ప్రాంతం సాధారణ మ్యాపింగ్, జాబితాను వివరిస్తుంది.

భారత్, యూరప్ విశ్వవిద్యాలయాలు చేసిన విభిన్న అధ్యయనాలు, పట్టణ ప్రణాళిక అసలు లక్షణాన్ని అలాగే నిర్మాణ లక్షణాలను ధృవీకరిస్తాయి. రివైవ్ చెట్టినాడ్ హెరిటేజ్ ప్రాజెక్ట్ చట్రంలోని అధ్యయనాలు 1850ల నుండి 1945 వరకు చెట్టియార్ స్థిరనివాసాల పరిణామాన్ని ప్రముఖంగా చాటిచెప్పాయి. శ్రీమతి సిల్వియా తలేవి అధ్యయనం, కనాడుకథన్, పల్లత్తూర్,

కొత్త మంగళం గ్రామాల సాధారణ పట్టణ లక్షణాలను చూపిస్తుంది, అంటే పట్టణ గ్రిడ్ నమూనా, కార్డినల్ పాయింట్ల ప్రకారం ధోరణి, ఉత్తర-దక్షిణ దిశలో ప్రధాన వీధులు, తూర్పు-పడమర దిశలో ద్వితీయ స్థాయి వీధులు లాంటివి.

గ్రామాల గ్రిడ్ పద్ధతిలోని వీధుల అమరిక అనేది పాశ్చాత్య, తమిళ నిర్మాణ శైలుల కలయిక. ఇళ్ల నమూనా అనేది అన్ని గ్రామాల్లో కనిపించే ఒక ఉమ్మడి లక్షణం.



1860ల నాటి ఇళ్ల నుండి ఆర్ట్ డెకో చివరి కాలం వరకు, చెట్టియార్ బంగ్లాలలో వివిధ పరిణామాలలో స్థలాలు, వాటి ఉపయోగం మనుగడలో ఉన్నాయి. నేటికీ నాటి ఆచార వ్యవహారాలు అలానే కొనసాగుతున్నాయి.


దక్షిణ భారతదేశంలోని ఎరి సిస్టమ్స్, ట్రెడిషనల్ వాటర్ హార్వెస్టింగ్ అనే గ్రంథం తమిళనాడులో సరస్సుల నెట్‌వర్క్ వ్యవస్థ ఎలా నిర్వహించబడుతుందో, వ్యవసాయ సంఘాలు నీటి వ్యవస్థను ఎలా నిర్వహిస్తాయో వివరిస్తుంది. ఇటీవలి ఇన్వెంటరీ రచనలు చెట్టియార్ గ్రామాలలో సంప్రదాయ వర్షపు నీటి సేకరణ వ్యవస్థ ప్రాముఖ్య తను చూపుతాయి. వర్షపు నీటిని సేకరించడానికి వీలు కల్పించే ఈ వ్యవస్థ దురదృష్టవశాత్తు సరిగ్గా నిర్వహించ బడలేదు.

స్థానం, సెట్టింగ్ ప్రామాణికత: రెవెన్యూ మ్యాప్‌లు బ్రిటిష్ పాలకుల నుండి వారసత్వంగా పొందిన అధికారిక గ్రాఫిక్ పత్రాలు, గ్రామాలను మ్యాపింగ్ చేయడానికి ఇప్పటికీ సూచనగా ఉపయోగించబడుతున్నాయి. ఉపగ్రహ వీక్షణ లతో సూపర్‌ఇంపోజ్ చేయడం ద్వారా పట్టణ నిర్మాణం దాని సమగ్రతలో ఉందని చెప్పబడింది.

భాష ప్రామాణికత, ఇతర రకాల అవ్యక్త వారసత్వం: నట్టుకోట్టై యార్స్ మూలం, వారి ఆచార వ్యవహారాలు 1840 నాటి తాళపత్ర గ్రంథంలో ఉన్నాయి. ఇది చెట్టియార్ సంప్రదాయాలను వివాహ ఆచారాల వివరణలతో పేర్కొంటుంది.

ప్రామాణికత ఇతర అంతర్గత, బాహ్య అంశాలు: చెట్టియార్ల తమ కార్య కలాపాలను ఇతర దేశాలకూ విస్తరించారు. ఆగ్నేయాసియాలో, ముఖ్యంగా బర్మా, వియత్నాం, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, సిలోన్ లలో తమ వ్యాపారాన్ని స్థిరపరిచారు, అక్కడ వారు దేవాలయాలను నిర్మించారు. తమ భక్తిని చాటుకునేందుకు కోసం పవిత్ర వనాలను








నిర్మించడానికి కూడా వారికి అనుమతి లభించింది. ఈ దేవాలయాలు నేటికీ ఉన్నాయి.

### సమగ్రత

ఈ ప్రాంతంలోని కొన్ని గ్రామాల ఇటీవలి సర్వేలు చాలా భవనాలు ఇప్పటికే కనుమరుగయ్యాయని చూపిస్తు న్నాయి. అయితే, 73 గ్రామాలు, 2 పట్టణాల ఈ నెట్‌వర్క్ ఇప్పటికీ పెద్ద సంఖ్యలో రాజభవనాల తరహా నిర్మాణాలను కలిగి ఉంది, 10,000 కంటే ఎక్కువ ఇళ్లు ఈ తరహాలో ఉన్నాయి. పట్టణ ప్రణాళిక సమగ్రతను కాపాడుతూ, స్థావరాలలో ఎటువంటి ప్రధాన మార్పులు చేపట్టనందున, పట్టణ గ్రిడ్ నమూనా ఇప్పటికీ ప్రామాణికంగా ఉంది. సంప్రదాయ నీటి నిర్వహణ వ్యవస్థ మిగిలి ఉంది కానీ ముఖ్యమైన భాగాలను పునరుద్ధరించి ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.



ప్రాథమిక అధ్యయనాల ప్రకారం, రాజభవనాల తరహా ఇళ్ల పరిరక్షణ స్థితి ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి మారుతూ ఉంటుంది. నేటికీ చాలా ఇళ్ళు ప్రధాన నిర్మాణ లక్షణాలతో చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఆ ఇళ్ళు ఇప్పటికీ చెట్టియార్ సమాజ జీవనశైలిని ప్రదర్శిస్తాయి. దాదాపు 19% భవనాలు కోల్పోయినప్పటికీ, సమ గ్రతను క్లెయిమ్ చేయడానికి అవి ఇప్పటికీ గణనీయ సంఖ్యలో ఉన్నాయి.

చెట్టియార్ జీవన సంప్రదాయాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి, ఇది చెట్టినాడ్ భవనాలను సంరక్షించడానికి వీలు కల్పించింది.

చెట్టియార్లలో యువతరం ఆకర్షణీయమైన ఉద్యోగ అవకాశాల కోసం తమ స్థానిక గ్రామీణ ప్రాంతాలను విడిచిపెట్టి మహానగరానికి ఎక్కువగా తరలి వెళుతున్నప్పటికీ, కొన్ని వ్యవసాయ సంఘాలు నేటికీ తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రకృతిని కాపాడుతున్నాయి.

ఇతర సజీవ వారసత్వాలలో, ఈ ప్రాంతంలోని ప్రత్యేకమైన అయ్యనార్ ఆచారాలు, పుణ్యక్షేత్రాలు, పవిత్ర ఉద్యానవనాలు ఉన్నాయి.

### ఇతర సారూప్య లక్షణాలతో పోలిక

చెట్టినాడ్ గ్రామాలను చైనాలోని కైపింగ్ దయాలౌ, పరిసర గ్రామాలతో పోల్చవచ్చు. దయాలౌ భౌతిక పరంగా మానవ విలువల ముఖ్యమైన మార్పిడిని సూచిస్తుంది - ఉత్తర అమెరికా నుండి తిరిగి వచ్చిన చైనీస్ తమతో తెచ్చిన నిర్మాణ శైలులు, స్థానిక గ్రామీణ సంప్రదాయాలతో ఒక కొత్త శైలికి నాంది పలికారు. స్వీడన్‌కు చెందిన హాల్సింగ్‌ల్యాండ్ లోని డెకొరేటెడ్ ఫామ్ హౌసెస్ కూడా ఇలాంటివే. తమ వేడుకల కోసం సంపన్న రైతులు నిర్మించిన చెక్క ఇళ్లు ఇవి. చైనాలోని దక్షిణ అన్హుయ్‌లోని పురాతన గ్రామాలైన జిడి, హాంగ్‌కున్ కూడా ఇదే తరహాకు చెందినవి. ప్రాచీన గ్రామీణ వ్యవస్థకు నేటికీ ఇవి అద్దం పడుతున్నాయి. చైనా లోనే షాంగ్సీ వ్యాపారవేత్తల ఇళ్లు కూడా ఇదే రకానికి చెందినవి.

- అనువాదం: ఎస్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com

ద

# మానవాళి భవితకు జల భద్రత

ప్రపంచంలో లభ్యమయ్యే మంచినీటిలో దాదాపు 68.7 శాతం హిమానీనదాలు, మంచు పొరల్లోనే ఉంది. నీటి వనరుల లభ్యత సుస్థిరంగా సాగేలా చేయడంలో హిమానీనదాలదే కీలక పాత్ర. అయితే, భూతాపం హిమానీనదాల కరుగుదలను వేగవంతం చేస్తోంది. నీటి సరఫరాను క్షీణింపజేస్తోంది. జల భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తోంది. హిమానీనదాల సంరక్షణ అనేది కేవలం భౌగోళిక అంశమే కాదు. ఇది ప్రజల ప్రగతికి, జీవన విధానానికి కీలకం.

### నీరు ప్రకృతి ఆస్తి

నీరు ఒక సహజ సిద్ధమైన ప్రకృతి ప్రసాదించిన ఆస్తి. భూమి మీద నివసిస్తున్న సమస్త ప్రాణుల శరీరంలో 50 శాతానికి పైగా నీరు ఉంటుంది. మానవ శరీరంలో సుమారు 70శాతం వరకు నీరు ఉంటుంది. సమస్త జీవ కోటికి తాగునీటితోపాటు మన రోజువారీ కార్యక్రమాలకు, వ్యవసాయం, పరిశ్రమలు, వంట చేయడానికి, ఇతర కార్యక్రమాలకు నీరు చాలా అవసరం. ఈ భూ



మండలాన్ని సుమారు 71శాతం నీటితో ఆక్రమితమైనప్పటికీ పనికొచ్చే మంచినీరు కేవలం 2.5% మాత్రమే. ఈ 2.5% మంచినీటిలో దాదాపు 75.2 శాతం ధ్రువ ప్రాంతాలలో మంచుగా స్తంభింపజేసి ఉంది. మరో 22.6 శాతం భూగర్భ జలాలుగా ఉన్నాయి. ప్రపంచంలో దొరుకుతున్న మంచినీటితో సుమారు 72% మనం వ్యవసాయానికి వాడుతున్నాం.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, ఆర్థిక అభివృద్ధి పేరుతో చేపడుతున్న పారిశ్రామికీకరణ, తరుగుతున్న అడవులు, కాలుష్యం, మితిమీరిన నీటి వినియోగం, వాతావరణ మార్పులు, అతివృష్టి లేదా అనావృష్టి వలన గత దశాబ్ద కాలంలో ప్రతి వ్యక్తికి సరాసరి సగటున 20% మంచినీటి వనరులు తగ్గినాయి.

ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. ఎంతో అత్యంత విలువైన నీటి వనరును తిరిగి పొందలేని స్థితికి మనం తీసుకెళ్తున్నాం. నేడు సుమారు ప్రపంచవ్యాప్తంగా 240 కోట్ల మంది ప్రజలు నీటి లభ్యత తక్కువగా ఉండి తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు. నీటివనరుల కోసం పోటీ పెరుగుతోంది.

### వేగంగా ఎందుకు కరుగుతున్నాయి?

హిమానీనదాల ఉపరితలం తెల్లగా ఉంటుంది. ఫలితంగా సూర్యకాంతిని తిరిగి పరావర్తనం చెందిస్తుంది. హిమానీనదాల కరుగుదలలతో వాటి స్థానంలో నీరు లేదా కాలుష్యంతో నిండిన మంచు ఏర్పడుతుంది. ఇవి సహజంగా తక్కువ పరావర్తనాన్ని కలిగి ఉండటంతో అధికంగా ఉష్ణాన్ని గ్రహిస్తాయి. కరుగుదల మరింత వేగవంతమవుతుంది. ఈ ప్రక్రియను 'అల్బెడో ఎఫెక్ట్'గా వ్యవహరిస్తారు.

### ప్రధాన ప్రభావిత ప్రాంతాలేవీ?

పరిశ్రమల కర్బన ఉద్గారాలు, వృక్షసంపద నష్టం, సహజ వనరుల అధిక వినియోగం వంటి మానవ కార్యకలాపాల పెరుగుదలతో హిమాలయ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధిక మవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సగటు ఉపరితల ఉష్ణోగ్రతల పెరుగుదల 1.6 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించిపోయింది. దీనివల్ల హిమానీ నదాల కరుగుదల వేగవంతమై సరస్సుల విస్ఫోటనం సంభవించి వరదలు రావడం, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులకు దారితీస్తోంది. హిందూకుష్ పర్వతశ్రేణిలో హిమానీనదాలు ఇప్పటికే 65శాతం మేర నష్టపోయాయి. హిమాలయాల మొత్తం మంచు కప్పు 40శాతం తగ్గింది. ఉష్ణోగ్రత ఇలాగే పెరిగితే, ఈ శతాబ్దం చివరి నాటికి హిమానీనదాలు 75శాతం వరకు నష్టపోవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గంగా వంటి నదులు వర్షాకాలంలో వరదలతో, వేసవిలో నీటి కొరతతో సతమతమవుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో 90శాతం హిమాలయ వ్యవసాయం వర్షాధారానికి పరిమితవుతోంది. ఇది స్థానికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దానివల్ల దిగువ ప్రాంతాల్లో నివసించే కోట్లమంది దీర్ఘకాలిక సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముంది.

**థీమ్:** "నీరు మరియు లింగం" నీరు ఎక్కడ ప్రవహిస్తే, సమానత్వం పెరుగుతుంది అనే ప్రచార నినాదంతో UN-Water సమన్వయంతో, UNICEF మరియు UN Women నేతృత్వంలో, ఈ థీమ్ సురక్షితమైన నీరు మరియు పారిశుధ్యం ప్రాథమిక మానవ హక్కులు, లింగ సమానత్వానికి కీలకంగా దోహద పడతాయని ప్రముఖంగా తెలియజేస్తుంది.

*మార్చి 22న ప్రపంచ నీటిదినోత్సవం.*

– సుభాష్

# దాశరథి సైన్స్, సామాజిక గీతంలో వైవిధ్యం

ఇది మహాకవి దాశరథి కృష్ణమాచార్య జీవితం లాగే లిటరరీ స్పెక్ట్రమ్ చాలా విస్తృతమైంది, లోతైంది. 1925 జూలై 22న జన్మించిన దాశరథి నైజాం వ్యతిరేక పోరాటం చేశారు. ఆకాశవాణిలో కొనసాగారు. అంతకుమించి సినిమాల్లో కూడా రాణించారు. ఆకాశవాణి ఉద్యోగానికి రాజీనామా చేసిన దాశరథి కృష్ణమాచార్య కొంతకాలం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి పదవి కూడా అలంకరించారు. దాశరథి రంగాచార్య ఇప్పుడు చర్చించుకుంటున్న కృష్ణమాచార్యకు తమ్ముడు.



తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ప్రావీణ్యం గడించినట్టే, ప్రసంగం, సాహిత్యం మాత్రమే కాక రేడియో, సినిమా మాధ్యమాలలో అపూర్వమైన నైపుణ్యం సాధించారు. అంతే కాదు కవిత్వం మాత్రమే కాక గీతరచనలో కూడా కొత్త ఎత్తులకు పోయారు. ఆకాశవాణి లలిత గీతం, సినిమా గీతం సంబంధించి ఆయన చేసిన కృషి సైతం విలక్షణంగా కనబడుతుంది. అలాగే కవిత్వంలో, పాటలలో భావ చిత్రాలే కాక; సామాజిక, చారిత్రక, సైన్స్ పరమైన విషయాలు ఎన్నో కనబడతాయి. త్రిపురనేని గోపీచంద్ రేడియో కార్యక్రమాల సరళి గురించి విశ్లేషిస్తూ దాశరథి కృష్ణమాచార్య రాసిన వ్యాసాన్ని పరిశీలిస్తే రేడియో మాధ్యమం మర్మ, ధర్మసూక్ష్మాలను ఎంత గొప్పగా పట్టుకున్నారో అర్థం చేసుకోవచ్చు. శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి వంటి వారే విజ్ఞాన సంబంధమైన విషయాలను ఆ తరం తెలుగు కవిత్వంలో అడపా దడపా చవి చూపించారు. ఈ సందర్భంలో తెలుగువారి హృదయాల్లో చొచ్చుకుని పోయి, ఇప్పటికి హాయిగా నెలకొని తరచూ వినదిస్తున్న ఒక అభ్యుదయ గీతం గురించి ఇప్పుడు చర్చించుకుందాం. ఆంధ్రప్రదేశ్‌లో 'దేశమును ప్రేమించమన్నా' గుర్తింపు పొందినట్టే తెలంగాణ ప్రాంతంలో ఇటీవల కాలంలో దాశరథి రాసిన ఈ గీతం అటువంటి గౌరవాన్ని పొందుతోంది.

కొన్ని సంవత్సరాలుగా ఒక విషయం నన్ను వెంటాడుతోంది. "ఆ చల్లని సముద్ర గర్భం..." పాటలో సైన్స్, చరిత్ర, సామాజిక కోణాల్లో కవి దాశరథి భావనలు ప్రత్యేకంగా దర్శనమిస్తాయి. ఒక పాతిక, ముప్పైయేళ్ళుగా ఈ గీతం తెలుగునేల అన్ని చోట్ల వినబడుతూ వస్తోంది. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది మరింత విరివిగా వినబడుతోంది. అయితే, ఈ పాటలో కొన్ని పదాలు, పాదాలు ఒక్కోచోట, ఒక్కో సందర్భంలో వేరుగా వేరుగా వినబడుతున్నాయి. దీంతో మరింత ఆసక్తి కలిగి కొంత పరిశీలన చేశాను. ఇప్పుడు నా వద్ద మూల గీతంతో పాటు నాలుగు వెర్షన్లు ఉన్నాయి. ఇంకా కొన్ని అదనపు వెర్షన్లు కూడా ఉండి ఉన్నా ఆశ్చర్యం లేదు.

ఇరవయ్యేళ్ళలోపునే దాశరథి మంచి కవిత్వం రాయడం, పోలీసుల దృష్టిలో పడటం గమనార్హం. దాశరథి కృష్ణమాచార్య తొలి కవితా గ్రంథం 1949లో వెలువడిన 'అగ్నిధార'. ఈ సంకలనంలోని కవితలు చాలావరకు తొలుత ప్రచారంలోకి వచ్చి జనుల నోట నానిన తర్వాత ప్రచురింపబడ్డాయి. 'నా కోటి రతనాల వీణ...' గీతం ఈ సంకలనం లోనిదే! అంతే కాదు 'ఈ చల్లని సముద్ర గర్భం...' గీతం కూడా 'అగ్నిధార' లోనిదే. 1988 తర్వాత అక్షరాస్యత, మూఢనమ్మకాల నిర్మూలన, సైన్స్ దృష్టి వంటి విషయాలు కొన్ని సంస్థల ఎజెండాగా మారడంతో ఉదాత్తమైన పాటలు ప్రాచుర్యం పొంది, మళ్ళీ వినిపించడం మొదలైంది. దానికి కొత్తగా వచ్చిన టెక్నాలజి దీనికి ఎంతో దోహదపడింది. ఈ కారణాలతో 1991 నుంచి (నేను అంతకుముందు గోవాలో మూడేళ్లు ఉన్నాను కనుక) చాలా చోట్ల, చాలా సందర్భాల్లో ఈ పాట విన్నాను.

'అగ్నిధార'లో లభ్యమయ్యే గీతం పల్లవితో పాటు ఆరు చరణాలుగా సాగుతుంది. పల్లవీ, చరణం ప్రతిదీ నాలుగు పాదాలుగా, ప్రతి పాదం 14 మాత్రలుగా సాగుతుంది. పాటకు అవసరమైన దార్శనికత, భావం, లయ, భావుకత పుష్కలంగా ఉన్నాయి. ప్రకృతిని అవలోకింప చేసే పల్లవితో పాటు ఒక చరణం సైన్స్, మరో చరణం చరిత్ర... మిగతా నాలుగూ సామాజిక దర్శనంతో తొణికిస లాడుతాయి.

*ఆ చల్లని సముద్రగర్భం*
*దాచిన బడబానలమెంతో?*
*ఆ నల్లని ఆకాశంలో*
*కానరాని భానువులెందరో?*
*భూగోళం పుట్టుక కోసం*
*కూలిన సురగోళాలెన్నో?*
*ఈ మానవరూపం కోసం*
*జరిగిన పరిణామాలెన్నో*

*ఒక రాజును గెలిపించుటలో*
*ఒరిగిన నరకంఠాలెన్నో?*
*శ్రమజీవుల పచ్చి నెత్తురులు*
*త్రాగని ధనవంతులెందరో?*
*అన్నార్తులు అనాథలుండని*
*ఆ నవయుగ మదెంత దూరమో?*
*కరువంటూ కాటక మంటూ*
*కనుపించని కాలాలెప్పుడో?*
*అణగారిన అగ్ని పర్వతం*
*కని పెంచిన 'లావా'యెంతో?*
*ఆకలితో చచ్చే పేదల*
*శోకంలో కోపం యెంతో?*
*పసిపాపల నిదుర కనులలో*
*ముసిరిన భవితవ్యం యెంతో?*
*గాయపడిన కవిగుండెల్లో*
*వ్రాయబడని కావ్యాలెన్నో?*
*కుల మతముల సుడిగుండాలకు*
*బలిగాని పవిత్రులెందరో?*
*భరతావని బలపరాక్రమం*
*చెర వీడే దింకెన్నాళ్ళకో?*

(అగ్నిధార, 1949)

రేడియోలో, వేదికల మీద, యూట్యూబ్‌లో మాత్రమే కాక తెలంగాణ, ఆంధ్ర పల్లె ప్రాంతాలలో నేడు విరివిగా వినబడే పాట ఇది. ఆకాశవాణిలో జాతీయస్థాయిలో 'సాంగ్ ఆఫ్ ది మంత్' (ఈ మాసపు పాట) అనే ప్రయోగం చాలా కాలం నడిచింది. ఆయా భాషలలో మంచి ఉదాత్తమైన పాటలనుంచి ఎంపిక చేసి పూర్తి సంగీతపు హంగులతో దీనిని రికార్డు చేసి నెలలో నాలుగు సార్లు వినిపించడం ఆకాశవాణి ప్రణాళిక. దీనితో మంచి ప్రాచుర్యం కూడా సిద్ధిస్తుంది. దేశవ్యాప్తంగా తెలుగు పిల్లల పాట అనగానే ఇతర భాషావాసులకు కూడా "పిల్లల్లారా.." అనే గీతం గుర్తుకొస్తుంది. ఈ పాట కూడా మన దాశరథి రాసిందే. అలా ప్రస్తుత గీతం 1992లో డా. మహాభాష్యం చిత్తరంజన్ సంగీత రూపకల్పనలో ఆకాశవాణి హైదరాబాదు స్టూడియోలో 'ఈ మాసపు పాట' గా రికార్డయ్యింది. దాన్ని ప్రసిద్ధ గాయకులు కె.బి.కె.మోహన్ రాజు (కొండా బాబు కృష్ణమోహన రాజు), విజయలక్ష్మి శర్మ పాడారు. కొన్నేళ్ళ క్రితం కె.బి.కె. మోహనరాజు ఫేస్ బుక్‌లో షేర్ చేసినపుడు నేను జాగ్రత్తగా విన్నాను. ఇందులో ప్రత్యేకత ఏమంటే పాటలోని మొత్తం ఆరు చరణాలు కాకుండా 1, 3, 5 చరణాలు మాత్రమే ఉన్నాయి.



అయితే ఎక్కువమంది గాయనీ గాయకులు అంటే వందేమాతరం శ్రీనివాస్, విమలక్క, వరంగల్ శంకర్, ప్రజానాట్య మండలి, జన విజ్ఞాన వేదిక ఇంకా పలు సంస్థలు ద్వారా పాడిన, లేదా పాడే గీతంలో మూలంలో మూడింట రెండు వంతులు మనకు వినబడుతోంది. ఖమ్మం నివాసి బూరగడ్డ కందాడై విజయ కుమారాచార్య ఈ గీతానికి ట్యూన్ కట్టారు. అదే ప్రాచుర్యంలోకి వచ్చింది. కానీ రెండు చరణాలు కలిపి ఒక చరణంగా పాడటం ఇక్కడ గమనించవచ్చు. మొత్తం ఒకటో చరణం; 2, 6 చరణాలలో కొంత భాగం కలసి ఒక చరణంగానూ; మూడు, ఐదు చరణాలు ఒక చరణంగా ఇక్కడ మనకు వినబడతాయి. ఈ మొత్తం పాటలో నాల్గవ చరణం అసలు కనబడదు. ఎం శశిధర శర్మ పాడిన వెర్షన్లో దాశరథి మొత్తం పాట మనకు లభిస్తుంది. ఈ వెర్షన్స్ అన్నింటిలో ప్రధానమైన తేడా పల్లవిలో 'కానరాని భానువులెందరో' ' కానరాని భాస్కరు లెందరో' అనే తేడాను గమనించవచ్చు.

ఇవన్నీ కాకుండా జనవిజ్ఞాన వేదిక తెలంగాణ కొన్ని సంవత్సరాల క్రితం ఈ గీతాన్ని ఒక క్యాలండర్‌గా చాలా ఆకర్షణీయంగా ముద్రించింది. ఇందులో మూలంలో లేని (రెండు చరణాలు నిడివిలో) ఒక చరణంగా మనం గమనించవచ్చు. ఆ పాదాలు ఇలా ఉన్నాయి:

*మానవ కళ్యాణం కోసం*
*పణమొడ్డిన రక్తం యెంతో*
*రణరక్కసి కరాళనృత్యం*
*రాల్చిన పసిప్రాణాలెన్నో*
*కడుపుకోతతో అల్లాడిన*
*కన్నులలో విషాదమెంతో*
*ధనవంతుల దుర్మార్గాలకు*
*దగ్ధమైన బ్రతుకులుయెన్నో...*

ఇలా మార్పులు ఎందుకు వస్తాయి? ఆ మార్పులకు కవి ఆమోదం ఉందా? అది ఒక పాట బహుళ ప్రచారమైనపుడు సంభవించే విషయంగా పరిగణించాల్సి ఉంటుందా? అనే విషయాలు ఇప్పుడు తేల్చలేము. కేవలం వినడం ఆధారంగానే గుర్తు పెట్టుకుంటాం, ప్రతిసారి మూలాన్ని సంప్రదించే సౌకర్యం ఉండకపోవచ్చు. అందువల్ల మరింత శ్రావ్యంగా ఉండే పదాలు రావచ్చు లేదా మరింత ఆమోదకరమైన భావంతో కొన్ని పదాలు మార్చబడవచ్చు 'వ్రాయబడని కావ్యాలెన్నో' అనే దానికన్నా 'రాయబడని కావ్యాలెన్నో' అనడం హాయిగా ఉంటుంది. ఇపుడు యూట్యూబ్ లలో చాలామంది పాడిన ఈ పాట చాలా రకాలుగా లభించడం దాశరథి గీతానికున్న ప్రాచుర్యానికి కొలమానం, సాహిత్యానికి బహుమానం!

అదే సమయంలో సీరియస్ విషయాలు, నాన్ ఫిక్షన్ సంబంధించిన అంశాలు అంటూ కాస్త నిరాదరణకు లోనయ్యే సైన్సు, చరిత్ర, సామాజికం వంటి వాటి లోపలి పార్శ్వాల మర్మాలను రమణీయమైన గీతంగా సృజించిన దాశరథి కృష్ణమాచార్య ప్రతిభకు, నైపుణ్యానికి, దర్శనీయతకు జోహార్లు!

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com

# న్యాయ పాలన తెలుగులో ఎప్పుడు

'కమిటీ' అనే పదానికి తెలుగుపదం కోసం ప్రయత్నించి సరైన పదం దొరక్క మానేసుకున్నాను' అన్నారు ఓ మూడు సంవత్సరాల క్రితం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి టి. వినోద్. 'కమిటీ' అనే వాడండి సర్ అన్నాను నేను. అదే పని చేశానని ఆయన అన్నారు.

కొన్ని పదాలను తర్జుమా చేయకూడదు. అలాగే వాడితే బాగుంటుంది. అనువాదం అన్న పదం తర్జుమాకి బాగానే ఉంటుంది. అలాంటి సులువుగా అనువాదానికి లొంగే పదాలను వాడటం ఆమోదయోగ్యం. కానీ కొన్ని పదాలు తెలుగుదనాన్ని సంతరించుకుంటాయి. అలాంటి పదాలను అనువాదం చేయకూడదు. ఈ సంభాషణ అంతా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరిగింది.

1992లో జరిగిన సంఘటన ఒకటి కూడా ఈ సందర్భంగా గుర్తుకొచ్చింది. అప్పుడూ ఇలాంటి సందర్భమే వచ్చింది. ఆ కాలంలో నేను 'ఆంధ్రప్రభ' ఆదివారం అనుబంధం సంచికలో లీగల్ వ్యాసాలు రాస్తూ ఉండేవాడిని. ప్రజలకు బాగా అవసరం అనుకున్న అంశాలను మొదటగా రాశాను. అందులో ముఖ్యమైనవి మోటార్ వాహన ప్రమాదాలు- నష్ట పరిహారాలు, వినియోగదారుల రక్షణ చట్టం. అప్పుడు వినియోగదారుల రక్షణ చట్టం బాగా ప్రాచుర్యంలో ఉంది. ఆ చట్టం గురించి రాసిన వ్యాసాలను, తీర్పులను కలిపి పుస్తకంగా వేద్దామని అనుకున్నాను. ఓ కమర్షియల్‌లా పబ్లిషర్ అది ప్రచురించడానికి ముందుకు వచ్చాడు.




× × ×

### జ్యుడీషియల్ అకాడమీ తొలి ప్రచురణ

ఆ బుక్ ప్రూఫ్‌రీడింగ్ దశలో ఉండగా ఆ పుస్తక విషయం అప్పటి ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ ఎంఈఎస్ పాత్రుడి దృష్టికి వెళ్లింది. ఆ పుస్తకాన్ని అకాడమీ మొదటి ప్రచురణగా ప్రచురిద్దామని ఆయన చెప్పారు. నేను సంతోషపడ్డాను. నేనప్పుడు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గా పని చేస్తున్నాను. ఆ దశలో అది ఓ గొప్ప గౌరవం. ఓ రెండు రోజుల తర్వాత అకాడమీకి నన్ను రమ్మని చెప్పారు. అకాడమీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు హైకోర్టు న్యాయమూర్తి ఎంఎన్ రావుని పరిచయం చేస్తామని చెప్పారు. నేను వెళ్లాను. బయట కూర్చున్నాను. డైరెక్టర్ చాంబర్ లో డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్ భవానీ ప్రసాద్, హైకోర్టు న్యాయమూర్తి ఎంఎన్ రావు మాట్లాడుకుంటున్నారు. 'అకాడమీ' అన్న పదాన్ని తెలుగులో రాస్తే బాగుంటుందని వాళ్లు చర్చించుకుంటున్నారు. దానికి అనువాదం 'పరిషత్' అని వాళ్లు ఓ నిర్ణయానికి వచ్చినట్టు నాకు అనిపించింది. వాళ్ల మాటలు స్పష్టంగా వినిపించాయి. ఆ అనువాదం ఎందుకో నాకు ఏ మాత్రం నచ్చలేదు. సందర్భం వస్తే ఆ విషయం చెప్పాలనుకున్నాను. కాసేపటికి నన్ను లోపలికి పిలిచారు.

అకాడమీ అనే పదం తొలగించి పరిషత్ అన్న పదం పుస్తకంలో వేయండి అని చెప్పారు. ఆ సందర్భాన్ని నేను ఉపయోగించుకున్నాను. అకాడమీని అకాడమీ అంటేనే బాగుంటుంది.. పరిషత్ అంటే బాగుండదు సార్ అని అన్నాను. అక్కడితో ఊరుకోకుండా. నా అభిప్రాయానికి బలం చేకూరేలా 'కేంద్ర సాహిత్య అకాడమీ', 'రాష్ట్ర సాహిత్య అకాడమీ', 'తెలుగు అకాడమీ' లాంటి కొన్ని ఉదాహరణలు చెప్పాను. నా మాటలతో ముగ్గురూ ఆలోచనలో పడ్డారు. చివరికి నా మాటలతో ఏకీభవించారు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ మొదటి ప్రచురణగా 'వినియోగదారుల రక్షణ చట్టం' పుస్తకం వచ్చింది. తెలుగులో కూడా అకాడమీ అన్న పదం స్థిరపడింది. ఆ పుస్తకాన్ని అప్పటి ప్రధాన న్యాయమూర్తి1992 జులై 28న ఆవిష్కరించారు. అకాడమీ మొదటి పుస్తకం తెలుగు పుస్తకం. అది చాలా ప్రాచుర్యం పొందింది. అయితే అదే పుస్తకం అకాడమీ చివరి పుస్తకం కావడం ఓ విషాదం. ఆ తర్వాత మరికొన్ని పుస్తకాలు అకాడమీ ప్రచురణలుగా వచ్చాయి. అందులో నా పుస్తకం కూడా మరొకటి ఉంది. అయితే అవి అన్నీ ఇంగ్లీష్ లోనే ఉన్నాయి. ఆ పుస్తక ప్రచురణ తెలుగులో జరిగి 33 ఏండ్లు దాటింది. కానీ మరో తెలుగు పుస్తకం ఏదీ అకాడమి నుంచి రాలేదు.

× × ×

### ప్రాంతీయ భాషల్లో తీర్పులు..

పై విషయాలన్నీ ఎందుకు రాయాల్సి వచ్చిందంటే ఇప్పుడు అన్ని ప్రాంతీయ భాషల్లో తీర్పులను అందుబాటులోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టును భారత ప్రభుత్వం కూడా సమర్థిస్తున్నది. దేశంలోని వివిధ హైకోర్టులు కూడా ఇంగ్లీషులో ఉన్న ప్రధాన తీర్పులను ఆయా ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నాయని వింటున్నాం.

ఈ స్థితిలో తెలుగులో న్యాయపాలన జరగాలని చాలా మంది కాంక్షిస్తున్నారు. మన చుట్టు పక్కల ఉన్న అన్ని రాష్ట్రాల్లో న్యాయపాలన వాళ్ల భాషల్లోనే జరుగుతున్నది. మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం న్యాయపాలన తెలుగులో జరగడం లేదు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో కోర్టుల విషయంలో తెలుగు భాష అంతగా అభివృద్ధి చెందలేదు. తెలుగు భాష కోర్టుల్లో అమలు జరగలేదు.

తెలుగులో తీర్పులను అనువాదం చేస్తున్న సందర్భంలో ఈ దిశగా అందరూ కారణాలను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగులో న్యాయపాలన జరగాలంటే తెలుగులో కూడా న్యాయశాస్త్ర గ్రంథాలు అందుబాటులో ఉండాలి. ఆ పనికి నా లాంటి ఒకరిద్దరు మిత్రులు కాకుండా జ్యుడీషియల్ అకాడమీ, తెలుగు అకాడమీ, మరీ ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలి. అది కూడా మనస్ఫూర్తిగా చిత్తశుద్ధి తో చేయాలి. తెలుగులో న్యాయశాస్త్ర పుస్తకాలు ఉంటే తెలుగులో తీర్పులు రావడానికి మార్గం కొంత సుగమం అవుతుంది. ఈ దిశగా హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని భాషాభిమానులే కాదు కక్షిదారులూ కోరుకుంటున్నారు.

× × ×

### ప్రభుత్వం ఒత్తిడి తేవాల్సిందే..

న్యాయశాస్త్ర పుస్తకాలు, అనువాదం చేసిన తీర్పులు ప్రజల భాషలో ఉండాలి. అలా లేనప్పుడు ప్రజలకు కోర్టులకు మధ్య అగాథం ఇంకా పెరుగుతుంది తప్ప తగ్గదు. తెలుగులో న్యాయపాలన జరిగితే కక్షిదారులకు తమ కేసు ఎందుకు పోయిందో, అవతలి వ్యక్తుల కేసు ఎందుకు గెలిచిందో అర్థం అవుతుంది. అలా అర్థమైనప్పుడు ప్రజలకు కోర్టుల మీద విశ్వసనీయత పెరుగుతుంది.



ప్రజలకు కోర్టులకు మధ్య ఉన్న అవరోధం భాష. ఈ అవరోధం తొలగించడానికి అందరూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాల్సి ఉన్నది. అనువాదం చేసే క్రమంలో చూడాల్సిన మరో అంశం తెలుగులోకి చొచ్చుకొచ్చి తెలుగుదనం సంతరించుకున్న పదాలను అదేవిధంగా ఉంచడం, ప్రజలకు కోర్టుల న్యాయం చేరువ కావాలంటే కావాల్సింది తెలుగులో న్యాయపాలన. ఈ దిశగా ప్రయత్నాలు చిత్తశుద్ధితో జరగాలి. సంస్థలు నామమాత్రంగా ఉండటం కాదు.. అవి ఉనికిలో ఉన్నాయని నిరూపించుకోవాలి. ఈ మాటలను విజ్ఞులు వింటున్నారా మరీ ముఖ్యంగా అధికార భాషా సంఘం మన రాష్ట్రం లో అది ఇంకా ఏర్పాటు చేయలేదు ఎందుకో.

× × ×

### భాష గురించి ఓ కథ

### భాష

అప్పుడు నేను హైదరాబాద్‌లో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా పని చేస్తున్నాను. జగన్నాథరెడ్డి మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా పని చేస్తున్నారు.

భోపాల్‌లో వున్న జాతీయ జ్యుడీషియల్ అకాడెమీలో ఓ కాన్ఫరెన్స్‌కి హైకోర్టు మా ఇద్దరినీ ఎంపిక చేసి పంపించింది.

దేశంలోని న్యాయమూర్తులందరూ కలిసి పాల్గొనే అకాడెమీ అది.

ఆ అకాడెమీ మొదలైన కొత్తలోనే మాకు అక్కడికి వెళ్లే అవకాశం కలిగింది. అది మూడు రోజుల కాన్ఫరెన్స్. నాలుగు గంటల వరకు షెడ్యూలు. ఆ తరువాత ఫ్రీ టైం. కొంతమంది లైబ్రరీలో కూర్చొనేవారు. మరి కొంతమంది భోపాల్ నగరం చూడ్డానికి వెళ్లేవారు.

అకాడెమీ నగరానికి దూరంగా చాలా ఎతట తైన ప్రదేశంలో వుంటుంది. చాలా గొప్పగా కట్టారు. కట్టడమే కాదు. అక్కడ కాన్ఫరెన్స్‌లు కూడా బాగా జరుగుతాయి. మొదటి రోజు సాయంత్రం నగరంలోని ముఖ్యమైన ప్రదేశాలు చూసి చౌరస్తా దగ్గరికి వచ్చాం నేనూ, జగన్నాథరెడ్డి. అక్కడ నుంచి అకాడెమీ వెళ్లడానికి కార్లు వుంటాయి. ఫోన్ చేస్తే అకాడెమీ నుంచి కారు వస్తుంది.

ఆ చౌరస్తాలో 'మృగనయిని' అన్న పేరుతో ఓ చేతివృత్తుల దుకాణం ఉంది. అందులో ఎక్కువగా చీరెలు వుంటాయి. ఇతర రాష్ట్రాల న్యాయమూర్తులకి గౌరవంగా కొంత ఎక్కువ డిస్కౌంట్ కూడా ఇస్తారు.

నేనూ, జగన్నాథరెడ్డి కలిసి షాపులోకి వెళ్లాం. మాకు తోచిన చీరలు ఓ పది నిమిషాల్లో కొనుగోలు చేసి, ఏవో విషయాలు తెలుగులో మాట్లాడుకుంటూ బిల్లింగ్ కౌంటర్ దగ్గర నిల్చున్నాం.

అప్పుడు ఓ జంట మా దగ్గరికి వచ్చారు. ఇద్దరూ అందంగా వున్నారు. ఆమె చాలా ఆకర్షణీయంగా ఉంది. వాళ్ల ఇద్దరు పిల్లలు కూడా చాలా అందంగా చలాకీగా వున్నారు.

మా దగ్గరికి వచ్చి పరిచయం చేసుకున్నారు. మేమూ అక్కడికి వచ్చిన విషయం చెప్పాం. వాళ్లిద్దరూ తెలుగు వాళ్లు. మరో ఇద్దరు తెలుగు వాళ్లని చూడగానే వాళ్లకి ప్రాణం లేచి వచ్చినట్టుంది. అలా వాళు వచ్చిన పనిని పక్కనబెట్టి మాతోనే మాట్లాడుతూ నిల్చున్నారు. అతను 'నాబార్డ్'లో పని చేస్తున్నాడు.

ఇంకా ఎన్ని రోజులు ఉంటారని మమ్మల్ని అడిగారు. ఓ రెండు రోజులు ఉంటాం. మూడో రోజు వెళ్లిపోతామని చెప్పాం.

అతను తన విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాడు. ఆ తెల్లవారి సాయంత్రం భోజనానికి వాళ్లింటికి రమ్మని ఆమె కోరింది. ఆ తరువాత అతను చెప్పాడు.

మాకు ఏమి అనాలో తోచలేదు. సరేనన్నట్టుగా తలవూపాం. వీలైతే వస్తామని, ఫోన్ చేస్తామని చెప్పాం.

కానీ వీలు కుదరలేదు. మళ్లీ చెప్పడానికి వాళ్ల దగ్గర మా ఫోన్ నెంబరు లేదు. ఆ తరువాత జాతీయ జ్యుడీషియల్ అకాడెమీకి చాలాసార్లు వెళ్లాను. మృగనయిని వెళ్లినప్పుడల్లా వాళ్లే గుర్తుకొచ్చే వాళ్లు.

ఇప్పుడూ అంతే! మాసబ్ ట్యాంక్ దగ్గర నుంచి వెళ్తున్నప్పుడల్లా వాళ్లే గుర్తుకొస్తారు.

అక్కడ 'నాబార్డ్' బోర్డు పెద్దది ఉంది.

ప్రాంతం కాని ప్రాంతంలో

భాష మనుషుల్ని ఎంత దగ్గర చేస్తుంది.

అక్కడ యాసతో పనిలేదు. అది ఆటంకమూ కాలేదు. కాదు కూడా.

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com

ద

# జోడునామాల దుబ్బాక చరిత్ర

ఒక వూరికి ఒక పేరుంటుంది. కాని, రెండుపేర్లున్న రెండు గ్రామభాగాలున్న ఒక ఊరే దుబ్బాక. దుబ్బాక గ్రామ చరిత్ర చారిత్రాత్మకమైంది.

దుబ్బాక సిద్దిపేట జిల్లా కేంద్రానికి 25 కి.మీ.ల దూరంలో ఉంటుంది. దుబ్బాక పూర్వపు తాలూకా కేంద్రం, ప్రస్తుతం మండల కేంద్రం. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం కూడా. ఈ గ్రామం 2013లో సమీపంలోని లచ్చపేట, ధర్మాజీ పేట, చేర్వాపూర్, చెల్లాపూర్, దుంపల పల్లి అనే 5 గ్రామాలను కలుపుతూ నగరపంచాయతీగా రూపాంతరం చెందినది. (తృతీయ శ్రేణి మున్సిపాలిటీ).

కుమ్మరికుంట, మాలకుంట, ఏదుల్లచెరువు, రామసముద్రం, ధర్మాజీపేట చెరువు మీదుగా కూడవెల్లి వాగులోకి అంటే గ్రామానికి ఈశాన్యం వైపు నుండి ఆగ్నేయందాటి నైరుతిమూల చుట్టుకొని, వాయువ్యం మూలనున్న పెద్దచెరువు నుంచి ధర్మాజీపేటచెరువు మీదినుంచి కూడవెల్లి, గ్రామం నలువైపులా ఉన్న గొలుసుకట్టు చెరువుల మధ్య ఉంది దుబ్బాక గ్రామం.

**దుబ్బాక ఒక సంస్థానం:** దుబ్బాక ఒక స్వతంత్ర సంస్థానం. దీనికింద 41 రెవెన్యూ గ్రామాలు ఏలుబడిలో ఉండేవి.

పన్యాల సోమేశ్వర రావు, పన్యాల శ్రీనివాస్ రావు–వీరు రెడ్డిలే కానీ రావులుగా పిలువబడ్డారు. సామాన్య ప్రజానీకం వారినిపేర్లతో కాక పెద్దదొర, చిన్నదొర అనే పిలుచుకునే వారు. చిన్నదొర శ్రీనివాస్ రెడ్డిగారు తెలంగాణా స్వతంత్ర భారత దేశంలో విలీనం అయిన తొలినాళ్ళలో దుబ్బాక గ్రామసర్పంచ్‌గా కూడా చేశారు. వీరు రాజా ఉమ్మారెడ్డి వారసులు. దోమకొండ సంస్థానం వారు, వారి ఆడపడుచును దుబ్బాక సంస్థానానికి ఇచ్చి వియ్యమందారు.



యోగభైరవుడు - కాళిక

దుబ్బాక గ్రామం రాజకీయంగా కూడా చైతన్యవంతమైనది. ఈ గ్రామస్తుడైన ఐరెని లింగయ్యగారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గా పని చేస్తే, ఇదే గ్రామంలో చదివిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తెలంగాణకే తొలి ముఖ్యమంత్రిగా ఎదిగారు.

గ్రామం నడిబొడ్డునగల తోరణస్తంభాలకు ఉత్తరంవైపు పాతగడి ఆనుకొని దాదాపు 25, 30అడుగుల ఎత్తుతో బురుజు ఉండేది. అందులోనే ఒకవైపు ప్రైమరీ స్కూల్ నడిచేది. ఇంకొక పక్క గ్రామపంచాయతీ ఆఫీసు, గ్రామ రెవెన్యూ రికార్డులు నిర్వహించే కచేరీ ఉండేది. ప్రస్తుతం ఆ చోట కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు.

**జోడునామాల ఊరు:** గ్రామం నడిబొడ్డునగల బొడ్రాయిని ఉన్న స్థలంలోనే ఇటీవల కొత్తగా పునఃప్రతిష్ట చేసారు. దీనికి తూర్పువైపు గ్రామాన్ని దుర్వాస అని, పడమటివైపు భాగాన్ని దుబ్బాక అని పిలుస్తుంటారు. ఇది శైవగురువులకు మూలపురుషుడు దూర్వాసుని పేరు మీద వెలసిన గ్రామం. శైవ తాంత్రికుల కేంద్రం అయింది దుబ్బాక. ఈ బొడ్రాయికి ఎదురుగా ఉన్న ఈ జంటస్తంభాలను దోర్నస్తంభాలు అంటారు (తోరణ స్తంభాలు) వీటి మీద అన్ని వైష్ణవానికి చెందిన ఆనవాళ్లు వున్నాయి. పంచలోహ యంత్రం ఉన్న ఒక స్తంభంమీద శాసనం ఉంది.

**దుబ్బాక తోరణస్తంభ శాసనపాఠం**

(శో)భకృతు...
సంవత్సర శ్రావ
ణశుద్ధ2 శనివారం
నాడు మ..... అగ
సాల లింగోజు మ
యు... డు కర్మ
(శుః)సిచిబళర(తస)
(య)గంభం.....

**శాసనసారాంశం:** 13వ శతాబ్దానికి చెందిన తెలుగులిపిలో, తెలుగుభాషలో అగసాల(కంసాలి) లింగోజు శుభకృత్ సం.ర శ్రావణ శుద్ధ విదియ, శనివారంనాడు వేయించిన స్తంభశాసనం.

తోరణ స్తంభాలకు తూర్పు వైపు ఉన్న రెడ్డి వాడకి చివరన దుంపలపల్లి దర్వాజగా పిలవబడే ఎత్తైన ప్రవేశ ద్వారం వంటిది ఉండేది.

**దుబ్బాక నామకరణం:** గ్రామానికి 4కి.మీ.ల దూరంలో చౌదరిపల్లెలో ఉన్న దుబ్బ రాజేశ్వరస్వామి (పురాతన శివాలయం)పై భక్తితో ఈ గ్రామానికి ఆ పేరు పెట్టినారంటరు. పొడిబారిన (దుబ్బ) నేలపై ఉన్న ఆవాసప్రాంతం (పాక) కనుక దుబ్బంపాక= దుబ్బాక అయిందేమో. ఉదా: (కొండపాక, కొలనుపాక)

**ఐదుగురు అక్కచెల్లెండ్ల ఊరు:** దుబ్బక్క, లచ్చక్కరాజక్క, రామ్మక్క, ధర్మక్కలు అయిదుగు అక్క చెల్లెళ్ల పేరు మీద దుబ్బాక, లచ్చపేట, రాజక్క పేట, రామక్క పేట, ధర్మాజీ పేట (అన్నీ చుట్టుపక్కల గ్రామాలు) ఏర్పడ్డాయి అని అంటారు. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూరు మండలంలోని



నాణాలు



దూర్వాస



విఠలేశ్వరాలయం



చాళుక్యశైలి నంది



అమలకం



చాళుక్యశైలి గణపతి

కనకాయ్, గిరజాయ్ పేర్లున్న గ్రామాలు కూడా అక్కచెల్లెండ్ల పేర్లమీద వెలసినవే.

**దుబ్బాకలో ఉన్న ఆలయాలు**

1. శ్రీ కాశీ విశ్వనాథ ఆలయం
2. శ్రీ ఉమామహేశ్వర ఆలయం
3. పోచమ్మ గుడి
4. శ్రీ భక్త ఆంజనేయ స్వామి ఆలయం
5. శ్రీ విఠలేశ్వర ఆలయం
6. శ్రీ నీలకంఠస్వామి దేవాలయం
7. శ్రీ బాలాజీ దేవాలయం
8. రాంబాగ్ హనుమాన్ ఆలయం
9. శ్రీ మార్కండేయ ఆలయం
10. శ్రీ కేదారేశ్వర ఆలయం
11. గంగమ్మ గుడి
12. మారెమ్మ గుడి
13. శ్రీ మహంకాళి ఆలయం

**పోచమ్మ గుడి:** పోచమ్మగుడివద్ద 9 చాముండ శిల్పాలు, 1 బ్రాహ్మీ శిల్పం, 1 కాలాముఖాచార్యుని శిల్పం, 1 నాగశిల ఉన్నాయి. వీటిలో రాష్ట్రకూటుల కాలానివి, కళ్యాణీచాళుక్యుల కాలానివి విగ్రహాలున్నాయి.

**భక్తాంజనేయస్వామి గుడి:** చేతులలో తామరపువ్వుతో అంజలి ఘటించి, ఉత్తరాభి ముఖుడైవున్న శిఖాంజనేయస్వామి విగ్రహం ముందర చిన్న శివలింగం ఉన్నది.

**ఉమామహేశ్వరాలయం:** ఈ గుడిలో చక్ర, శంఖ చిహ్నాలతో, చేతులలో తామర పువ్వుతో అంజలి ఘటించి, ఉత్తరాభిముఖుడైవున్న 16వ శ. శిఖాంజనేయస్వామి విగ్రహం ముందర షోడశలింగప్రతిష్ఠతో పానవట్టమున్నది. ఇటువంటి లింగప్రతిష్ఠ అరుదు. వరంగల్, కొలనుపాకవంటి చోట్ల ఏకవింశతి లింగ ప్రతిష్ఠ కనిపిస్తుంది.

**కాశీవిశ్వనాథ దేవాలయం:** దుబ్బాక గ్రామానికి వాయువ్యం దిశగా ఉన్న పెద్ద చెరువు అనే బతుకమ్మ చెరువు వద్ద చిన్న శ్రీ కాశీ విశ్వనాథ ఆలయముంది. ఈ ఆలయం ముందు మెట్ల బావి ఉండేది, కానీ పూడ్చేశారు. శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రతియేటా వైశాఖ మాసంలో వైశాఖ శుద్ధ ఏకాదశి, ద్వాదశి రెండురోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ జాతర లో ఎద్దుల బండ్ల పోటీలు, అగ్ని గుండాలు, చివరి రోజు ఊరంతా రథం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణలు. గర్భగుడిలో భూమ్మీదున్న పానవట్టంలోశివలింగం, వెనక చతుర్భుజి అన్నపూర్ణ, గణపతి శిల్పాలున్నాయి.

**విఠలేశ్వరాలయం:** పాశుపత శైవం పద్దెనిమిది మంది ఆచార్యులతో దేశమంతా విస్తరించింది, తాత్వికపరమైన భేదాలతో కాపాలిక మరియు కాలాముఖ అనే రెండు ప్రధాన వర్గాలుగా తర్వాత కాలంలో విడిపోయింది. రహస్య పూజావిధానాలతో కాపాలిక ఆరాధన అనేది కొన్నిప్రాంతాలలో విస్తరించింది. ప్రత్యా భిజ్ఞా-వర్గమ్ కాలాముఖ ఉపశాఖకు కారణం. కాలాముఖులు సాత్వికమైన ఆరాధనా విధానాలతో దేవాలయాలూ, మఠాలను నిర్మించారు. 6వ నాటికే తెలుగు రాష్ట్రాలలో కాలముఖ ప్రస్థానమ్ మొదలైనది. 9వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం మధ్యకాలంలో ఆధిపత్యమతంగా కొనసాగింది. కాలాముఖంలో పరిషత్తులు వాటిలో పర్వతావళి, భుజంగావళి ఉపశాఖలేర్పడ్డాయి. దేవి, శక్తి, దుర్గ, అంబిక, గౌరీ, అపర్ణ, పార్వతి, కాళి ఇత్యాది పేర్లతో మహా శివుని భైరవ రూపానికి పత్నిగా ఆయా దేవీ రూపాలతో ఆరాధించబడ్డ 51 పీఠాల విశేషాల్ని, 42 పవిత్ర ఆలయాల గురించి తంత్ర చూడామణి చెప్తుంది. కాలాముఖుల్ని ప్రస్తావించిన శాసనాలు తెలంగాణాలో చాలా లభించాయి. కాలాముఖుల సంప్రదాయంలో విస్తరించి తర్వాత ఛిన్నమై కాలానికి శాసనాలతో



శాసనం



నరనాగదేవత రాష్ట్రకూటశైలి



చాముండ



బ్రాహ్మి



కాలాముఖా చార్యుడు



దుబ్బాక గ్రామం పోచమ్మ గుడి



జోడు ధ్వజ స్తంభాలు


ఉమామహేశ్వరాలయం


రాష్ట్రకూటశైలి నరనాగదేవత


భైరవుడు


కొత్త గణపతి


వీరభద్రుడు 15వ శ.

నవాదు గాక మిగిలిపోయిన ఆలయాలలో ఒకటి కొత్తగా వెలుగుచూసింది. గ్రామంలో విరలేశ్వరాలయంగా పిలువబడుతున్న శైవాలయంలో పానవట్టంమీద కాళికాదేవీ సమేతంగా ఆసీనుడైన యోగభైరవుని శిల్పముంది. ఈ శిల్పం సుఖాసీనమూర్తులలో భైరవుడు పర(వెనక) హస్తాలలో పరశువు మరియు శ్వానపతాకాన్నీ, నిజ(ముందరి) హస్తాలలో కుడిచేత అక్షమాల ధరించి, ఎడమచేత ప్రసారితహస్తంతో దర్శనమిస్తుంటే, దేవి ఖట్వాంగంతో, ప్రసారిత హస్తముతో కనిపిస్తుందని, ఈ శిల్పం ప్రతిమాలక్షణాల పరంగా యోగభైరవ, కాళికలని కళ్యాణీచాళుక్యులశైలి (10,11వ శ.) శిల్పాలని ప్రతిమా లక్షణవేత్త పి.మహేశ్ (సుపర్ణమహి), శ్రీరామోజు హరగోపాల్, కన్వీనర్, కొత్త తెలంగాణచరిత్రబృందం నిర్ధారించారు. ఈ మూలమూర్తి ముందర చిన్నదైన చతుర్భుజ కుమార స్వామి అర్చామూర్తి వుండడం కూడా విశేషమే. మహాపీఠ నిరూపణలో, కామరూప ఆరాధనలో కనిపించే జంటలలో మొదటిజంటగా కాళీ, యోగీశ భైరవులుంటారని పిదప జయదుర్గతో క్రోధభైరవుడు, మహిష మర్దినితో వక్రనాథుడు, యశోరేశ్వరితో చండభైరవులుంటారని వారు వివరించారు.

ఈ ప్రతిమను పొరపాటుగా వైష్ణవమూర్తి(విఠలుని)గా కొలుస్తున్నారు. ప్రతిమాలక్షణాలెరుగకపోవడంవల్ల జరిగిన తప్పిదం. తెలంగాణాలోనే గతంలో లభించిన ఏదులాబాద్ 9తలల చండభైరవుడు, ఇంద్రేశంలో స్వచ్ఛందభైరవుల స్థానాలు గొప్ప భైరవ మంత్రపీఠాలే. ఇపుడు దుబ్బాకలో 3వ భైరవమంత్రపీఠం గుర్తించబడ్డది. నాలుగో పీఠాన్ని అన్వేషించ వలసివుంది. దేశంలో ఇటువంటి భైరవమంత్ర పీఠాలున్న సమాచారంలేదు.

**చతుర్ముఖ వీరగల్లులు:** దుబ్బాకగ్రామం మొదట్లోగల శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం ఎదురుగా వున్న రావిచెట్టువద్దగల వీరగల్లు శిల్పం ఇది. మూడువైపులా చెక్కిన శిల్పాలు ఉన్నాయి, వెనుకవైపు కూడా ఉన్నట్టున్నాయి. (తడిమిచూస్తే స్పష్టంగా విల్లు పట్టుకున్న శిల్పం ఉన్నట్టుంది). ఈ వీరగల్లు శిల్పం రాష్ట్రకూటశైలికి (8,9వశ.) చెందింది. గుడికి దక్షిణం వైపున నాగదేవత శిల్పం ఉంది. కాశీవిశ్వనాథాలయం ఆవరణలో రాష్ట్రకూటశైలికే చెందిన మరొక చతుర్ముఖ వీరగల్లు శిల్పం ఇది. నలువైపుల వీరులు యుద్ధంలో పాల్గొన్న దృశ్యాలు ప్రత్యేకం. ఈ వీరగల్లు కనకాయ్ గుడిముందరున్న చతుర్ముఖ వీరగల్లు వంటిదే.

**దుబ్బాక సమీపంలోని చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ ఆలయాలు**

1. కూడవెల్లి శ్రీ రామలింగేశ్వర ఆలయం 8కి.మీ.లు
2. మోతె వెంకటేశ్వర ఆలయం 5 కి.మీ.లు
3. ధర్మాజీ పేట రామాలయం,శివాలయం 1 కి.మీ.
4. మిరుదొడ్డి 12 కి.మీ.లు
5. పుల్లూరు 18 కి.మీ.లు
6. ముస్తాబాద్ 15 కి.మీ.లు

**దుబ్బాక చేనేత ఘనత:**

మాఘమాసంలో వచ్చే మార్కండేయజయంతి సందర్భంగా జరిగే ఊరేగింపులో ఎద్దులబండిపై అమర్చిన మగ్గంమీద ఊరు తిరిగివచ్చేసరికి చీరనేసేవారు. అగ్గిపెట్టెలో పట్టేంత నాజూకుచీర నేసేనైపుణ్యం కలిగిన చరిత్ర వీరిది. ప్రస్తుతం దుబ్బాక లెనిన్ చీరలు, వస్త్రాలకు జాతీయస్థాయిలో గుర్తింపు ఉంది. దేశవ్యాప్తంగా ఎన్నుకోబడిన చేనేత వస్త్రాలలో దుబ్బాకలోనేసిన లెనిన్ వస్త్రాలు ఎన్నుకోబడి, ఒక వారంరోజులపాటు అయోధ్య బాలరాముడికి అలంకరణలో ఉపయోగించడం అంటే ఇది దుబ్బాక చేనేతల నైపుణ్యానికి మచ్చుతునక అని చెప్పుకోవచ్చు.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com


చతుర్ముఖ వీరగల్లు


గజలింగం


చతుర్ముఖ వీరగల్లు


షోడశలింగ పానవట్టం


అన్నపూర్ణ



# వనపటితి భైరవప్రతిష్ఠ శాసనం సవరింపు

మంతటిలో లభించిన ఒక శాసనం ఫోటోపంపి, చదువమని అడిగారు దేశపతి శ్రీనివాస్ గారు. హిమజ్వాలగారు తనకు పంపారట.

నేను ఈ శాసనం గురించి ఎంక్వైరీ చేస్తూ మా కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశోధకసభ్యుడు బైరోజు శ్యామసుందర్‌ను సంప్రదించినపుడు తాను కపిలవాయిగారి రచనల్లో వెతికి వివరాలు తెలిపారు.

నాగర్ కర్నూలుకు 6కి.మీ.ల దూరంలోవున్న నారాయణకట్ట, వలపట్ల దారిలో ఇటికెలదారిలో మంతటి దగ్గర ఈదెమ్మగుట్ట (బయ్యన్నగుట్ట) మీద ఈ శాసనం, భైరవవిగ్రహం ఉన్నాయి. వలపట్ల వనపట్లగా మారిపోయింది.

మట్టితాడు, మట్టితాటి నుంచి పలుకుబడి మారి 'మంతటి' పేరొచ్చింది. ఈ వూర్లో బయ్యన్నగుట్ట, ఆ గుట్టమీద భైరవుని విగ్రహం, ఆ భైరవప్రతిష్ఠ జరిగినపుడు వేసిన శాసనం ఉన్నాయి.

(కపిలవాయి కిషోర్ బాబు-నాగరకర్నూలు తాలూకా గ్రామనామాలు)

మహబూబునగర్ జిల్లా శాసనసంపుటి-1లో శాసనముందని తెలిసింది. అయితే శాసనపరిష్కారంలో తప్పులు దొరలినట్లు గుర్తించి, తిరిగి శాసనపాఠం సవరించనైనది.

శాసనంలో మూడంకెల శకవర్షం రెండంకెలలోనే వుంది. 97తర్వాత 'త్రద్నేయ' అనివుంది. మూడవ పంక్తిలో 'మసవళ'కు బదులు 'యెగవళ' అని, 'భైరవస ప్రతిష్ఠ వనిపతెతియ నమ'కి బదులు 'భైరవన ప్రతిష్ఠించెని పటతి యనస' అని వుంది.

**ఆ శాసనపాఠం:**

*"స్వస్తి సక వరిస 97(9)త్రద్నేయ విళంబి సంవత్స*
*ర క(న్దూ)ర సంకరగణ్డ నంకకాఱ*
*మసవళ కేతయన స్త్రిన*
*అత్తికబ్బయ మాడిసిద*
*భైరవన (ప్రతి(ష్ఠ) వనిపటెతి*
*యనమ॥"*

క్రీ.శ.105(8) విళంబి సంవత్సరంలో అంకకార కందూరు శంకరగండని మంత్రి కేతయ భార్య అత్తియకబ్బె వనిపటెతిలో భైరవప్రతిష్ఠ చేయించిందని శాసన సారాంశం. ఈ శాసనం మహబూబునగర్ జిల్లా శాసనసంపుటి-1లో శాసనసంఖ్య 71, పేజి నం.99లో అచ్చైంది.

- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# ఐనవోలులో సాంప్రదాయ పునాదులపై
# కాకతీయ కీర్తి తోరణ నిర్మాణం

కాకతీయుల కాలము నాటి 800 సంవత్సరాలక్రితం చెక్కబడిన కీర్తి తోరణం శిలలను గుర్తించి, యేరి కూర్చి, ఒక దగ్గర చేర్చి, విరిగి పోయిన శిలలను అతికించి జత చేసి ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణములో ఉత్తర దిక్కున నాటి కాకతీయుల కాలములో నిర్మించిన విధముగా నిర్మాణము చేయటము జరిగింది.

రాష్ట్ర పురావస్తు శాఖ సంరక్షణ విభాగము ఈ నిర్మాణ ప్రక్రియను సిమెంట్ కాంక్రీట్‌ను వాడకుండా సాంప్రదాయ పద్ధతిలో ప్రకృతి సిద్ధమైన మెటీరియల్స్‌తో పునాదులను నిర్మించింది. సిమెంట్ కాంక్రీట్ జీవిత కాలం 100 సంవత్సరాల లోపే ముగుస్తుంది. కాబట్టి నిర్దిష్ట జీవిత కాల పరిమితి లేని ప్రకృతిలో లభించే ఇసుక, మొర్రమ్, గ్రానైట్ మెటల్ మరియు రాతి పొడి మిశ్రమాన్ని కాంపాక్ట్ చేసి కావలసిన నేల సామర్థ్యాన్ని వృద్ధి చేసి ఆ పునాదులపై తోరణ నిర్మాణము చేపట్టటం జరిగింది.



శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయము ఐనవోలు (గ్రామము మరియు మండలము)లో వరంగల్ పట్టణానికి 19 కిలోమీటర్ల దూరంలో వుంది. ఐనవోలు చరిత్ర పరంగా ఎంతో ముఖ్యమయిన ప్రదేశము. ఇది 12 & 13వ శతాబ్ద కాలానికి చెందిన కాకతీయ దేవాలయము.

మొదట ఈ తోరణానికి సంబందించిన అసంపూర్తిగా తొలచిన శిలలను అప్పటి డైరెక్టర్ శ్రీమతి యన్.ఆర్. విశాలాక్షి గారు ఐనవోలు దేవాలయానికి అర్ధ కిలోమీటరు దూరములో ఔత్సాహిక ఆర్కియాలాజిస్ట్ శ్రీ అరవింద్ ఆర్యతో కలసి ఈ 800 సంవత్సరాల క్రితం తొలచిన కాకతీయ కాలానికి చెందిన శిలలను ఇంతవరకు ఎవరు గమనించని స్థితిలో నిర్లక్ష్యానికి గురై ఒక పశు వుల పాకలో పడివున్న వాటిని గుర్తించారు. ఈ శిలలు కాకతీయ కీర్తి తోరణానికి సంబంధించినవిగా, ఐనవోలు దేవాలయానికి ఉత్తర దిక్కున తోరణమునకు నిర్దేశించినవిగా గుర్తించి, అక్కడే రాష్ట్ర పురావస్తు తోరణాన్ని నిర్మించింది.

సాధారణంగా కాకతీయ తోరణానికి నాలుగు స్తంభాలు కలిగి ఒక జత ఒకవైపు మరోజత ఇంకోవైపు వుండి వీటిపైన రాతితో చెక్కిన రెండు పెద్ద దూలములు ఒకదానిపై ఒకటి అమర్చబడి ఉంటాయి. ఈ నాలుగు స్తంభాలు కూడా ఒకేరకమైన శిల్పసంపద కలిగి ఉంటుంది. పైన రెండు భుజాలకు చెక్కిన శిలలు అమర్చబడి ఉంటాయి. ఈ మొత్తము కట్టడము చెక్కిన రాళ్లతో ఒక పెద్ద అరుగుపై నిర్మించబడుతుంది. తోరణము మధ్యలో మెట్ల ద్వారము ఉంటుంది.

తోరణానికి సంబంధించి అక్కడ దొరికిన కొన్ని విడిభాగాల శిలలను గమనిస్తే తోరణ నిర్మాణం మధ్యలో ఆగిపోయినట్లు తెలుస్తుంది. ఎక్కడైతే తోరణ నిర్మాణం చేయాలని నిర్ధారించారో అక్కడ కేవలం కొన్ని విరిగిపోయిన విడిభాగాలు, దూలాలు, రెండు స్తంభాలు పడివున్నాయి. మిగిలిన రెండు విరిగిపోయిన స్తంభాలు మరియు ఇతర విడిభాగాలు అర్ధ కిలోమీటరు దూరం ఉన్నాయి. ఈ పరిస్థితి అంత పరిశీలిస్తే అప్పట్లో అంటే కాకతీయుల కాలంలో తోరణ నిర్మాణం అసంపూర్తిగా మిగిలి పోయిందని, విడిభాగాలు కూడా ఎక్కడివి అక్కడే వదిలేశారని, కాలక్రమంలో కొన్ని విరిగాయని అర్థమవుతుంది.

మొత్తం తోరణం బరువు 74.24 టన్నులుగా లెక్కించటం జరిగింది. అంటే ఒకవైపు గల ఒకజత స్తంభాలు మోయవలసిన బరువు 37.12 టన్నులు. ఈ జత స్తంభాలు ఒక పెద్ద రాయి 8'-6" పొడవు, 3'-6" వెడల్పు మరియు 2'-6" మందము రాతిపై అమర్చబడి ఉంటాయి. ఈ పెద్ద రాయి పునాదులపై ఉంటుంది. ఇప్పుడు ఈ పెద్ద రాయి పునాదులపై మోపే బరువు ఒక చదరపు మీటరుకు 13.43 టన్నులు. ఇక్కడ స్థల పరిశీలన జరిపితే చదరపు మీటరుకు 2.5 టన్నుల బరువు కంటే ఎక్కువ మోయదు.

స్ట్రక్చరల్ ఇంజనీర్ ఇచ్చిన నివేదిక ప్రకారం పునాదుల నిమిత్తం ఒక మీటరు మందం సిమెంట్ కాంక్రీట్ బెడ్ వేయమని సూచించారు. ఈ విషయమై సాధ్యాసాధ్యాలను, సిమెంట్ కాంక్రీట్ జీవిత కాల పరిమితి 100 సంవత్సరాల లోపే అన్న విషయాలను దృష్టిలో ఉంచుకొని ఎన్.ఐ.టి. ప్రొఫెసర్స్ శ్రీ పాండురంగారావు, శ్రీ రమణమూర్తి మరియు ఆర్కియాలాజిస్ట్ శ్రీ రంగాచార్యులు





గార్లను సైట్‌కు ఆహ్వానించి చర్చింటం జరిగింది. ప్రస్తుతము ఐనవోలులో రెండు తోరణాలు దేవాలయానికి తూర్పున, దక్షిణాన మరియు వరంగల్లు కోటలో నాలుగు తోరణాలు ఎప్పుడో 800 సంవత్సరాల క్రితం నిర్మించినవి ఈరోజుకు కూడా నిల్చొని ఉన్నాయి. కాబట్టి మనము నిర్మించబోయే ఈ తోరణం ఆ స్థాయిలో నిలబడాలని లోతైన చర్చల అనంతరము నిర్ణయించటం జరిగింది.

ఇందుకుగాను సిమెంట్ కాంక్రీట్ వాడొద్దని, దానికి బదులుగా గచ్చు సున్నం కాంక్రీట్ గాని లేదా ప్రకృతిలో లభించే మెటీరియల్స్‌ను కాంపాక్ట్ చేసి నేలలో సామర్థ్యాన్ని పెంచాలని గాని సూచించటం జరిగింది.



కావున పునాదుల జీవిత కాలం పెంచేవిధంగా తోరణం నిర్మించే స్థలంలో 50' ఫీట్ల పొడువు 20' ఫీట్ల వెడల్పు 13' ఫీట్ల లోతులో పెద్ద గోతిని తవ్వి, అందులోకి రోడ్డు రోలర్ వెళ్లే విధంగా ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఈ గోతిలో 6" అంగుళాల మందం గ్రానైటు మెటల్, ఇసుక, మొర్రమ్, రాక్ డస్ట్ కలిపిన మిశ్రమాన్ని పరిచి దానిపై నీటిని చల్లి రోడ్డు రోలర్ తో 4" అంగుళాల మందం వచ్చేవరకు కాంపాక్ట్ చేయటం జరిగింది. ఇలా 10 ఫీట్ల ఎత్తు వరకు వరుస క్రమంలో అంటే 30 వరసలు కాంపాక్ట్ చేసాక నేల సామర్థ్యాన్ని పరీక్ష జరుపగా దాని బరువు మోసే సామర్థ్యము చదరపు మీటరుకు 27 టన్నులకు పెరిగింది. మనకు కావలసింది చదరపు మీటరుకు 13.43 టన్నులు మాత్రమే. ఇక్కడ ఫాక్టర్ అఫ్ సేఫ్టీ కూడా 2 కు చేరింది.

ఇప్పుడు దాని పైన రెండు పెద్ద రాళ్లను కొలతల ప్రకారం అమర్చి వాటి చుట్టూ గ్రానైట్ మెటల్, ఇసుక, మొర్రమ్, రాక్ డస్ట్ మిశ్రమాన్ని వరుసల ప్రకారం పేర్చి నీటిని చల్లి రోడ్ రోలరుతో వరుస ప్రకారం కాంపాక్ట్ చేయటం జరిగింది. ఈ పెద్ద రాళ్లపై కొలతల ప్రకారం నిలువు స్తంభాలను, ఒక స్తంభానికి 4 స్టెయిన్లెస్ స్టీల్ రాడ్స్ 1" అంగుళం వ్యాసం గలవి జాయింటింగ్‌తో నిలబెట్టటం జరిగింది.

నాలుగు స్తంభాలలో మూడు స్తంభాలు మధ్యలో విరిగినవి లభ్యమైనాయి. ఆ విరిగిన స్తంభాలను మధ్యలో నాలుగు రంధ్రాలు చేసి 1" అంగుళం వ్యాసం గల స్టెయిన్లెస్ స్టీల్ రాడ్స్‌తో అతికించటం జరిగింది. స్తంభాల చుట్టూ కాకతీయ కళాకృతిలో లభించిన శిలలను ఉపయోగించి అరుగు మరియు మెట్ల ద్వారము నిర్మాణము అయ్యింది.

ఈ నాలుగు స్తంభాల పైన క్షితిజసమాంతర దూలములను ఒకదానిపై ఒకటి ఉంచటం జరిగింది. రెండు భుజాలకు చెక్కిన శిలలను తొలచిన రంధ్రాలలో అమరుచటం జరిగింది.


పునాదులకు సంబంధించి ఎలాంటి సిమెంట్ గాని వేరే జాయింటింగ్ మెటీరియల్‌గాని వాడలేదు. అరుగు మరియు తోరణం శిలలను గచ్చు సున్నంతో జాయింటింగ్ చేయటం జరిగింది. పునాదులను ప్రకృతిలో లభ్యమైన మెటీరియల్స్‌ను కాంపాక్ట్ చేసి నేల సామర్థ్యాన్ని పెంచి నిర్మాణము జరిగింది. కాబట్టి తోరణము జీవితకాలం 500 సంవత్సరాలకు తగ్గదని భావన. ఈ నిర్మాణం 2017లో జరిగింది. అప్పటి ఆమాత్యులు గౌరవనీయులు శ్రీ కడియం శ్రీహరి గారు ప్రారంభోత్సవం చేసారు. ఈ తోరణ నిర్మాణం డిపార్టుమెంటు ప్రతిష్టను ఎంతో పెంచింది.

–బావండ్ల నారాయణ,
ఆర్కియాలాజికల్ ఇంజనీర్/డిప్యూటీ డైరెక్టర్(రైటైర్డ్),
డిపార్టుమెంట్ అఫ్ హెరిటేజ్ తెలంగాణ,హైదరాబాద్.

ప్రకృతి గమనం! 5 ప్రకృతి ధర్మం!!

# భూగోళం - అంతర్గత, బాహ్యకారకాలు!

చలనం ప్రకృతి ధర్మం! ప్రకృతిలో కేవలం సజీవులైన జంతువర్గమే చలిస్తుందనేది జీవశాస్త్ర పరిభాష! కాని, నిర్జీవులలో కూడా ఈ చలనం వుంటుందనేది భౌతిక, రసాయన శాస్త్ర నిరూపణలు. పదార్థం పరమాణువుల సమూహమని, ప్రతి పరమాణువులో ఒక కేంద్రకం వుంటుందని, ఇందులో ద్రవ్యరాశిని కలిగించే ప్రోటాన్లు, న్యూట్రాన్లు వుంటాయని, ఈ కేంద్రకం ఆధారంగా ఎలక్ట్రాన్లు భ్రమిస్తాయని మనమంతా రసాయన శాస్త్ర పుస్తకాల్లో చదువుకున్నాం. ఈ విషయాలు మరింత అవగతం కావాలంటే, 19వ శతాబ్దపు ఆవిష్కరణల్ని విధిగా తెలుసుకోవాలి. ముఖ్యంగా డాల్టన్, థామ్సన్, రూథర్‌ఫోర్డ్, బోర్‌లాంటి శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిన పరమాణు నిర్మాణాన్ని తెలుసుకోవాలి. ఈ ప్రతిపాదనలే భౌతిక వాదానికి పునాదులు వేసాయి. సృష్టికి మూలం పదార్థమేనని నిర్ధారించాయి. మార్క్సిజానికి, డార్వినిజానికి దారులు వేసాయి. ఏంగెల్స్ ప్రకృతివాద (Dilets of Nature)రచనకు దారితీసాయి. చివరికి పదార్థ ధర్మాలు లేని విద్యుచ్ఛక్తి, అణుశక్తి, ఉష్ణశక్తి, కాంతి తదితర శక్తిరూపాలు కూడా ఈ గమన సూత్రాలపైననే పయనిస్తాయి. ప్రసరిస్తాయి. రూపాంతరం చెందుతాయి. ఈ చలన సిద్ధాంతాలే న్యూటన్ గమన సూత్రాల, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాల ఆవిష్కరణకు కారణమయ్యాయి.




ఇలా ఓ శాస్త్రీయ సిద్ధాంతానికి, అవగాహనకు, సృష్టిలోని దృగ్విషయాలకు ఒక శాస్త్రంతో మరో శాస్త్రానికి, ఓ ఆవిష్కరణతో మరో కొత్త సిద్ధాంతానికి కారణాలు అయ్యాయి. అవుతూ వుంటాయి. కాని, భారత్‌లాంటి దేశంలో ఈ శాస్త్రపరమైన ఆలోచనలకు పాఠశాల స్థాయిలోనే అడ్డుకట్టలు వేయడం జరుగుతుంది. చివరికి ఉన్నత చదువు చదువుకున్న వారికి కూడా వీటిపట్ల పట్టింపు లేకపోగా, రేపటి తరాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయ వర్గానికి, ముఖ్యంగా భౌతిక, రసాయన విషయాల్ని బోధించే వారికి కూడా కనీస అవగాహన, పరిజ్ఞానం లేకపోవడం గుర్తెరిగిందే! మన దగ్గర సైన్సు చదువంతా కేవలం పరీక్షల కోసం, ఉద్యోగాలకోసమే గాని, వాస్తవ శాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించుకోవడం కోసం కాదు. అందుకే ఈ దేశంలో రాళ్లు మాట్లాడుతాయి. పాలు తాగుతాయి. భౌతిక, రసాయన, జీవశాస్త్ర అధ్యాపకులు (అధ్యయనం అనే పదంతో ఏర్పడినా, అధ్యయనం కొరవడిన వారు) బాబాల చుట్టూ, తిరుగుతారు. కుంభమేళాల్లో మునిగి తరిస్తారు.


ఈ సందర్భంగా, ఈ ప్రస్తావనలెందుకు అనే ప్రశ్నలు సహజంగా వస్తాయి. అయితే, అత్యధికులు (చదువురులతో సహా) భూమి భగవత్ సృష్టి కాబట్టి, ఎలాంటి ఆపద భూమికి వుండదని భావిస్తారు. మన పాఠ్యపుస్తకాల రచన కూడా ఉపరితల అంశాలకే పరిమితమై, అంతర్గ శాస్త్రీయ అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వకుండా వుంటుంది. మన పాఠ్యాంశాలు కేవలం ఓ వర్గ ప్రయోజాన్ని కాపాడడానికే రచించబడుతాయి. వీటిని విడమరిచి చెప్పే ఉపాధ్యాయులు నూటికి ఒకరో, ఇద్దరో వుంటారు. డార్వినిజాన్ని బోధించవద్దని చర్చి ఆదేశించడమేకాక, ఈ పాఠ్యాంశాన్ని పిల్లలకు శాస్త్రీయంగా బోధించినందుకు కేరళలో, పశ్చిమ బెంగాల్‌లో చర్చిల క్రోధానికి గురై ఉద్యోగాల్ని కోల్పోయిన ఉపాధ్యాయు లున్నారు. ఈ నేపథ్యంలోనే, పవిత్రమైన కుట్ర (The Holy Conspiracy) అనే సినిమా వచ్చింది.

మన నమ్మకాలకు సైన్సు ఎప్పుడు అతీతంగా, ఉన్నతంగా పయనిస్తూనే వుంటుంది. ఎన్నో విశ్వరహస్యాల్ని ఛేధిస్తూ మానవాళి మనుగడకై బాటలు వేస్తున్నది. ఇది ఇలా వుంటే, ప్రకృతి తనపనిని తాను చేసుకుంటూ పోతున్నది. ఎన్నో ఊహించని మార్పులకు లోనైతున్నది. జీవరాశి పుట్టకకు, ఎదుగుదలకు, రూపాంతరాలకు కారణమైన ఈ భూగోళం కూడా అంతర్గత, బాహ్య కారణాలకు నిరంతరం గురైతూనే వున్నది. విభిన్న కారకాల ప్రభావం భవిష్యత్‌లో ఎలా వుంటుందో ఇదిమిత్తంగా చెప్పలేకున్నా, పెను ప్రమాదానికి భూగోళం గురికాక తప్పదనే సంకేతాలు వస్తున్నాయి. ఇవి నిజాలా, వాస్తవాలా అని అనుకుంటే, జరుగుతున్న పరిణామాలు, విపత్తులు ఈ సంకేతాలకు నిదర్శనంగా వుంటున్నాయి. వీటి కారణంగానే జీవరాశితో పాటు మానవాళి కూడా ప్రాణనష్టాన్ని చూస్తూనే వున్నది. ఈ ఉదంతాలు ఏ ప్రాంతానికో, దేశానికో పరిమితం కాకుండా ప్రపంచవ్యాపిత

### అగ్నిపర్వతాలు – భౌగోళిక ప్రభావాలు

- ఇవి నిర్మాణాత్మకమైనవి.
- భూస్వరూపాల్ని మారుస్తాయి. కొత్తగా నిర్మిస్తాయి.
- ఇవి భూమిలో సముద్రగర్భంలో వుంటాయి.
- శంఖం ఆకారంలో వుండే ఈపర్వతాలపైన బిలం (రంధ్రం) వుంటుంది.
- అగ్ని పర్వతాలన్నీ ఒకే విధంగా వుండవు. వీటి నిర్మాణం, ప్రవర్తన వేర్వేరుగా వుంటాయి.
- మంచు అగ్నిపర్వతాలు కూడా వుంటాయి. వీటిని క్రయోవొల్కానోస్ అంటారు. ఇవి బృహస్పతి, శని, నెప్ట్యూన్‌లపై గలవు.
- భూ అంతర్భాగములోని భారీ ద్రవ్యరాశిగల ఖగోళ వస్తువు పై పెంకులో ఏర్పడే చీలికతో, లోవగల శిలాద్రవం, బూడిద, వాయువులు కలియక లావా రూపంలో అత్యంత ఒత్తిడితో బయటకు చిమ్మబడుతాయి.
- ద్రవపదార్థం అత్యంత వేడితో (వేలాది డిగ్రీల) బయటకు రావడంతో అగ్ని జ్వాలలు కొన్ని వందల కి.మీ. వరకు వెలుతురును విరజిమ్ముతాయి.
- పదుల కి.మీ. మేర దాని ద్రవపదార్థం విస్తరిస్తుంది.
- ఇది చల్లారిన తర్వాత ఆ పదార్థం శిలలా, ఖనిజంలా మారుతుంది.

మయ్యాయి. కాలగమనంలో, రుతు చక్రాల్లో, అనేక మార్పుల్ని చూస్తున్నాం. ఒకప్పుడు వాతావరణ శాఖ ప్రకటనలకు పెద్ద ప్రాధాన్యత వుండేది కాదు. ఇప్పుడంతా ఆ ప్రకటనల ప్రాధాన్యతతో పాటు హెచ్చరికలు మనకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి. ఏ విపత్తు ఏ రూపంలో వస్తుందో తెలియడం లేదు.




ఒకప్పుడు ఈ హెచ్చరికలు ఒక ప్రాంతానికి పరిమితంగా చూసే వాళ్ళం. కాని, ఇప్పుడు అన్ని ప్రాంతాలకు ఈ హెచ్చరికలు వర్తిస్తున్నాయి. ప్రకృతి విపత్తులకు ఒకనాడు బడుగు, బలహీన వర్గాలు అత్యధికంగా బలైతే, ఇప్పుడంతా తారుమారై, అందరు బలైపోతున్నారు. సాధారణ వాతావరణ పరిస్థితులు, దూరమై, అతి, అత్యంత భారీ, విపరీత, బలమైన, రెడ్ అలర్ట్ అనే పదజాలాన్ని ప్రతీ వాతావరణ హెచ్చరికకు ముందు జోడించాల్సి వస్తున్నది. ఒక వైపు వర్షాభావ స్థితివుంటే, మరోవైపు అత్యంత భారీవర్షాలు దావానలం, అగ్నికీలలు, హిమపాతం, మంచు తుఫానులు, మంచుఖండికలు అస్థిరతకు గురికావడం, ఇసుక తుఫానులు, సముద్ర అలలు సృతిమించడం... ఇలా ఎన్నింటినీ చెప్పుకున్నా ప్రకృతి విషయంగా

### అత్యంత పెద్ద అగ్నిపర్వతం

- హవాయిలోని మౌనాలోవా (Mamna Loa) అత్యంత పెద్ద అగ్నిపర్వతం
- ఇది సముద్ర ఉపరితలంలో 4 కి.మీ., సముద్రలోపల 5 కి.మీ. విస్తరించి వుంటుంది.
- సముద్ర అడుగు భాగంలో 8 కి.మీ. లోపల వుంటుంది.

మానవమేధ మరుగుజ్జుగానే వుంటున్నది.. సుఖవంతమైన అమెరికా, యూరప్ దేశాలు కూడా ప్రకృతికి తలొగ్గుతున్నాయి. చీకటి రాత్రులు, నిద్రలేమి, నిరాశ్రయం వారిని వెంటాడుతున్నాయి. అడవుల భస్మీపటలం, ప్రళయ ఘోషలు, మంచులో కూరుకపోవడం వీరికి పీడకలలుగా మారాయి. మానవుడి సాంకేతిక పరిజ్ఞానం కూడా వీటిని ముందస్తుగా పసిగట్టలేని స్థితి. అయినా మనిషి నిరంతర అన్వేషి. కారణాల్ని వెతుకుతున్నాడు. ఈ వెతుకులాటలో భూగోళ సంబంధ కొత్త విషయాలు తెలుస్తున్నాయి. ఈ విషయాలు భవిష్యత్‌కు హెచ్చరికలుగా వుంటున్నాయి.

### ఛిద్రమైతున్న భూ అంతర్గత పొరలు:

అఖండ గోండ్వానా (pangea) నుంచి విభిన్న ఖండాలుగా భూమి విడిపోయిందనేది మనకు తెలిసిన భూచరిత్ర. ఇలా విడవడిన ఖండాల మధ్యన మరింతగా ఎడం పెరుగుతున్నదనేది ప్రస్తుత అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఇది కేవలం ఉపరితలంకే కాదని, వందల కిలోమీటర్ల సముద్రాల అడుగులో కూడా భూపొరలు ఛిద్రమైతున్నట్లుగా ఆధునిక పరిశోధనలు చూపుతున్నాయి. ఇలా చీలిపోతున్న పొరలతో భూ అంతర్భాగాలలో అనూహ్య మార్పులు జరుగుతున్నట్లుగా పరిశీలకులు గుర్తిస్తున్నారు. ఉపరితల ఖండికలు కదులుతూ ఒకదానితో ఒకటి దూరమైతే వాటితోపాటుగా అనుబంధంగా వుండే ప్రకృతి సంపద, జీవావరణ వ్యవస్థ కూడా విడిపోతూ వుంటాయి. కాని, భూగర్భంలో జరిగే మార్పులు మరో కొత్త భౌగోళిక వ్యవస్థను ఏర్పరుస్తుందా, లేదా యావత్తు భూగోళం ధ్వంసమైతుందా అనేది ఇప్పటికిప్పుడే తేలే అంశం కాదు. ఇలా జరుగుతుందా అని ప్రశ్నించుకుంటే, ఇప్పటి భూగోళం ఇలాంటి చర్యలతోనే పరిణామం చెంది, గుణాత్మకంగా మారింది. హిమాలయ ప్రాంతం ఒకప్పుడు సముద్ర ప్రాంతమని మనం భౌగోళిక అధ్యయనాల్లో చదువుకున్నాం. అలాగే భారత ఉపఖండం టిబెట్టు వైపు సంవత్సరానికి కొన్ని సెంటీమీటర్ల చొప్పున కదులుతున్నట్లు భూగర్భ శాస్త్రజ్ఞులు



తిరుగుబోతు అలలు

ప్రస్తావిస్తున్నది తెలిసిందే! ఈ లెక్కన నేటి భూభాగాలు సముద్రాలుగా, సముద్రాలు భూభాగాలుగా రూపాంతరం చెందవచ్చు. పోతే, ఈ మార్పుకు వేలాది సంవత్సరాలు పట్టవచ్చు. ఈ మార్పు ఒక్కసారిగా జరిగే పరిణామం కాదు. ఇది మనం పరిశీలించనంతగా వుంటుంది. అంటే, ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలై వుండవచ్చు కూడా! ఈ మార్పును గుర్తించే సామర్థ్యం ఏ సాంకేతికతకు వుండదు.

మరి ఈ అంతర్గత భూపొరల చిరగడంతో, లోపలి పొర అయిన లోపలి కోర్ (innercore) నుంచి శిలాద్రవం బడబాగ్ని రూపంలో బయటకు చీల్చుకొని వచ్చే ప్రమాదం వుండవచ్చు. ఇలా జరుగుతే, అగ్ని పర్వతాలు లేని భారత్‌లాంటి (అండమాన్ దీవులు తప్ప) ఉపఖండంలో తిరిగి ఇవి పొడసూపవచ్చు! ఇదే కనుక జరుగుతే బడబాగ్ని దావానలంతో భూభాగమంత వ్యాప్తి చెందవచ్చు. యావత్ జీవరాశి (మానవుడితో సహా) పెను ప్రమాదంలో పడిపోవచ్చు! ఇది వాస్తవమా అని అనుమానం రావచ్చు. కాని, ఈ ముందస్తు పరిణామాల గూర్చి నేచర్ జియో సైన్సు (Nature Geo Science) పత్రికలో కథనాలుగా వచ్చాయి. వస్తూనే వున్నాయి. అమెరికా, కెనడా దేశాల్లోని జియో సైన్సు సెంటర్లు ఈ పరిశోధనల్ని చేపట్టడం, ఊహాగానాలు చేయడం చేస్తున్నాయి. అయినా మనం ఈ కథనాల్ని ఊహాజనితంగా భావించినా, ప్రపంచవ్యాపితంగా జరుగుతున్న విభిన్న రకాల విపత్తులు వీటికి ఉతాన్నిస్తున్నాయి. వివిధ రకాల విపత్తులను ముందస్తుగా గుర్తించి, జాగ్రత్తలు తీసుకున్నా జరగాల్సిన ప్రాణ నష్టం, విధ్వంసం జరుగుతూనే వున్నాయి. ఇక సముద్రాల్లో జనించే బడబాగ్నిని ఎదుర్కోవడం బహుశ మానవుడికి సాధ్యం కాకపోవచ్చు!

### భూభారం పెరుగుతుందా?... తగ్గుతుందా..?

'నీవు భూమికి భారం' అని దూషించడం తెలిసిందే. అంటే, సదరు వ్యక్తి జీవించడం వ్యర్థమని, పోతే భూమికి కొంత భారం తగ్గుతుందని సగటు మనిషి భావన. ఇదే అవగాహన చాలామంది చదువుకున్న వారికి కూడా కలగడం సహజం. ద్రవ్యనిత్యత్వ నియమం (Law of Conservation of Mass) ప్రకారం ఇలా జరగదు. పోతే ఓ ప్రాంతంలో భారం పెరుగుతే, విధిగా మరో ప్రాంతంలో భారం తగ్గుతుంది. ఇది వాస్తవిక, శాస్త్రీయ ఆలోచన. ఈ విధానాన్ని సర్దుబాటు (adjustment)గా పరిశీలకులు చెపుతారు. కాని, ఈ మధ్యన జరుగుతున్న పరిశోధనలు కొన్ని కొత్త విషయాల్ని బయటకు తెస్తున్నాయి. ఇందులో ప్రధానంగా హైడ్రోజన్, హీలియం లాంటి తేలికైన వాయువులు భూ ఉపరితల వాతావరణం నుంచి బాహ్య రోదసి (space)లోకి భూమ్యాకర్షణకు వ్యతిరేకంగా (anti gravitational) వెలుతున్నట్లు, ఇది సుమారుగా ప్రతి సంవత్సరం 50 వేల టన్నుల నుంచి లక్ష టన్నుల భారాన్ని కలిగి వుంటుందని అంచనా. ఉష్ణోగ్రత పెరిగిన కొద్ది, పదార్థంలోని అణువుల మధ్య కదలిక పెరిగి పరమాణువుల చలనం పెరగడం, ఒకదానికి ఒకటి దూరంగా జరగడం తెలిసిందే! కాని, ఉష్ణోగ్రత అధికంగా పెరిగితే ఈ వేగం మరింతగా పెరిగి భూమ్యాకర్షణకు దూరంగా వెళ్ళుతున్నట్లుగా భావిస్తున్నారు. అంటే పరమాణువుల వేగం సెకనుకు 11 కి.మీ. పైగా వుంటున్నట్లుగా గుర్తించాలి. దీనికి గల కారణం, భూమి సాధారణం కంటే, అధిక వేడిని పొందడమే!

ఇదే పద్ధతిలో వాతావరణంలోని నీటి అణువులు కూడా అల్ట్రా వయొలెట్ కిరణాలతో విడివిడి, హైడ్రోజన్ ఆక్సీజన్‌గా వేరైతే, హైడ్రోజన్ బాహ్య రోదసిలోకి వెళ్ళి పోతున్నట్లుగా కూడా పరిశీలనలు తెలుపుతున్నాయి. అలాగే భూమిలో జరిగే రేడియో ఆక్టివిటీ ద్వారా కుల్లింపబడిన పదార్థాల నుంచి వెలువడే హీలియం వాయువు కూడా భూ బాహ్య పరిధిని దాటిపోతున్నట్లుగా భావిస్తున్నారు. అనగా, హైడ్రోజన్, హీలియం లాంటి తేలికైన వాయువులు భూకక్ష్య పరిధి నుంచి టన్నుల కొద్ది వెళ్ళిపోతున్నాయి. అంటే, ఇదే మోతాదులో భూగోళం యొక్క ద్రవ్యరాశి (mass) కూడా తగ్గిపోతుందని భావన.

ఈ ప్రకృతి చర్యకు విలోమంగా ప్రతి సంవత్సరం సుమారు 40 నుంచి 50 వేల టన్నుల అంతరిక్ష దూళి, ఉల్కాపాతం భూమిని చేరుతున్నట్లుగా శాస్త్రజ్ఞులు లెక్కలు కడుతున్నారు. అంటే, భూకక్ష్య నుంచి వెళ్లిపోతున్న వాయువుల భారాన్ని బాహ్యరోదసి నుంచి వచ్చే రోదసి పదార్థాలు కొంతమేర సరితూచుతున్నాయి. అయినా

**ప్రపంచవ్యాపితంగా అగ్నిపర్వతాల సంఖ్య**

- 1350-1500 వరకు వున్నాయి
- ఇందులో 500 అగ్ని పర్వతాలకు చారిత్రిక గుర్తింపు వుంది.
- భారత్‌లో ఒకప్పుడు 8 వుండగా అందులో 2 కనుమరుగయ్యాయి.
- అమెరికా, జపాన్, రష్యా, ఇండోనేసియా, చిలీలలో అగ్నిపర్వతాలు అధికంగా వున్నాయి.
- ఇవన్నీ పసిఫిక్ మహాసముద్ర ప్రాంతాలు (Pacific's - Ring of Fire).

**దశాబ్ది అగ్నిపర్వతాలు**

- ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ వాల్కనాలోజి అండ్ కెమిస్ట్రీ ఆఫ్ ది ఎర్త్ ఇంటీరియర్ (IAVCEI) అంతర్జాతీయ అధ్యయనానికి 16 అగ్నిపర్వతాల్ని ఎంచుకున్నది.
- ఐక్యరాజ్యసమితి (UNO) ప్రాయోజిత విపత్తు తగ్గింపు దశాబ్దం (1990)లో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించినందున వీటికి దశాబ్ది అగ్నిపర్వతాలని పేరు.
- జనావాసాల సమీపంలో ఇవి పెద్ద విస్ఫోటకాలు కాబట్టి, వీటిని అధ్యయనానికి ఎంచుకున్నారు.

సుమారు 50 వేల టన్నుల భూభారం సంవత్సర సంవత్సరానికి తరుగుతున్నట్లే లెక్క. అయితే, ఈ తరుగుదల భూగోళం యొక్క మొత్తం ద్రవ్యరాశిపై ఏమాత్రం ప్రభావాన్ని చూపవు. అనగా, ఈ 50-60 వేల టన్నులు ప్రతి బిలియన్ భూద్రవ్యరాశిలో కేవలం 45వ భాగం మాత్రమే! (ప్రపంచ జనాభా 8 బిలియన్లు అనుకుంటే, ఇందులో కేవలం 360 మంది మాత్రమే తగ్గుతున్నట్లుగా లెక్క).

భూమి ఏర్పడి 4.54 బిలియన్ సంవత్సరాలుగా అంచనా వేస్తే, నాటికి నేటికి భూమి ద్రవ్యరాశి కేవలం 10 శాతం పెరిగిందని, ఇది కూడా థియా (Theia) అనే అంగారక (Mars) గ్రహంతో సమానమైన ఓ గ్రహం భూమిని ఢీకొట్టగా, భూ గోళం నుంచి చంద్రుడు విడివడినా, భూ ద్రవ్యరాశి పెరిగింది కేవలం పదిశాతమే! వీటితో పాటు, మానవ నిర్మిత యాంత్రిక ఉపగ్రహాలు, ప్రయోగించిన తర్వాత తిరిగి భూమికి రానివి సుమారు 65 టన్నులుగా అంచనా. ఈ లెక్కన వీటి ద్రవ్యరాశి భూగోలంపై ఎలాంటి ప్రభావాన్ని చూపవు.

వీటన్నింటి నేపథ్యంలో భూమికి బాహ్యంగా పెద్ద ముప్పు అంటూ ఏమిలేదు. అలాగే అతి దగ్గరలో (వేలాది సంవత్సరాల) కూడా ఎలాంటి ప్రమాదం వుండదని గట్టిగా చెప్పగలం. కాని, భూ అంతర్గత పొరల కదలిక, చిరుగుదల, కేంద్ర భాగంలో వుండే శిలాద్రవం భూమికి భవిష్యత్తులో ఎలాంటి ఉపద్రవాల్ని తెచ్చిపెడుతుందో మన ఆలోచన పరిధిలో లేవు. దీనికి మానవుడిగా చేయాల్సింది, భూమిని విభిన్న కారణాలతో గుల్లబొడవక పోవడమే!

**భూగోళం - అలల ప్రభావం:**

- సముద్రపు అలలు ఆహ్లాదకరంగా వుంటాయి. కొన్ని అలలు అలా కాదు. అలస్కా దేశంలో జులై 9, 1958 ఏర్పడిన లిటియూ బే సునామి (The Lituya Bay Tsunami) అత్యంత భారీ అలల్ని సృష్టించింది.
- సుమారు 90 మిలియన్ల టన్నుల భారీ మంచు ఖండికను గిల్‌బర్ట్ సంధిలోకి (Gilbert Inlet) అత్యంత వేగంతో పడగొట్టింది.
- దీంతో అన్ని వైపుల భూభాగాలు పెద్దకుదుపుకు గురై భూస్వరూపాలే మారిపోయాయి.


**రోగ్ (Rogue) అలలు:**

- ఇవి సునామిలా కాకుండా సముద్రాల అలల కలయికతో ఏర్పడుతాయి.
- సాధారణ అలలకన్నా ఇవి రెండు, మూడింతలు వుంటాయి.
- వీటిని గుర్తించలేము.
- వీటి అలల ఎత్తు సుమారు 1720 అడుగులుగా వుంటాయని గుర్తించారు.
- ఇవి ఎప్పుడు, ఏ ప్రాంతంలో వస్తాయో తెలియదు. కాబట్టి వీటిని తిరుగుబోతు (Rogue) అలలుగా గుర్తించారు.

*(వచ్చే సంచికలో.. మహానగరాల్లో కుంగుతున్న నేలను చూద్దాం!)*

**- డా॥ లచ్చయ్య గాండ్ల,**
m : 9440116162
e : drglachaiah@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు




**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com



*పూసాలో ఎర్రటి తల ఉన్న ఐబిస్ మరియు ఎర్రటి మెడ గల ఐబిస్. ఫోటో సౌజన్యం: బర్డ్స్ ఆఫ్ పూసా*

# పక్షి వైవిధ్యం - వ్యవసాయ మార్గనిర్దేశం

**భా**రత వ్యవసాయానికి జన్మస్థలం అయిన పూసా (ప్రస్తుత బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా) 1784లో స్థాపించబడిన బ్రిటిష్-ప్రేరేపిత గుర్రపు స్టడ్ ఫామ్‌కు ప్రసిద్ధి చెందింది. ఆ కాలంలోని బ్రిటిష్ పరిశోధకులు సేకరించిన ఆధారాలు దాని అనుకూలమైన వాతావరణంతో పూసా యొక్క చారిత్రక ప్రాముఖ్యతను తెలియచేస్తాయి. ఇది, ఇతర అంశాలతో పాటు, ప్రధానంగా ఆకలి మరియు కరువు సవాళ్లను అధిగమించడానికి వ్యవసాయ పరిశోధనలకు పునాదులు వేసింది. జంతు జీవవైవిధ్యం, సహజ తెగులు నిర్వహణ మరియు వ్యవసాయ-జీవవైవిధ్యం యొక్క జ్ఞానం చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా శతాబ్దాల నాటి పక్షి శాస్త్ర రికార్డులతో పర్యావరణ డేటాను పోల్చినప్పుడు.

### భారతదేశ పక్షుల ఆహారం

సి.డబ్ల్యు. మాసన్ తన 19వ శతాబ్దపు పుస్తకం "ది ఫుడ్ ఆఫ్ బర్డ్స్ ఇన్ ఇండియా"లో స్థానిక పక్షుల ఆహారపు అలవాట్లను నమోదు చేశారు. పూసా చుట్టూ ఉన్న వ్యవసాయ ప్లాట్లు, తోటలు మరియు చిత్తడి నేలల నుండి తీసిన 110 విభిన్న జాతులకు చెందిన 1,325 పక్షుల కడుపులోని పదార్థాల అన్వేషణతో. ఈ పుస్తకం పక్షులు తెగుళ్లు లేదా ధాన్యాన్ని కీటకాలు, సర్వభక్షకులు మరియు గ్రామినివోర్లుగా తినడం ద్వారా పంటలకు ఎలా సహాయపడతాయో /హాని చేస్తాయో ఉదహరించింది. అదే సమయంలో ఈ ప్రదేశంలో గొప్ప జీవవైవిధ్యం ఉనికి గురించి అంతర్దృష్టులను అందిస్తుంది.

డ్రోంగోలు, స్విఫ్ట్‌లు, రోలర్లు మరియు ఇలాంటి జాతులు స్వచ్ఛమైన కీటక భక్షకులు. ఇవి గాలిలో ఎగిరే కీటకాలను వేటాడటానికి ప్రసిద్ధి చెందాయి. అయితే, కీటక భక్షక వార్బ్లెర్‌లు వాటి ఆహారంలో పూల మొగ్గలు మరియు పండ్ల జాడలను కలిగి ఉన్నాయి. స్టార్లింగ్ కుటుంబానికి చెందిన గ్రామినివోరస్ సభ్యులు తరచుగా పప్పుదినుసు పంట పొలాలలో రబీ సాగులో దెబ్బతీసేవారు. అయితే నిగనిగలాడే స్టార్లింగ్‌లు ఇంటి కాకులు మరియు అడవి కాకుల మాదిరిగానే ఆహార ప్రాధాన్యతలను ప్రదర్శించాయి. కీటకాల నుండి పండ్ల వరకు. మైనాలు, సర్వభక్షకులు కావడంతో, తృణధాన్యాల పంటలకు నష్టం

వాటిల్లింది. కానీ చెదపురుగులు మరియు మిడతలు వంటి ముఖ్యమైన వ్యవసాయ-పర్యావరణ వ్యవస్థ తెగుళ్లను నిర్వహించడంలో కూడా ప్రయోజనకరమైన పాత్ర పోషించింది. ప్రిడేటరీ ష్రైక్‌లు మిడతలు, బల్లులు, ఫీల్డ్ ఎలుకలు మరియు చిన్న కీటకాలను సమర్థవంతంగా వేటాడాయి. గమనించదగ్గ విషయం ఏమిటంటే, పక్షి కడుపుల నుండి నమోదు చేయబడిన 55,000 ఆహార పదార్థాలలో మూడింట రెండు వంతులు కీటకాలు, వీటిలో మైలోసెరస్ వీవిల్స్, క్రోటోగోనస్ మిడతలు మరియు రైస్ హిస్పా బీటిల్స్ వంటి కీలక తెగుళ్లు ఉన్నాయి.

### ప్రస్తుత దృశ్యం

19వ శతాబ్దం నుండి 2021-22 మధ్య కాలంలో జరిగిన పరిశీలనల ఆధారంగా, సుమారు 50 జాతులను నమోదు చేశారు. ఆసక్తికరంగా, మాసన్ 1909 సర్వేలో నమోదు చేయబడిన 110 జాతులలో, 69.1 శాతం ప్రధానంగా రాబందులు వంటి స్కావెంజర్లు ఈ ప్రాంతంలో కనిపించడం లేదు. ఈ క్షీణత ప్రత్యక్ష మానవ ప్రభావాల వల్ల సంభవించే అవకాశం ఉంది. వీటిలో నివాస నష్టం, పశువైద్య పదార్థాల నుండి విషప్రయోగం మరియు విస్తృత పర్యావరణ అంతరాయాలు ఉన్నాయి. ఆధునిక యుగం వరకు అసలు జాతులలో 30.9 శాతం మాత్రమే కొనసాగాయి.



ప్రస్తుతం గమనించిన 50 జాతులలో, 68 శాతం, ముఖ్యంగా బ్లాక్ డ్రోంగోలు, గ్రీన్ బీ-ఈటర్లు మరియు వైట్ వాగ్‌టెయిల్స్ 1909 నుండి పూసా ప్రకృతి దృశ్యంలో వృద్ధి చెందుతూనే ఉన్నాయి. వాటి పర్యావరణ అనుకూలత, ప్రత్యేకమైన ఆహారం కోసం ప్రవర్తనలు, తెగులు నిర్వహణలో పాత్రలు మరియు పునరుత్పత్తి విజయం కారణంగా. మిగిలిన 32 శాతం కొత్త వలసవాదులు, ఇవి పక్షి సమాజ కూర్పులో మార్పులను ప్రతిబింబిస్తాయి. క్రియాత్మక పక్షి సమూహాలలో మార్పుల విశ్లేషణ సహజ తెగులు నియంత్రణకు కీలకమైన కీటక భక్షకులు మరియు రాప్టర్లలో పదునైన క్షీణతను వెల్లడిస్తుంది. మానవజన్య ఒత్తిళ్లు, ముఖ్యంగా వాతావరణ మార్పు, కీటకాల ఫినాలజీలో మార్పులను వేగవంతం చేశాయి. కీటక భక్షకులకు ఆహార లభ్యతను తగ్గించాయి మరియు వలస నమూనాలను మార్చాయి. కాకులు మరియు మైనాలు వంటి జాతులు ఇప్పుడు ప్రాంతాలలో ఆహారం కోసం విస్తృత కాలానుగుణ కదలికలను ప్రదర్శిస్తాయి. అదనంగా, పంట తీవ్రత నివాస క్షీణత, ఆహార వనరులలో మార్పులు మరియు సమాజ డైనమిక్స్‌కు అంతరాయం కలిగించడం ద్వారా పక్షి వైవిధ్యాన్ని మరింత దెబ్బతీసింది.

### ముందుకు సాగడం, చారిత్రక డేటాను డిజిటలైజ్ చేయడం


పక్షుల రిపోజిటరీలోని ఈ చారిత్రక పోలిక జీవవైవిధ్య పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను, వాతావరణ వైవిధ్యాలకు నిరోధకతను, మరింత ముఖ్యంగా, పక్షులలో ఆహారాన్ని ఎంచుకోవడం గురించి వివరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పక్షులు, కీటకాల జనాభా పురుగుమందుల వాడకం, ఆవాస నష్టాల నుండి తీవ్ర ముప్పులను ఎదుర్కొంటున్న సమయంలో, పుసా యొక్క ఈ ఉదాహరణ వారసత్వం, శాస్త్రం మరియు వ్యవసాయ పర్యావరణ శాస్త్రం ఎలా ఏకం కాగలవో చూపిస్తుంది. వారసత్వ పక్షులు మరియు సీతాకోకచిలుకలకు ఉద్దేశపూర్వక ఆవాసాలను సృష్టించడం ద్వారా, ఈ ప్రదేశం ఒక ఆశ్రయం, డైనమిక్ డేటా ప్రయోగశాలగా మారుతుంది. భూ వినియోగ మార్పుల యొక్క విస్తృత పర్యావరణ ప్రభావాలలో మూల్యాంకనాలు వ్యవసాయం జీవవైవిధ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో సమగ్ర వీక్షణను అందిస్తుంది. ఆవాస స్థితిస్థాపకత పద్ధతులను రూపొందించడంలో సహాయపడుతుంది. పర్యావరణ విశిష్టత ఆధారంగా జీవవైవిధ్య చక్రాలను ప్రోత్సహించడం సీతాకోకచిలుక తోటల ద్వారా పరిరక్షణ ప్రయత్నాల అవసర-ఆధారిత ప్రమేయానికి ప్రాధాన్యత ఇవ్వగలదు. శతాబ్దాల నాటి డేటాను eBird-లింక్ చెక్‌లిస్ట్‌లతో సమగ్రపరచడం ద్వారా, అభ్యాసకులు కాలక్రమేణా జాతుల పోకడలను ట్రాక్ చేసే జీవన డేటాబేస్‌ను సృష్టించవచ్చు. ఇది పక్షుల ఆడియో యొక్క లాగ్‌లను ప్రస్తుత డేటాబేస్‌లతో లింక్ చేయడానికి కృత్రిమ మేధస్సును సమగ్రపరుస్తుంది. ఇది మోడల్‌ను మరింత శక్తివంతం చేయడంలో సహాయపడుతుంది. ఇంకా, ఇటువంటి దీర్ఘకాలిక డేటాసెట్ పోలికలు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (IPM)లో నిర్ణయాలకు మార్గనిర్దేశం చేయగలవు. ప్రయోగాత్మక ప్లాట్‌లలో పెర్చ్‌లు, స్థానిక పండ్ల చెట్లు మరియు పక్షి ఆశ్రయాలను ఉపయోగించడాన్ని సూచిస్తాయి.

***ఎంఎస్ సాయి రెడ్డి, మోహిత్ శర్మ, ధ్రువ్ సింగ్*** *బీహార్‌లోని పూసాలోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్నారు.*

- డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్ సౌజన్యంతో

# యం.యస్. ఆచార్య

తెల్లవారుఝామున చదువరుల ఇంటిముందు పత్రికను ప్రతిరోజూ అందించేందుకు, కొన్ని గంటల దాకా సైకిల్ తొక్కుకోవలసిందే. ఎడిటర్ అయ్యే దాకా చిన్నప్పటినుంచే సైకిల్ తొక్కడమే జీవితం. నాన్నకు కడుపులో విపరీతంగా నొప్పి వచ్చేది. కడుపు పట్టుకుని పక్క అరుగుమీద పడి నొప్పి ఆగేదాక నిలబడేది. నొప్పి తగ్గిన తరువాత కాస్సేపు సైకిల్ నడిపేది. నాన్నను తలుచుకోగానే నాకు కళ్లు పొంగేవి. ఆ పోరాటశీలి యం.యస్. ఆచార్య (మాడభూషి శ్రీనివాస ఆచార్య) 3 అక్టోబర్, 1924లో జన్మించారు.




సాధారణంగా జయంతి, తరువాత వర్ధంతి సంవత్సరం సంఖ్యతో సాగిస్తారు. పుట్టిన తరువాతే కదా జీవనం మొదలయ్యేది! మధ్యలో చెప్పవలసింది ఇంకేమీ లేదా? ఇదీ ప్రశ్న. దంపతులిద్దరికీ వివాహ దినోత్సవం కూడా ముఖ్యమే. కాని వారికి కేవలం సొంతమైన వ్యవహారం. చదువు, ఉద్యోగాలు, కష్టాలు ప్రతి వ్యక్తికీ మామూలే. కొందరి వ్యక్తులను గుర్తు చేసుకుంటాం. ఆచార్య దివంగతులైన తరువాత మరిచిపోవడం కూడా సాధారణమే.

### నాలుగు దశాబ్దాల పాత్రికేయుడు

నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా పనిచేయడం అంత సులువు కాదు. జిల్లా కేంద్రం వరంగల్ వంటి పట్టణంలో ఆర్థికమైన వెన్నుదన్ను లేకున్నా రెండు పత్రికల సంపాదకుడిగా, నిర్వాహకుడిగా యం.యస్. ఆచార్య అనేక ఆటు పోటులను తట్టుకుంటూ, పత్రికా వ్యాసంగాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. దాని వెనుక ఎంతటి ప్రతిభా వ్యుత్పత్తులున్నాయో, పత్రికా నిర్వహణ పట్ల ఎంతటి దృఢదీక్ష ఉన్నదో విశ్లేషించబూనటం ఎంతటి వారికైనా సాధ్యం కాకపోవచ్చు. 'జనధర్మ', 'వరంగల్ వాణి' పత్రికలు ఆయన దీక్షా దక్షతలకు నిదర్శనాలుగా నిలిచాయి.

ఒక పత్రికను నిర్వహించాలంటే ధనంతో పాటూ అనేక వనరులు అవసరం. ఇవేవీ లేకుండా కేవలం సైద్ధాంతికత, నిష్ఠలతో బతుకుదెరువు కోసం సంగీతం, వైద్యాలను ఆశ్రయిస్తూ 'జనధర్మ', 'వరంగల్' 'వాణి' పత్రికలను అకుంఠిత దీక్షతో నడిపారు ఆచార్య. నివురు గప్పిన నిప్పులా కనపడే ఆచార్య జీవిత విశేషాలు తెలియని వారు ఆయన్ని చూసి అర్థం చేసుకోవడం కన్నా అపార్థం చేసుకోవడమే తరుచు జరిగేది.

ఆచార్యకు డిగ్రీలు లేవు. కాని చదువుల తల్లి వారింటి ఇలవేలుపు. వారిది పండితుల కుటుంబం. ఆయన సూర్యాపేటలోని వారి మేనమామల స్వగృహంలో రక్తాక్షి ఆశ్వయుజ శుద్ధ షష్ఠినాడు అంటే 3 అక్టోబర్ నాడు (1924) యం.యస్. ఆచార్య జన్మించారు. బాల్యం స్వస్థానం నెల్లి కుదురులో గడిచింది. అక్కడే 4వ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదివారు. తరువాత తండ్రి ప్రసన్న రాఘవాచార్యుల వద్దనే సంస్కృతం నేర్చుకున్నారు. శబ్ద మంజరి, బాల రామాయణం, ధాతుమంజరి, రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం (పూర్వ మేఘం 67 శ్లోకాల వరకు), పంచోపనిషత్తులు, తిరుప్పావై వంటి వాటిని అధ్యయనం చేశారు. తాతగారి కాలం నుండి కొనసాగుతున్న ఆచారం తండ్రిగారు పాటించి భోజనాలు పెట్టి విద్యార్థులకు విద్యనేర్పే పద్ధతి కొనసాగించే వారు. కొన్నాళ్లకు కుటుంబం గడవటం కష్టమైంది. సంస్కృత పాఠాలు తిండిపెట్టే స్థితి లేదు. దీంతో నారయ్య శాస్త్రి వద్ద నేర్చుకున్న వైద్యం, స్వయంకృషివల్ల అబ్బిన జ్యోతిష, మంత్ర శాస్త్రాలు కొంత కాలం ఆర్జనకు పనికి వచ్చాయి. కొన్నాళ్లు మృదంగం, తబలా, హార్మోనియం వంటి వాటిని వాయించారు. నాటక రచన కూడా చేశారు. అవే ఆయన బతుకు దెరువయ్యాయి.

### నాలుగు దశాబ్దాల పాత్రికేయుడు

నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా పనిచేయడం అంత సులువు కాదు. జిల్లా కేంద్రం వరంగల్ వంటి పట్టణంలో ఆర్థికమైన వెన్నుదన్ను లేకున్నా రెండు పత్రికల సంపాదకుడిగా, నిర్వాహకుడిగా యం.యస్. ఆచార్య అనేక ఆటు పోటులను తట్టుకుంటూ, పత్రికా వ్యాసంగాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. దాని వెనుక ఎంతటి ప్రతిభా వ్యుత్పత్తులున్నాయో, పత్రికా నిర్వహణ పట్ల ఎంతటి దృఢదీక్ష ఉన్నదో విశ్లేషించబూనటం ఎంతటి వారికైనా సాధ్యం కాకపోవచ్చు. 'జనధర్మ', 'వరంగల్ వాణి' పత్రికలు ఆయన దీక్షా దక్షతలకు నిదర్శనాలుగా నిలిచాయి.

### పల్లెటూరి పాత్రికేయుని ఆకాంక్ష

ఆంధ్రప్రదేశ్లో ఓరుగల్లు మండలానికి విశిష్ట స్థానమున్నది. సాహిత్య కృషికి, సాంస్కృతిక పరివ్యాప్తికి ఈ మండలం పేరెన్నికగన్నది. ఈ మండల ప్రాభవ ప్రాశస్త్యాలను గూర్చి మన కవులు, రచయితలు అనేక చరిత్రలు వ్రాస్తూ వస్తున్నారు.

పత్రికా రచయితల కోవకు చెందిన సారస్వత సేవాభిలాషి

శ్రీ యం.శ్రీనివాసాచార్య గారు వీరు 1958 సంవత్సరంలో జనధర్మ పత్రికను స్థాపించి, దాని సంపాదకులుగా వ్యహరించి ఈనాటి గ్రామీణ వ్యవస్థకు సరిపోను అన్ని హంగులతో సమాజానికి ఎనలేని సేవ చేస్తూ వస్తున్నారు. ఈ జనధర్మ పత్రిక ద్వారా రాజకీయ, పారిశ్రామిక సారస్వతంగానే కాకుండా రాజ్యంలో జరుగుతున్న అభ్యుదయ కార్యక్రమాలను గూర్చి ప్రబోధం చేస్తూ వస్తున్నారు. శ్రీ యం. ఎనివాసాచార్యులు గారు జనధర్మ పత్రిక ద్వారా భావితరాల వారికి పూర్వీకుల చరిత్రలను కొంతలో కొంత అందించుటకు ప్రయత్నించుచున్నారు. ఈ దినపత్రిక ద్వారా సాహిత్యంను పరివ్యాప్తి పరచుచూ భావితరాల వారికి ఉత్తేజాన్ని పురికొల్పుటలో ఎనలేని సేవ చేస్తూ నేటి సమాజానికి ఆశాజ్యోతిగా వ్యవహరించుచున్నారు.

**ఆచార్య మైలురాళ్లు**

- నవంబర్ 1958లో జనధర్మ వార పత్రిక ప్రారంభించారు.
- 1971లో స్వంత ముద్రణాలయం బాలాజీ ప్రెస్‌ను నెలకొల్పారు.
- 1980 జనవరిలో వరంగల్ వాణి దినపత్రిక వ్యవస్థాపన చేసారు.

1994 జులై 12 వాకా చివరి ఊపిరి ఆగిపోయే వరకు 70-71 ఏళ్ల వయసులో పత్రికల ద్వారా చైతన్యం ఆలోచనలను కల్పించారు. అప్పటినుంచి స్ఫూర్తిగా కొనసాగుతున్నారు.

దాదాపు 30 ఏళ్ల కిందట జనధర్మ వారపత్రిక ఆగిపోయినా, చేతులు మారిన వరంగల్ వాణి పత్రిక కొనసాగుతున్నది.

**యం.యస్. ఆచార్య....**

*తెలంగాణ స్వాభిమాన స్వాతంత్ర్య దీప్తికై అక్షరాయుధాలనిచ్చిన వాడు ప్రజానాయకుల వాకిలి కుక్క కాదు పత్రిక ప్రజల పాశుపతమ్మన్న వాడు...*

*నీలాలకు కాసులకు నియమాలు వదిలి భజన సేయు కొన్ని కలాలకన్న అక్షరాక్షరాన కాకతీయ పౌరుషమ్మునింపి, చురుకైన వాక్యాల చురకలిచ్చి*

*జనధర్మపు మాటయై బాటయై వరంగల్లు వాణియైబాణియైన పెన్ను...*

మనకు స్వాతంత్ర్యం ఆగస్టు 15, 1947 నాడు రాలేదు. మరో 13 నెలల తరువాత సెప్టెంబర్ 17న నిజాం అనంతమైన దుర్మార్గాలు అంతమైన రోజు. ఆ నిజాంలపైన పోరాడిన ఆనాటి యువకుడు యం.యస్. ఆచార్య. నిజాం కాలంలో తెలుగు పత్రిక చదవడమే నేరం. అయినా సరే చైతన్యం పెంచడమే తన పని. పత్రికే ఆ చైతన్యానికి ప్రతీక.

ఒక్క పేజీలో సరిపోయే విషయాన్ని మూడు నాలుగు పేజీల్లో విస్తరించి ప్రభుత్వాన్ని మోసం చేస్తూ కోట్లాది రూపాయలు తీసుకొనే అవకాశం ఉంది కాని, యం.యస్. ఆచార్య అందుకు ఒప్పుకోలేదు. పోతే పోయింది. ఇన్నాళ్ల పాటు బతుకున్న నీతిని ధర్మాన్ని జనధర్మాన్ని రక్షించుకోవడానికి అవినీతికి అమ్ముకోవద్దని నిర్ణయించుకున్నారు.

తెలంగాణ సాహిత్యానికి, సాంస్కృతిక వారసత్వానికి సముచిత గౌరవ ప్రాభవాలను కల్పించడానికి ఈ పత్రికల ద్వారా వేదికను ఏర్పరచాడు. సామాజిక సమస్యలను చర్చించడానికి పరిశోధనాత్మక వార్తాంశాలను గుప్పించడానికి, సమకాలీన సంకర విలువలను ఎండగట్టడానికి ఈ పత్రికలు ఎంతో ఉపయోగ పడినాయి. వరంగల్ కోసం, తెలంగాణ కోసం, జన్మభూమి కోసం జీవితమంతా ధారబోసిన యం.యస్. ఆచార్య జీవన పోరాటం వివరిస్తుంది ఈ పుస్తకం.

నిజాల కోసం బతికి, నిజాం దుర్మార్గాలకు బతుకు బలిచేసే దశలో తానే కాక, మొత్తం కుటుంబాన్ని, పత్రికనీ, పత్రికా స్వాతంత్ర్యాన్ని బతికించిన వ్యక్తి కథ ఈ పుస్తకం.

**పుస్తకం:** యం.యస్.ఆచార్య

**ప్రచురణ:** ఎమెస్కో బుక్స్ ప్రై.లి.

**వెల:** రూ.300

– కె. సత్యప్రసన్న

**డా. మాడభూషి శ్రీధర్ ఆచార్యులు (మాడభూషి శ్రీధర్)**

**జననం:** 10-11-1956

**అమ్మానాన్న:** రంగనాయకమ్మ, యం.యస్ ఆచార్య

**పునర్జన్మ:** 2022, కొనసాగుతున్న పునరక్షరాభ్యాసం

**చదువు:** వరంగల్లులో మామూలు చెట్టుకింద వీధిబడిలో మొదలైంది. ఆ తర్వాత వరంగల్లు సికెఎం కాలేజిలో బిఎస్సి; కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్బి పూర్తిచేసి బంగారు పతకం పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం (ర్యాంక్-1), ఎంసిజె (జర్నలిజం) (4 బంగారు పతకాలు) కూడా పొందారు. అసలు చదువు జనధర్మ, వరంగల్ వాణి, ఈనాడు పత్రికల్లోనే.

**వృత్తి:** హైదరాబాద్‌లో 'ఉదయం' మూసే దాకా స్టాఫ్ రిపోర్టర్: టిటిడిలో జరిగే అవినీతిని 25 వ్యాసాల్లో బహిర్గతం చేశారు. 15 ఏళ్లు పత్రికల్లో, న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా ఏడేళ్లు పని చేశారు.

14 సంవత్సరాలు హైదరాబాద్ నల్సార్‌లో లా ప్రొఫెసర్‌గా; ఢిల్లీలో అయిదేళ్లపాటు సమాచార హక్కు (RTI), కేంద్ర సమాచార కమిషన్ (CIC) లో సభ్యుడిగా 25 వేల తీర్పులు ఇచ్చారు. Times of India బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ & డీన్ (లా)గా పనిచేశారు. హైదరాబాద్ మహీంద్ర యూనివర్సిటీ మొదటి డీన్ (లా)గా ఉన్నారు. తెలుగులో, ఇంగ్లీషులో 60 పుస్తకాలు దాకా రచించారు.

## జియాలిజకల్ సర్వే ఆఫ్ ఇండియా - జియాలజిస్టులు ఖనిజాన్వేషణకై

# ట్రూ అడ్వెంచర్స్ ఆఫ్ జియాలజిస్ట్స్

జియోలాజికల్ ఇన్వెస్టిగేషన్స్ జరిపే సమయాలలో రకరకాల అడ్డంకులు, విపరీత పరిస్థితులు ఎదుర్కొంటారు. అలాంటి పరిస్థితులను అధిగమించి ఖనిజాన్వేషణ జరిపి దేశప్రగతికి ఎనలేని సేవలు చేశారు, చేస్తూనే ఉన్నారు. పీరియాడిక్ టేబుల్‌లో ఎనభై శాతం మూలకాలు భూమిలోని శిలల నుండే వస్తాయి. ఈ మూలకాలు కలిగిన ఖనిజాలను జియాలజిస్టులు వారు తీసుకొనే రిస్కులు ఎన్నోసార్లు వారి జీవితాలను సైతం లెక్కచేయకుండా దేశప్రగతికోసం ఖనిజాన్వేషణ కొనసాగిస్తారు. ఎన్నో పరిశ్రమలకు ఈ ఖనిజాలు రా మెటీరియల్స్‌గా ఉపయోగిస్తారు. దేశప్రగతిలో అత్యంత ముఖ్యమైన పాత్ర వహిస్తున్నా అతనికి సంఘంలో ఉండాల్సినంత గుర్తింపులేదు. ఎందుకంటే అతను ఒక అజ్ఞాత సైనికుని వలే తన అన్వేషణ కొనసాగిస్తుంటాడు.

ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని నేను అనగా కె. మహేందర్‌రెడ్డి మరియు తోటి సహోద్యోగి అశోక్‌కుమార్ గ్రోవర్ కలిసి చర్చించుకొని జి.ఎస్.ఐ. జియాలిస్టుల అనుభవాలను సంకలనము చేసి ఒక పుస్తకంగా ప్రచురించాలనే ఆలోచనతో 2020లో మొదలు పెట్టి 151 ముఖ్యమైనవి, 75 చిన్నవి సేకరించి పుస్తకంగా సంకలనం చేశాం. ఈ అడ్వంచర్స్‌లో అంటార్కిటికా నుండి మొదలు పెట్టి హిమాలయాలు, వెస్టర్న్ ఘాట్స్, ఈస్టర్న్ ఘాట్స్, డకాయిట్ / నక్సల్ బెల్ట్స్ మరియు పలు రకాల అనుభవాలు మొత్తంగా 13 థీమ్స్‌గా గ్రూప్ చేయబడినవి.




ఇటువంటి పుస్తకం ఇంతకు ముందు రాలేదు. అందుకని జియాలజిస్ట్‌ల ప్రొఫెషన్ దేశ ప్రగతిలో వారి పాత్రను, సంఘంలోని సామాన్య ప్రజానికి తెలియచేయడానికి ఈ పుస్తకాన్ని సంకలనం చేసి ప్రచురించడం జరిగింది. ఈ పుస్తకాన్ని జి.ఎస్.ఐ. జియాలజిస్టులకు అంకితం చేయబడినది. ఈ పుస్తకాన్ని వైట్ ఫాల్కన్ పబ్లిషర్స్ ప్రచురించారు. వారి ఆన్‌లైన్ స్టోర్‌లో, అమెజాన్ మరియు ఫ్లిఫ్‌కార్ట్ ప్లాట్‌ఫాంలో ఉంచారు. అక్కడి నుండి సేకరించవచ్చును.

- కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



ఆర్టిస్ట్‌లు వి.బాల్, ఎం.పి.మురళీధరన్ పుస్తకానికి వేసిన బొమ్మలు



అప్పటి భారత ప్రధాని మన్మోహన్ సింగ్ తన నివాసంలో మా టీం సభ్యులకు అభినందనలు తెలిపిన దృశ్యం

# పరీక్షల సమయం

ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో సాధారణంగా పాఠశాల విద్యార్థులు అయినా, కళాశాల విద్యార్థులు అయినా పరీక్షలు వ్రాయవలసిన సమయం. విద్యార్థులు ఆందోళన చెందుతూ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయం.

గతంలోకంటే పిల్లలపై మానసిక ఒత్తిడి విపరీతంగా పెరిగింది. పిల్లలకంటే పిల్లల తల్లిదండ్రుల పై ఇంకా ఎక్కువ పెరిగింది. మావలే మా పిల్లల భవిష్యత్తు మారకూడదని, మేము చదవని చదువంతా మా పిల్లలు చదవాలని వారిపై తీవ్ర మానసిక ఒత్తిడిని తల్లిదండ్రులే పెంచుతున్నారు.

బాగా చదివే (intelligent) విద్యార్థి కాని, సాధారణంగా చదివే (average) విద్యార్థి కానీ, వెనుకబడిన (dull) విద్యార్థి కానీ దీనికి మినహాయింపు కాదు.

GPA పద్ధతి రాక ముందు పాస్/ఫేయిల్ ఫస్ట్ క్లాస్ 60% సెకండ్ క్లాస్ 50% థర్డ్ క్లాస్ 35% అని ఉంటుండేది. చాలామంది పాస్ అయితే చాలు అనుకునే వారు. పిల్లలపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదు.



ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే ఉన్నంత వరకు ఒత్తిడి అంతంత మాత్రంగానే ఉండేది. ఎప్పుడైతే ప్రైవేటు విద్యా విధానం వచ్చిందో అప్పటినుంచి ఈ మార్కుల చదువు మొదలైంది. విద్యార్థి 97% మార్కులు సాధించినా ఆ 3% మార్కులు ఎందుకు రాలేదని ఒత్తిడి. పాఠశాలల మధ్య పోటీ తత్వం పెరిగి ఆ ఒత్తిడి పిల్లలపై రుద్దుతున్నారు. వారి వారి పాఠశాలల మనుగడ కోసం పిల్లలపై ఒత్తిడి పెంచుతూ, విషయ పరిజ్ఞానం కన్నా మార్కులు సాధించే మెళకువలు నేర్పిస్తున్నారు. వెరసి 97 నుండి 100% మార్కులు సాధించినా పిల్లలకు విషయ పరిజ్ఞానం ఉండడం లేదు.

గతంలో చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఉండేది. మానసిక ఒత్తిడిని తట్టుకునుటకు శారీరక వ్యాయామం చాలా సహకరిస్తుంది అందుకే ఆటవిడుపు కావాలంటారు. ప్రస్తుతం మైదానం లేని పాఠశాలలు ఎక్కువ. పాఠశాలలో పిల్లలకు క్రీడలు లేకపోవడం కూడా వారి మానసిక ఒత్తిడిని పెంచుతుంది.”

ఒక దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మాణం అవుతుంది అంటారు. ఈనాటి విద్యార్థులే రేపటి భారత పౌరులు. మంచి సమాజ నిర్మాణం జరగాలన్నా, చెడు సమాజ నిర్మాణం జరగాలన్నా విద్య పాత్ర ముఖ్యం. ఒక దేశ భవిష్యత్తును నాశనం చేయాలంటే ఆ దేశంపై అణుబాంబులు వేయవలసిన పని లేదు, కేవలం ఆ దేశ విద్యా వ్యవస్థను నాశనం చేస్తే ఆ దేశం దానికదే పతనం అవుతుందట.

గురువులు విద్యార్థి భవిష్యత్తు నిర్మిస్తున్నప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

పిల్లలు పరీక్షలకు సన్నద్ధమవుతున్నప్పుడు వారికి కావలసిన సౌకర్యాలను, వాతావరణాన్ని కల్పించాలి. మంచి గాలి వెలుతురు ప్రసరించే విధంగా చూసుకోవాలి. వారికి తేలికపాటి బలమైన ఆహారాన్ని అందించాలి. శరీరానికి నిద్ర కూడా అవసరం, రోజుకు శరీరానికి కావాల్సిన కనీస నిద్ర పోయే విధంగ చూడాలి. ఎలాంటి శారీరక మానసిక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి. అన్ని రోజులు కష్టపడి చదివిన వారిని, పరీక్ష ముందు రోజు రాత్రి ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా నిద్ర పోయేవిధంగ చూడాలి.

పరీక్ష రోజు మానసిక ఒత్తిడి లేకుండా పరీక్ష కావలసిన పెన్నులు పెన్సిల్స్ ఎరేజర్ షార్పునర్ ముందుగానే సరి చూసుకోవాలి. బయలుదేరే సమయానికి ఇది దొరకడం లేదు, అది దొరకడం లేదు అని గాబర పడితే అప్పటినుండే మానసిక ఒత్తిడి (Tension) మొదలవుతుంది.

రవాణా సౌకర్యం కూడా ముఖ్యం. సమయానికి కొంచెం ముందుగానే బయలుదేరాలి. పొరపాటున కొద్దిగ లేట్ అయినా ట్రాఫిక్‌లో ఇరుక్కు పోయినా ఆందోళన చెందవలసి వస్తుంది. తాను కూర్చోవలసిన గది, కూర్చోవలసిన సీటు ముందుగానే చూసుకుని ప్రశాంతంగా ఉండాలి. పైన చెప్పిన వాటిలో ఏఒకటి లోపించినా విద్యార్థి ఆందోళన చెందుతాడు.

విద్యార్థులు సంవత్సర కాలం కష్టపడి చదివి పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణులు కాకపోయినా, ఊహించిన మార్కులు రాకపోయినా పిల్లలు మానసిక క్షోభకు లోనవుతారు. మానసికంగా కృంగిపోయే పిల్లలను ముందుగానే గుర్తించి వారికి మానసిక స్థైర్యాన్ని కల్పించాలి. చదువు జీవితంలో ఒక భాగం, చదువే జీవితం కాదు అని వారిని ఊరడించాలి. చదువుకోకున్నా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వాళ్ల గురించి చెప్పాలి.

పిల్లలు చదువులో రాణించకున్నా వారికిష్టమైన రంగంలో ప్రోత్సహించాలి. వారి అభిరుచులకు అనుగుణంగా వారి మానసిక స్థాయికి సరిపోయే రంగాల్లో వారిని ప్రోత్సహించాలి.

–దామెర నర్సయ్య
m: 9849533754
e: damera089@gmail.com



# పూటకూళ్ళవ్వ

(గత సంచిక తరువాయి)

(**జరిగిన కథ:** ముంబై నుండి వచ్చిన రాజా రామ్మోహన్ రాయ్‌కి వారికి కేటాయించిన గది చూపించి విశ్రాంతి తీసుకొమ్మంటుంది అవ్వ. తెల్లవారి వ్యాయామం చేసుకుందామని బయటికి వచ్చిన రవి అక్కడ బోర్డు నిండా ఉన్న వాక్యాలను చూసి ఆశ్చర్యపోయి.. ఎవరు రాసారు అని ఆలోచనలో పడిపోతాడు.)

ఇంతలో అవ్వ మరియు రాజా రామ్మోహన్ రాయ్ ఇద్దరు ఒకేసారి అక్కడికి చేరుకున్నారు.

"గుడ్ మార్నింగ్" అన్న పలకరింపు విని రవి రామ్మోహన్ గారి వైపు తిరిగాడు.

"మీరు!?" అంటూ ఆగిపోయాడు రవి.

"నేను బాంబే నుండి నిన్న ఇక్కడికి వచ్చాను. నా పేరు రాజా రామ్మోహన్ రాయ్" అంటూ పరిచయం చేసుకున్నారు.

"నమస్తే!" అన్నాడు రవి.

తదేకంగా బోర్డు వైపే చూస్తున్న రవి వైపు చూస్తూ "అవి నేనే రాసానండి" అన్నారు రామ్మోహన్ గారు.

అప్పుడే బోర్డు వైపు చూస్తున్న అవ్వ.. ఆ మాటలకు ఆశ్చర్యంగా చూసింది. వెంటనే ఇలా అంది.. "రాయకూడదని కాదు కానీ, ఇన్ని మంచి వాక్యాలు ఒకేసారి రాసారు. అన్నింటికీ అర్థం "లోకంలో మంచితనానికి మానవత్వానికి మించిన అలవాటు మరొకటి ఉండదు" అన్నట్టుగా ఉంది. చూస్తుంటే ఏదో అనుభవ పూర్వకంగా రాసినట్టు అనిపిస్తోంది. విషయం ఏమిటో వివరంగా



తెలుసుకోవచ్చా!" మృదువుగా అడిగింది అవ్వ.

"నాకూ మిమ్మల్ని చూస్తుంటే నా అనుభవాలన్ని మీతో పంచుకోవాలని ఉంది. మీరు కూడా కూర్చోండి" రవి వైపు తిరుగుతూ అన్నారు రామ్మోహన్ గారు.

"మా సొంత ఊరు ఇక్కడే అయినా బిజినెస్ పనుల మీద ముంబై వెళ్లి అక్కడ బిజినెస్ బాగా డెవలప్ అవ్వడంతో కుటుంబంతో సహా అక్కడే స్థిరపడిపోయాను. ఎంత సంపాదించినా.. గొప్పలకు పోకుండా ఆపదలో ఉన్న వారికి, అవసరమైన వారికి ఎలాంటి సహాయం కావాలన్నా నాకు చేతనైన సాయం చేసే వాడిని. నాకు తగినట్టే నా భార్యా పిల్లలు కూడా నేను చేసే ప్రతి పనిలో తోడు ఉండేవారు. ఒకసారి నా కుటుంబం అంతా సెలవుల్లో వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్లారు. నేను ఒంటరిగా ఉన్నప్పుడు నేను సాయం చేసిన వాళ్ళందరి ఫోన్ నెంబర్లు నా దగ్గర ఉంచుకొని.. నాకు వీలైనప్పుడు వాళ్ళ క్షేమ సమాచారాలు తెలుసుకునే వాడిని. అప్పుడే ఒక సంఘటన జరిగింది. అది జరిగే రెండు రోజుల ముందటి వరకు కూడా వాళ్లందరితో ఫోన్ మాట్లాడాను. ఆ తర్వాత అనుకోకుండా ఒక సాయంత్రం హఠాత్తుగా భూకంపం రావడం.. అదే సమయంలో మా బిల్డింగ్‌లోని మరో అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగి అంతటా వ్యాపించడం మొదలైంది. ఎంతో ధైర్యంగా ఉండే నాలో కూడా భయం కలిగింది. బయటికి రావాలన్నా ఎటు నుండి మంటలు వ్యాపిస్తున్నాయో తెలియటం లేదు. భూకంపం తీవ్రత కూడా పూర్తిగా తగ్గలేదు. నేను నా దగ్గర ఉన్న ఫోన్ నెంబర్లు అన్నింటికి కాల్ చేయటం మొదలు పెట్టాను. నాకు షాక్ కలిగించిన విషయం ఏమిటంటే.. ఒక్కరు కూడా నా ఫోన్‌కు సరిగ్గా స్పందించలేదు. ఒకరు ఎత్తకపోవడం.. ఒకరు కాల్ కట్ చేయడం.. మెసేజ్ పెట్టినా చూడకపోవడం.. చూసినా రిప్లై ఇవ్వకపోవడం.. ఇవన్నీ చూసి నాకు గుండెపోటు వచ్చినంత పనైంది. ఫోన్ పక్కకు పెట్టి దిగులుగా కూర్చున్న సమయంలోనే సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యే విషయం జరిగింది. "సార్ సార్" అంటూ ఒకవైపు "అంకుల్" అంటూ మరోవైపు చుట్టూ అందరూ నన్నే పిలుస్తున్నారు. ఒకరు కిటికీ ఊచలు పగులగొట్టి నన్ను అందులో నుండి బయటికి తీసుకొచ్చారు. బయటికి వచ్చి చూస్తే తమ పోర్షన్ వైపు కూడా మంటలు వ్యాపిస్తున్నాయి. ఫైర్ ఇంజన్‌లో ముందుగా ఇటువైపే మంటలార్పుతున్నారు. పక్కనే అంబులెన్స్.. మరొక పక్కన నా సాయం పొందిన వారంతా కార్ డోర్స్ తీసి నిలబడ్డారు. నన్ను చూడగానే.. "మీకేం కాలేదు కదా!" అని పరిగెత్తుకుంటూ వచ్చారు. వాళ్ళందరినీ చూడగానే నాకు ఉద్వేగంతో కళ్ళలో నీళ్లు తిరిగాయి. నేను బయటికి క్షేమంగా రాగానే వారంతా మిగతా వారికి కూడా సాయం చేయడం మొదలుపెట్టారు. అందులో కొందరు "సారీ మాస్టారూ.. మేము సహాయ సిబ్బందికి ఫోన్లు చేస్తుండటంతో మీ ఫోన్‌కి రిప్లై ఇవ్వలేకపోయాం".. అంటుంటే అప్పుడు అర్థమైంది నాకు అసలు విషయం. మరో విషయం కూడా అర్థమైంది నాకు.. "మనం మంచి చేస్తే భగవంతుడు ఏ రూపంలో నైనా మనల్ని కాపాడుతాడు" అని. అది అందరూ గ్రహించాలనే ఏదో ఒక విధంగా అవకాశం వచ్చినప్పుడల్లా ఇలా తెలియచేస్తుంటాను." వివరంగా తెలియజేసారు రామ్మోహన్ గారు. "అంతేకాకుండా ఇది జరిగిన సమయంలోనే నేను ప్రాణాలతో బయటపడితే మా అమ్మ పూజించే కొవ్వూల లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నాను. మా అమ్మకు ఈ దేవుడంటే చాలా ఇష్టం. ఆలయ తోరణానికి విరాళం ఇవ్వడం వల్ల అక్కడ శిలాఫలకం మీద "యశోద" అని మా అమ్మ పేరు కూడా రాసి ఉంటుంది" అన్నారు రామ్మోహన్ రాయ్.

"చాలా సంతోషం బాబూ... నిదానంగా అక్కడికి వెళ్లి దర్శించుకోండి" అంది అవ్వ.

ఆ తర్వాత అందరూ ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్లారు.

(మిగతా కథ వచ్చే సంచికలో)

– మాదారపు వాణిశ్రీ
ఫోన్ : 9247286668
బొమ్మలు: కైరం బాబు








## MARCH 2026

Chief Guest Smt. Koganti Shilpavalli, IPS, Deputy Commissioner of Police, Central Zone, highlighted that every child is born with natural curiosity, a desire to explore, question, and understand the world.

Oxford Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |
| | | | | | | |

**Important Dates**

04 Mar - Holi
19 Mar - Ugadi (Telugu New Year)
21 Mar - Ramzan
27 Mar - Sri Rama Navami

NOTES :

Printed at : Deccan Press, Azamabad, Hyderabad.

Success is not built in a day, it is built every day you choose to learn.

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - February 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

## VOL 14వ వసంతంలో
## 163 ISSUES నూట అరవై మూడవ సంచిక
## పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



## దక్కన్ పదమూడు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 మార్చి సంచికతో 163 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).



**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar